

ఎంతమంది పిల్లల్ని కన్నా ప్రసూతి సెలవులిస్తాం 14

దక్షిణ భారతంలో జనానాల రేటు తగ్గుతోంది

ఎక్కువ మందితో ఎక్కువ సంక్షేమం: చంద్రబాబు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 343

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ.9:12 తదుపరి చతుర్దశి; నక్షత్రం: మఖ తె.4:05 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ.3:10-4:53; అమృతఘడియలు: రా.1:30-3:13; దుర్ముహూర్తం: మ.12:01-12:48; రాహుకాలం మ.12:00-1:30; సూర్యోదయం: 6:29; సూర్యాస్తమయం: 6:20 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నిషేధిత భూమికి రెక్కలు!

ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు బడాబాబుల యత్నాలు

టెక్స్‌టైల్ పార్కు కోసం సేకరించిన భూమిలో 22ఏ జాబితా నుంచి 20 ఎకరాలు గల్లంతు

22 ఏళ్ల కిందట 142 ఎకరాల భూసేకరణ.. ఇప్పటికీ అతీగతీ లేని టెక్స్‌టైల్ పార్కు

కేంద్రం ఇచ్చిన రూ.12 కోట్లకూ లెక్కల్లేవు.. రికవరీ చేయాలన్న ఆదేశాలూ బుట్టదాఖలు

భూముల క్రయవిక్రయాలు నిలిపివేయాలన్న కేంద్రం.. 500 కోట్ల భూములపై 'ఆనాటి' పెద్దల కన్ను

చక్రం తిప్పిన బడానేత కుటుంబ సభ్యురాలు!.. నిషేధిత జాబితా నుంచి తొలగించి కాజేసే యత్నం



టెక్స్‌టైల్ పార్కు స్థలం



టెక్స్‌టైల్ పార్కు ముఖ ద్వారం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/షాద్‌నగర్)

హైదరాబాద్ నగర శివార్లలో దాదాపు రూ.500 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు కోసమంటూ దాదాపు 22 ఏళ్ల కిందట రైతుల వద్ద సేకరించిన భూమిని మాయం చేసేందుకు కుట్ర చేస్తున్నారు. రెండు దశాబ్దాలు గడిచినా ఇక్కడ పార్కు ఏర్పాటు చేయలేదు. సరికదా.. కేంద్రం ఇచ్చిన నిధులను, బ్యాంకుల నుంచి రుణంగా తీసుకున్న సొమ్మునూ నొక్కేశారు. దీంతో, ఈ భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. దాంతో, ఆ భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టినట్లే పెట్టి.. ఇప్పుడు మాయం చేస్తున్నారు. సేకరించిన 142 ఎకరాల్లో ఇప్పటికే దాదాపు 20 ఎకరాల భూమి వివరాలు నిషేధిత జాబితా నుంచి అదృశ్యమయ్యాయి. ఇందుకు గత ప్రభుత్వంలోని బడా నేత కుటుంబ సభ్యురాలు చక్రం తిప్పారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మేల్కొనకపోతే మొత్తం భూములూ అన్యాక్రాంతమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ఇదీ టెక్స్‌టైల్ పార్కు కథ..

దేశంలో వస్త్రపరిశ్రమ అభివృద్ధి కోసం స్కీమ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కు (ఎస్‌ఐటీపీ)లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం 2003లో నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 31 టెక్స్‌టైల్ పార్కులను

మిగతా 10వ పేజీలో...



హైదరాబాద్‌లోని చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. చిత్రంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, విద్యార్థినులు

నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం

ఒక్కొక్కరికి రూ.3 లక్షల ఆర్థిక సాయం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా 5 లక్షల మందికి వర్తింపు

కొత్త పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వం

రూ.6000 కోట్లు కేటాయింపు

15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

జూన్ 2న మంజూరు పత్రాల అందజేత

డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి.. గత సర్కారు యువతను విస్మరించిందని విమర్శ

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువత కోసం 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా 5 లక్షల మంది యువతకు ఈ పథకం కింద స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తామని వెల్లడించారు. చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ సర్కారు నిరుద్యోగ యువతను పూర్తిగా విస్మరించిందన్నారు. కార్పొరేషన్లకు నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే యువతకు

మిగతా 13వ పేజీలో...

హామీల అమలులో జాప్యం..

ఆర్థిక పరిస్థితి బాగా లేకనే!

ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం


నెలాఖరులోగా రైతుభరోసా

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి 13

గిరిజన విశ్వవిద్యాలయం తొలి వీసీగా ప్రొఫెసర్

వై.ఎల్. శ్రీనివాస్

గద్దర్ అవార్డులకు ఎంట్రీల ఆహ్వానం



తెలంగాణ చలన చిత్ర పురస్కారాల విధి విధానాలు ఖరారు 10

ఫీచర్‌ఫిల్మ్స్, జాతీయ సమైక్యత, పర్యావరణం, వారసత్వ సంపద, చరిత్ర, బాలల చిత్రాలకు..

తొలిసారిగా ఉర్దూ భాషా చిత్రాలకు స్థానం

పైడి జయరాజ్, కాంతారావు పేరిట అవార్డులు

2014-23 మధ్య వచ్చిన చిత్రాలకూ..

అడుగడుగునా అపరిశుభ్రత

చెట్ల కింద, మరుగుదొడ్ల పక్కనే వంటలు

నెలల తరబడి మంజూరు కాని బిల్లులు 3

మధ్యాహ్న భోజనంతో విద్యార్థుల్లో అస్వస్థత

3.37 లక్షల మంది విద్యార్థులు తినడం లేదు

సన్నబియ్యం, బగారా, పలావ్ వడ్డించాలి

4 రోజులు గుడ్డు, 2 రోజులు అరటిపండ్లివ్వాలి

జూనియర్ కాలేజీల్లోనూ పథకం అమలు

190 కోట్లు అదనంగా ఇస్తే.. అన్నీ సాధ్యమే

రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా కమిషన్ సిఫారసులు



హైజాక్‌కు గురైన రైలు ఇదే..

రైలు హైజాక్

పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో ఘటన

రైల్లో 500 మందికి పైగా ప్రయాణికులు

క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసిన బలూచ్ ఆర్మీ

రైలుపై తొలుత కాల్పులు జరిపిన సాయుధులు.. పలువురికి గాయాలు

పోరులను వదిలేసి.. భద్రతా సిబ్బంది సహా 214 మందిని బంధించిన బీఎల్ఏ

సైనిక చర్య చేపడితే అందర్నీ చంపేస్తాం

జైళ్లలో ఉన్న బలూచ్ ఉద్యమకారులను 48 గంటల్లోగా వదిలేయాలి

పాక్ సర్కారుకు బీఎల్ఏ అల్టిమేటం

హెలికాప్టర్లు, డ్రోన్లతో పాక్ ఆపరేషన్

80 మందిని విడిపించినట్లు వార్తలు

150 మందికి పైగా సైనికుల దుర్మరణం

మాజీ ఎంపీ అబ్దుల్ ఖదీర్ వెల్లడి



కరాచీ, మార్చి 11: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో వేర్పాటువాదులు రైలును హైజాక్ చేశారు. 9 బోగీలతో, 500 మందికి పైగా ప్రయాణికులతో క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కు వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం సాయుధులైన దుండగులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ మార్గంలో 17 సొరంగాలు ఉంటాయని పాక్ రైల్వే అధికారులు తెలిపారు. 8వ నంబరు టన్నెల్ వద్ద వారు

మిగతా 2వ పేజీలో...

గ్రూప్-2లో పురుషుల హవా



హర్షవర్ధన్ సచిన్ మనోహర్‌రావు

టాప్ 10 ర్యాంకులన్నీ వారికే..

447 మార్కులతో హర్షవర్ధన్‌కు మొదటిస్థానం

తర్వాతి స్థానాల్లో సచిన్, మనోహర్‌రావు

జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల 14



ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి, ఎంపీలు

ఆర్ఆర్ఆర్ పనులు 2 నెలల్లో..

రెండున్నరేళ్లలో మామునూరు విమానాశ్రయం

కేంద్ర మంత్రులు గడ్కరీ, రామ్మోహన్ నాయుడు ఈ మేరకు హామీలు ఇచ్చారు

అన్యత్ర భయంతోనే అసెంబ్లీకి కేసీఆర్ 13

బీఆర్ఎస్ ఇక గతమే.. మరో పదేళ్లు రేవంతే సీఎం

ఢిల్లీలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి



బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో బండ ప్రకాశ్, కేటీఆర్, తలసాని, హరీశ్, మధుసూదనాచారి

తిట్టడం కాదు.. ఆధారాలతో నిలదీద్దాం

ఉభయసభల్లో సర్కారును ప్రశ్నిద్దాం

కాంగ్రెస్ అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడదాం

పార్టీపై దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం

19న రాష్ట్ర బడ్జెట్?

నేటి నుంచి శాసనసభా సమావేశాలు

ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రజల పక్షాన గళం వినిపిద్దామని, రేవంత్‌రెడ్డి సర్కారును ఇరుకునపెట్టేలా సమస్యలపై నిలదీద్దామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. అయితే సభలో అధికార, ప్రతిపక్షాలు తిట్టుకునేలా కాకుండా.. ఆధారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, అధికార పార్టీ అబద్ధపు ప్రచారాలకు కళ్లెం వేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చామని, మూడోవంతు సమయం పూర్తయిందని పేర్కొన్నారు. హామీల అమల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. మంగళవారం బీఆర్ఎస్

మిగతా 12వ పేజీలో...

రూ. 348.75 లక్షల కోట్లు

ఉఫ్

20 రోజుల్లో అమెరికా స్టాక్‌మార్కెట్లు మూటగట్టుకున్న నష్టం

మన దేశ బడ్జెట్‌కు ఇది ఏడింతలు

ట్రంప్ భస్మాసురహస్తం ఫలితం

సుంకాల యుద్ధం, యథేచ్ఛగా ఉద్యోగుల తొలగింపుతో అమెరికాలో ఆర్థిక అనిశ్చితి

పెట్టుబడులు వెనక్కి తీసుకుంటున్న ఇన్వెస్టర్లు

తీవ్ర ఆందోళనలో కార్పొరేట్ కంపెనీలు

కెనడా కార్లు, కలప, విద్యుత్ మాకు అవసరం లేదు.. ఆ దేశంపై సుంకాలు డబుల్: ట్రంప్

టెస్లా షేర్ల ధర పడిపోతున్న నేపథ్యంలో ఆ సంస్థ కారు కొంటానని ప్రకటించిన ట్రంప్

సుంకాల తగ్గింపుపై అమెరికాకు హామీ ఇవ్వలే

పార్లమెంటరీ కమిటీకి వెల్లడించిన కేంద్రం



(సెంట్రల్ డెస్క్)

రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన వెంటనే ట్రంప్ మొదలుపెట్టిన సుంకాల యుద్ధం అమెరికాకే గుదిబండగా మారుతోంది. చైనా, భారత్, కెనడా, మెక్సికో, యూరప్ దేశాల మీద.. పరస్పర పన్నుల పేరిట ట్రంప్ కొరడా ఝుళిపిస్తున్న విషయం తెలిసిందే. గత కొన్ని దశాబ్దాలుగా అమలైన ప్రపంచీకరణ విధానాలతో యావత్ ప్రపంచం ఓ కుగ్రామంలా తయారైంది. ఇటువంటప్పుడు, ట్రంప్ కొత్తగా.. 'మాకు మేమే.. మీకు మీరే' అంటూ తెచ్చిన సుంకాలతో ఆర్థిక వ్యవస్థలు

మిగతా 2వ పేజీలో...

క్యాన్సర్ 'కన్నె'ర్ర 12

పెరుగుతున్న కంటి క్యాన్సర్ కేసులు

పిల్లలపై రెటినోబ్లాస్టోమా ప్రభావం

ఎల్వీ ప్రసాద్‌కు ఏటా 500 కొత్త కేసులు.. వెయ్యి ఫాలో అప్ కేసులు

ముందే గుర్తిస్తే మంచిది: డాక్టర్లు



పాతికేళ్లకే కిడ్నీలు కుదేలు

యువతలో పెరుగుతున్న కిడ్నీ జబ్బులు

గతంలో 50 ఏళ్లు దాటాకే సమస్యలు.. ఇప్పుడు 20 దాటిన వారిలోనూ..!

మగవారిలో ఐజీఏ నెఫ్రోపతి.. ఆడవారిలో లూపస్ నెఫ్రోటిస్.. నిమ్స్ పరిశోధనలో వెల్లడి

పదేళ్లలో లక్షకు పైగా డయాలసిస్ కేసులు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టుమని పాతికేళ్లకే మూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో రక్తపోటు, మధుమేహం బారిన పడ్డవారు కిడ్నీలు దెబ్బతిని 50-60 ఏళ్ల వయసులో ఆస్పత్రులకు వెళ్లేవారు. కానీ,

మిగతా 14వ పేజీలో...



నిమ్స్‌లో డయాలసిస్ విభాగంలో పేషెంట్లు

రైలు హైజాక్

(మొదటి పేజీ తరువాయి)

రైలును అడ్డుకున్నారని చెప్పారు. తొలుత సాయుధ దుండగులు రైలుపై భారీస్థాయిలో కాల్పులు జరిపారని బలూచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రింద్ వెల్లడించారు. పలువురు ప్రయాణికులు గాయపడినట్లు తెలుస్తోందన్నారు. ఈ ఘటనకు తామే బాధ్యులమని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ప్రకటించింది. బీఎల్ఏ తీవ్రవాదులు రైల్వే ట్రాక్‌ను పేల్చివేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. వెంటనే వారు రైలుపై కాల్పులు జరిపి తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ఈ దాడిలో 30 మంది పాక్ సైనికులు మరణించినట్లు బీఎల్ఏ వెల్లడించింది. రైల్లో ఉన్న మహిళలు, వృద్ధులు, చిన్నారులు.. ప్రధానంగా బలూచిస్థాన్‌కు చెందిన వారిని వదిలిపెట్టి, వారిని సురక్షిత మార్గాల్లో గమ్యస్థానాలకు పంపినట్లు తెలిపింది. ప్రస్తుతం 214 మంది (ఇందులో 100 మందికిపైగా పాక్ భద్రతా సిబ్బంది) బందీలుగా ఉన్నట్లు తెలిపింది. తమపై ఏదైనా సైనిక చర్యకు ప్రయత్నిస్తే.. బందీలందరినీ చంపేస్తామని బెదిరించింది. ఘటనా స్థలానికి సహాయక, భద్రతా సిబ్బంది చేరుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. పాక్ ఆర్మీ సిబ్బంది, వైద్యులతో ఎమర్జెన్సీ రైలును పంపినట్లు అధికారులు తెలిపారు. బందీలను కాపాడేందుకు సైనిక చర్య ప్రారంభించామని, చివరి ఉగ్రవాదిని మట్టుబెట్టేవరకు ఇది కొనసాగుతుందని భద్రతా బలగాలు వెల్లడించాయి. హెలికాప్టర్లు, డ్రోన్లతో బాంబు దాడులకు దిగినట్లు సమాచారం. అయితే భద్రతా బలగాలు వైమానిక దాడులను ఆపకపోతే బందీలను చంపేస్తామని బీఎల్ఏ హెచ్చరించింది. ఇదిలా ఉండగా పాక్‌కు చెందిన మాజీ ఎంపీ అబ్దుల్ ఖదీర్ బలూచ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. బందీలను విడిపించేందుకు బీఎల్ఏతో పోరాటానికి దిగిన పాక్ సైనికుల్లో 150 మందికి పైగా మరణించినట్లు చెప్పారు.

80 మంది బందీలను విడిపించాం

జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లో బీఎల్ఏ చెరలో ఉన్న వారిలో 80 మందిని విడిపించినట్లు బలూచిస్థాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి షాహింద్ రింద్ తెలిపారు. రైల్లోని ఒక బోగీ నుంచి 43 మంది పురుషులు, 26 మంది మహిళలు, 11 మంది చిన్నారులను రక్షించినట్లు వెల్లడించారు. రైలు ఇంకా టన్నెల్‌లోనే ఉందని, భద్రతా బలగాలకు బీఎల్ఏ ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరుగుతున్నాయని చెప్పారు. రైల్లో ఇంకా 400 మంది వరకు ప్రయాణికులు ఉన్నారన్నారు.

● జైళ్లలో ఉన్న బలూచిస్థాన్ ఉద్యమకారులందరినీ విడిచిపెట్టాలని బీఎల్ఏ డిమాండ్ చేసింది. వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని పాక్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. 214 మంది బందీల్లో పాకిస్థాన్‌కు చెందిన మిలిటరీ, పారామిలిటరీ, పోలీస్, నిఘా అధికారులు ఉన్నట్లు తెలిపింది. 48 గంటల్లోగా బలూచిస్థాన్ రాజకీయ ఖైదీలు, ఇతర ఉద్యమకారులను విడిచిపెట్టకపోతే బందీలందరినీ చంపేస్తామని హెచ్చరించింది.

వేర్పాటువాదుల వరుస దాడులు..

బలూచిస్థాన్ వేర్పాటువాదులు పాక్‌లో వరుసగా దాడులకు పాల్పడుతున్నారు. పోలీస్ స్టేషన్లు, రైల్వే మార్గాలు, వాహనాలపై దాడులు చేస్తున్నారు. గత నవంబరులో క్వెట్టా రైల్వే స్టేషన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 26 మంది మరణించారు. 62 మంది గాయపడ్డారు. బలూచిస్థాన్ ప్రావిన్స్‌కు ఇరాన్, అఫ్ఘానిస్థాన్ సరిహద్దులుగా ఉన్నాయి. బలూచ్ ప్రజల స్వయం నిర్ణయాధికారం, పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం కోరుతూ బీఎల్ఏ 2000 సంవత్సరం ప్రారంభం నుంచి పాక్ సైన్యంపై దాడులకు పాల్పడుతోంది. పాక్‌తో పాటు అమెరికా, యూకేలు బీఎల్ఏను ఉగ్ర సంస్థగా ప్రకటించాయి. చైనా చేపట్టిన చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సీపెక్) బలూచిస్థాన్ గుండా వెళ్తుండడం ఈ దాడులకు ప్రధాన కారణం. ఆర్థిక వృద్ధికి సీపెక్ తోడ్పడుతుందని పాకిస్థాన్ పేర్కొంటుండగా.. తమ ప్రాంత వనరులను కొల్లగొట్టడానికి ఇదో ఎత్తుగడ అని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆయుధ దిగుమతుల్లో.. ఉక్రెయిన్ తర్వాత మనమే!

న్యూఢిల్లీ, మార్చి 11: రష్యాతో యుద్ధం కారణంగా ఉక్రెయిన్ పెద్దఎత్తున ఆయుధ సమీకరణ చేస్తోంది. ఆయుధ దిగుమతుల్లో ఆ దేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలువగా.. పాకిస్థాన్, చైనా నుంచి ముప్పు ఎదుర్కొంటున్న భారత్ రెండో స్థానంలో ఉందని అంతర్జాతీయ స్వతంత్ర సాధికార విశ్లేషణ సంస్థ 'స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రీ)' వెల్లడించింది. అయితే 2014-19తో పోల్చితే గత నాలుగేళ్లలో భారత్ దిగుమతులు 9.3 శాతం తగ్గాయని సోమవారం విడుదల చేసిన తన నివేదికలో వెల్లడించింది. ఈ రిపోర్టు ప్రకారం.. 2015-19 నడుమ అమెరికా ఎగుమతుల వాటా 35 శాతం కాగా.. గత నాలుగేళ్లలో 43 శాతానికి పెంచుకుంది. ఆయుధ ఎగుమతుల పరంగా ఫ్రాన్స్ 9.6 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో చైనా (5.9%), జర్మనీ (5.6), ఇటలీ (4.8), యూకే (3.6), ఇజ్రాయెల్ (3.1), స్పెయిన్ (3%) నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రక్షణ దిగుమతుల్లో ఉక్రెయిన్ వాటా 8.8 శాతం కాగా.. భారత్ 8.3 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఉక్రెయిన్‌కు అందుతున్న ఆయుధాల్లో 45 శాతం అమెరికావే. ఇదిలా ఉండగా, పాక్ దిగుమతి చేసుకుంటున్న ఆయుధాల్లో 81 శాతం చైనావే కావడం గమనార్హం.

టాప్-20 కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే

న్యూఢిల్లీ, మార్చి 11: ప్రపంచంలోని 20 అత్యంత కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే ఉన్నాయని తాజా నివేదిక వెల్లడించింది. వీటిలో మేఘాలయలోని బర్నిహాట్ నగరం అగ్రస్థానంలో ఉందని తెలిపింది. ప్రపంచంలోనే అత్యంత కలుషిత రాజధాని ఢిల్లీ అని ఈ నివేదిక పేర్కొంది. స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ 'ఐక్యూఎయిర్'.. వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024ను మంగళవారం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం 2024లో ప్రపంచంలోనే అత్యంత కాలుష్య దేశాల్లో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. 2023తో పోలిస్తే (మూడో ర్యాంకు) పరిస్థితి కాస్త మెరుగైంది. ప్రపంచంలోని టాప్-20 కాలుష్య నగరాల్లో నాలుగు పాకిస్థాన్‌లో ఉండగా, చైనా, కజకిస్థాన్, చాద్ దేశాల్లో ఒక్కో నగరం ఉన్నాయి. ఈ జాబితాలో భారత్‌లోని బర్నిహాట్ తోపాటు ఢిల్లీ, ముల్లాన్‌పూర్, ఫరీదాబాద్, లోని, న్యూఢిల్లీ, గురుగావ్, గంగానగర్, గ్రేటర్ నోయిడా, భివాడి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడా ఉన్నాయి. బర్నిహాట్ నగరం అసోం-మేఘాలయ సరిహద్దులో ఉంది. ఈ ప్రాంతంలో ఇనుము, ఉక్కు కర్మాగారాలు ఎక్కువగా ఉన్నాయి.

చేనేత కార్మికుల వేతనాలు 20% మేర పెంపు

న్యూఢిల్లీ, మార్చి 11: చేనేత కార్మికుల వేతనాలు 20% మేర పెంచినట్టు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కె.వి.ఐ.సి) మనోజ్ కుమార్ మంగళవారం చెప్పారు. ప్రస్తుతం చరఖాపై చేసే ఒక నూలు కండెకు రూ.12.50 చెల్లిస్తుండగా, దాన్ని రూ.15కు పెంచినట్టు తెలిపారు. కండెకు రూ.2.50 పెంచామని, ఇది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించారు. గత పదేళ్లలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలు రూ.31వేల కోట్ల నుంచి రూ.1.55లక్షల కోట్లకు పెరిగినట్టు వివరించారు.

'ఫోరం'ల సభ్యులకు వెంటనే జీతాలు చెల్లించండి

రాష్ట్ర, జిల్లా స్థాయి వినియోగదారుల ఫోరంల చైర్‌పర్సన్లు, సభ్యులకు వెంటనే జీతాలు చెల్లించాలని అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇక నుంచి సకాలంలో జీతాలు చెల్లించేలా నిబంధనలు సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. తగిన విధంగా సవరణలు చేయకపోతే తామే రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకొని ఆదేశాలు ఇస్తామని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం తెలిపింది. జీతాలు సక్రమంగా చెల్లించలేదంటూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది.

అమెరికాకు అక్రమంగా వెళ్తూ గుజరాత్‌వాసి మృతి

న్యూఢిల్లీ, మార్చి 11: అమెరికాకు అక్రమంగా వెళ్తూ గుజరాత్‌వాసి ఒకరు మార్గమధ్యమంలోని నికరాగువా దేశంలో ప్రాణాలు కోల్పోయారు. ఆయనతో పాటు వెళ్లిన భార్యాపిల్లలు అక్కడ నిస్సహాయంగా మిగిలిపోయారు. సరయిన పత్రాలు లేని వారు నికరాగువా దేశం మీదుగా అక్రమ మార్గాల్లో అమెరికాకు వెళ్లడాన్ని డంకీ రూట్‌గా వ్యవహరిస్తుంటారు. గుజరాత్‌లోని సనర్‌కాంతా జిల్లా మోయద్ గ్రామానికి చెందిన దిలీప్ పటేల్ కూడా ఈ డంకీ రూట్‌ను ఎంచుకొని చివరికి ప్రాణాలు కోల్పోయాడు. రూ.కోటి ఇస్తే అమెరికాకు తీసుకెళ్తానని ఓ ఏజెంటు చెప్పడంతో పొలాలు అమ్మి అంతమొత్తాన్ని అతడికి ఇచ్చాడు. రెండు నెలల క్రితం భార్య, బిడ్డతో కలిసి టూరిస్టు వీసా మీద దుబాయ్ వెళ్లాడు. అక్కడి నుంచి నికరాగువా చేరుకున్నారు. మార్గంమధ్యలో అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయాడు.

'హద్దు' మీరితే ఐదేళ్ల జైలు

పాస్‌పోర్టు లేకుండా దేశంలోకి ప్రవేశిస్తే రూ.5 లక్షల జరిమానా కూడా

- లోక్‌సభలో వలస, విదేశీయుల బిల్లు
- ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిత్యానంద్

న్యూఢిల్లీ, మార్చి 11: వలస విధానం సహా విదేశీయుల రాక, పోక, బసకు సంబంధించిన కీలక బిల్లును కేంద్ర హోం శాఖ మంగళవారం లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారనర్స్ బిల్-2025'ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సభలో ప్రవేశ పెట్టారు. ఈ బిల్లు ద్వారా వలస విధానంలోని వివిధ సేవలను క్రమబద్ధీకరించనున్నారు. అదేవిధంగా విదేశీయులు భారత్‌లోకి రావడం, వెళ్లడం సహా నివాసం, వారి పర్యటనలు వంటి అన్ని వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు. విదేశీయులపై పూర్తి నియంత్రణ కేంద్రానికే ఉంటుంది. అయితే, ఈ బిల్లును ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి మరీ ఈ బిల్లును తీసుకువచ్చారని కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఈ విమర్శలను నిత్యానంద రాయ్ తోసిపుచ్చారు. వలస విధానం సహా, విదేశీయులకు సంబంధించిన అంశాలపై చట్టం చేసే సంపూర్ణ హక్కు కేంద్రానికి ఉందన్నారు. రాజ్యాంగంలోని కేంద్ర జాబితాలో ఈ అంశాన్ని చేర్చిన విషయాన్ని గుర్తు చేశారు. విదేశీ పర్యాటకులను స్వాగతిస్తామని, అదేసమయంలో దేశ శాంతి, సౌభ్రాతృత్వాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని నొక్కి చెప్పారు. బిల్లును ప్రవేశ పెడుతున్న సమయంలోనే అడ్డుకున్న కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ.. పాలక పక్ష భావజాలాన్ని అంగీకరించని విదేశీయులను దేశంలోకి అడుగుపెట్టకుండా చేయాలన్న ఉద్దేశం ప్రతిపాదిత బిల్లులో కనిపిస్తోందన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన విదేశీయులను దేశంలోకి అడుగుపెట్టకుండా చేసేలా ఈ బిల్లు ఉందని టీఎంసీ ఎంపీ సౌగత్ రాయ్ అన్నారు. అదే సమయంలో ప్రస్తుతం ఉన్న చట్టాల్లోని లోపాలను ఈ బిల్లు సరిచేస్తుందని, నకిలీల బెడదను తప్పించే అవకాశం ఉందని వ్యాఖ్యానించడం గమనార్హం.



లోక్‌సభలో మాట్లాడుతున్న నిత్యానంద్‌రాయ్

కాగా, ప్రస్తుతం 1939 నాటి విదేశీయుల రిజిస్ట్రేషన్ చట్టం, 1946 నాటి విదేశీయుల చట్టం అమల్లో ఉన్నాయి. వీటి ఆధారంగానే బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ఏడు విభాగాలుగా వీసాలను వర్గీకరించి 167 దేశాల ప్రజలకు వీసాలను మంజూరు చేస్తోంది. అదేవిధంగా జపాన్, దక్షిణ కొరియా, యూఏఈ దేశాల ప్రజలకు ఆరు ప్రధాన విమానాశ్రయాల్లో 'వీసా ఆన్ అరైవల్' విధానాన్ని కొనసాగిస్తోంది.

తాజా బిల్లులో ఏముంది?

- విదేశీయుల లీగల్ స్టేటస్ అంశం ఇకపై ప్రభుత్వంపై ఉండదు. వారే బాధ్యత వహించాలి.
- దేశ భద్రతకు, సౌభ్రాతృత్వానికి భంగం వాటిల్లుతుందని సందేహిస్తే.. సదరు వ్యక్తులను దేశంలోకి ప్రవేశించకుండా ఈ బిల్లు అడ్డుకుంటుంది.
- నకిలీ పత్రాలతో పాస్ పోర్టు పొందే వారికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించడంతోపాటు రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.
- ఇమ్మిగ్రేషన్ అధికారులకు ఈ బిల్లు విస్తృత అధికారాలను కల్పిస్తోంది. తద్వారా ఎలాంటి వారెంటు లేకుండానే వారు విదేశీ వ్యక్తులను అరెస్టు చేసే అధికారం లభిస్తుంది.

పీఎం కిసాన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు

పీఎం కిసాన్ పథకంలో ఇప్పటిదాకా చేరని రైతులు.. ఇప్పుడు పథకంలో చేరినా పెట్టుబడి సాయం అందిస్తామని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ చౌహాన్ పేర్కొన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇక, క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరంలో దేశంలో 200 డే క్యాన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా రాజ్యసభలో వెల్లడించారు.

డీలిమిటేషన్‌తో 9 రాష్ట్రాలకు నష్టం: కాంగ్రెస్

కుటుంబ నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల పాలిట లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) శాపంగా పరిణమించనుందని కాంగ్రెస్ ఆక్షేపించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మంగళవారం 'ఎక్స్'లో ఈ మేరకు భారీ పోస్టును ఉంచారు. 2026లో జనాభా అంచనా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే తమిళనాడు, కేరళ, ఏపీ, తెలంగాణ 8 సీట్లు చొప్పున కోల్పోనున్నాయని తెలిపారు. అలాగే, పశ్చిమబెంగాల్(4), ఒడిసా(3), కర్ణాటక(2), హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ ఒక్కో సీటు కోల్పోతాయన్నారు. ఇక యూపీకి 11, బిహార్‌కు 10, రాజస్థాన్‌కు 6, మధ్యప్రదేశ్‌కు 4 సీట్లు పెరుగుతాయని తెలిపారు. జార్ఖండ్, హరియాణా, గుజరాత్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఒక్కో సీటు పెరగనున్నట్టు వివరించారు. అసోం, జమ్మూకశ్మీర్, మహారాష్ట్రలో సీట్ల సంఖ్యలో మార్పు ఉండదన్నారు.

ఖర్గే వ్యాఖ్యలపై దద్దరిల్లిన రాజ్యసభ

- చైర్మన్‌ను అవమానించారంటూ అధికారపక్షం ధ్వజం

న్యూఢిల్లీ, మార్చి 11: రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలపై మంగళవారం దుమారం రేగింది. డిప్యూటీ చైర్మన్‌ను ఉద్దేశించి తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని, ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాత్రమే చేశానని వివరణ ఇచ్చిన ఖర్గే.. డిప్యూటీ చైర్మన్‌కు క్షమాపణ చెప్పారు. ప్రశ్నోత్తరాల అనంతరం జాతీయ విద్యా విధానంపై కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ మాట్లాడాలని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సూచించారు. ఆ సమయంలో తమిళనాడు ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకుగాను మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పాలంటూ పలువురు ప్రతిపక్ష సభ్యులు నిల్చొని డిమాండ్ చేశారు. సభలో గందరగోళం నెలకొనడంతో జోక్యం చేసుకునేందుకు ఖర్గే లేచి నిల్చున్నారు. అయితే, ఖర్గేకు ఉదయమే మాట్లాడే అవకాశం ఇచ్చామని, ఇప్పుడు దిగ్విజయ్ సింగ్ మాట్లాడాలని డిప్యూటీ చైర్మన్ స్పష్టం చేయగా, తాను మాట్లాడిన సమయంలో విద్యాశాఖ మంత్రి సభలో లేరన్న ఖర్గే.. 'ఇది నియంతృత్వం' అంటూ అసహనం వ్యక్తం చేశారు. 'అనాగరికులు, సంస్కృతి లేనివారంటూ దేశంలోని ఒక ప్రాంతం, ప్రజల ఆత్మగౌరవాన్ని మీరు కించపరుస్తున్నారు. దేశాన్ని ముక్కలు చేసేలా మాట్లాడుతున్నారు. మంత్రి రాజీనామా చేయాలి' అని ఖర్గే డిమాండ్ చేశారు. దీంతోపాటు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం సిద్ధమైందనేలా ఖర్గే హిందీలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సభాధ్యక్షుడి గురించి ఖర్గే అమర్యాదకరమైన వ్యాఖ్యలు చేశారంటూ అధికార పక్షం ఆందోళనకు దిగింది. ఖర్గే వ్యాఖ్యలు ఖండించదగినవని సభాపక్ష నేత జేపీ నడ్డా అన్నారు. దీంతో ఖర్గే వెంటనే క్షమాపణ చెప్పారు.





లోకం తీరు



ఎన్నికల ప్రక్రియ బలోపేతంపై చర్చిద్దాం

- దీనిపై త్వరలో సమావేశం అవుదాం
- రాజకీయ పార్టీలకు ఈసీ లేఖ

న్యూఢిల్లీ, మార్చి 11: ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియ బలోపేతంపై సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిల్లో ఏవైనా పరిష్కారం కాని సమస్యలపై ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు ఈసీ ఓ ప్రకటనలో తెలిపింది. చట్టానికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడంపై రాజకీయ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నేతలతో సమావేశానికి కూడా ఈసీ ప్రతిపాదించింది. ఈ మేరకు పరస్పర అనుకూల సమయంలో భేటీ అవుదామని పేర్కొంటూ అన్ని పార్టీలకు మంగళవారం వేర్వేరుగా లేఖలు పంపింది. ఓటర్ల జాబితాల అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్చ చేపట్టాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో.. నకిలీ గుర్తింపు కార్డు (ఈపీఐసీ) నంబర్ల అంశం పార్లమెంట్‌లో దుమారం రేపింది. దీనిపై పలు రాజకీయ పార్టీలు కూడా ప్రశ్నలు లేవనెత్తాయి. గత కొన్నేళ్లుగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో ఎన్నికల సంఘం విఫలమౌతోందని, ఈసీపై చర్యలు తీసుకోవాలని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ డిమాండ్ చేశారు. కాగా, బీజేపీ, టీఎంసీ, బీజేడీ పార్టీల ప్రతినిధి బృందాలు మంగళవారం విడివిడిగా ఈసీని కలిసి, ఓటర్ల జాబితాలో అవకతవకలపై తమ వాదన వినిపించాయి. దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిందిగా ఈసీని కోరాయి.

కెనడాపై సుంకాలు డబుల్

వాషింగ్టన్, మార్చి 11: తమ పొరుగు దేశం కెనడాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కన్నెర్ర జేశారు. కెనడా నుంచి అమెరికాకు దిగుమతయ్యే స్టీలు, అల్యూమినియంపై ఇప్పటికే విధించిన 25% టారిఫ్‌ను రెట్టింపు చేస్తూ 50 శాతానికి పెంచబోతున్నట్లు ప్రకటించారు. ఈ పెంపు నిర్ణయం బుధవారం నుంచి అమల్లోకి రానుందన్నారు. మరోవైపు కెనడాపై అమెరికా విధించిన 25 శాతం టారిఫ్‌లకు ప్రతిగా అమెరికాలోని మూడు రాష్ట్రాలకు తాము సరఫరా చేస్తున్న విద్యుత్ ఎగుమతులపై సుంకాలను 25 శాతానికి పెంచుతున్నట్లు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ప్రకటించింది. కెనడా తీసుకున్న ఈ నిర్ణయంపై మండిపడిన ట్రంప్ ఆ దేశానికి చెందిన కార్లు, కలప, విద్యుత్ ఇకపై తమకు అవసరం లేదని అన్నారు. సుంకాల విషయంలో కెనడా వైఖరిని తప్పుబడుతూ ఆ దేశాన్ని అతిపెద్ద సుంకాల దుర్వినియోగదారుగా అభివర్ణించారు. ఇకపై కెనడాకు అమెరికా సబ్సిడీ ఇవ్వబోదని ప్రకటించారు. కెనడా సుంకాలను పెంచుతున్నట్లు చెప్పిన అమెరికాలోని మూడు రాష్ట్రాల్లో విద్యుత్ ఎమర్జెన్సీని ప్రకటిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. కాగా, ప్రస్తుతం అమెరికాకు అత్యధిక ఇంధన ఎగుమతులు కెనడా నుంచే వస్తున్నాయి.

టెస్లా కారు కొంటా: ట్రంప్

టెస్లాను బహిష్కరించాలంటూ ఇటీవల అమెరికాలోని పలు ప్రాంతాల్లో నిరసనలు జరగడం, ఆ సంస్థ షేర్లు పడిపోతున్న నేపథ్యంలో తాను టెస్లా కారును కొనుగోలు చేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. మస్క్‌కు మద్దతుగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. "రాడికల్ లెఫ్ట్ భావజాలం కలిగిన కొంత మంది వ్యక్తులు కావాలనే కుట్రపూరితంగా టెస్లాను బహిష్కరించాలని ప్రయత్నిస్తున్నారు. టెస్లా ప్రపంచంలోనే గొప్ప ఆటోమేకర్. ఎలాన్ మస్క్ ఓ గొప్ప అమెరికన్. తనకు మద్దతుగా నేను రేపు సరికొత్త టెస్లా కారును కొనుగోలు చేస్తున్నాను. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో సహాయం చేస్తున్న అతణ్ని ఎందుకు శిక్షించాలి." అని ట్రంప్ పేర్కొన్నారు.

సింగపూర్‌లో వర్క్ పర్మిట్లపై కాలపరిమితి తొలగింపు

న్యూఢిల్లీ, మార్చి 11: వృత్తినైపుణ్యం కలిగిన భారతీయులకు సింగపూర్ ఆహ్వానం పలుకుతోంది. విదేశీ సిబ్బందిని ఆకర్షించడానికి తన విదేశీ ఉద్యోగితా విధానంలో ఆ దేశం మార్పులు చేసింది. ఈ మార్పులు భారతీయులకే ఎక్కువ ఉపయుక్తంగా ఉండనున్నాయి. పర్మిట్లపై పరిమితి ఎత్తివేత, వేతనపరిమితి భారీగా పెంపు, పదవీవిరమణ వయసు పెంపు వంటి కొత్త విధానాలతో భారతీయుల సేవలను మరింతగా ఉపయోగించుకోవాలని సింగపూర్ ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే జూలై ఒకటో తేదీన కొత్త విధానం అమలులోకి రానుంది. కొత్త పాలసీని అనుసరించి.. ఎన్‌టీఎస్ (నాన్ ట్రెడిషనల్ సోర్స్)లో భాగమైన దేశాలకు (ఇందులో భారత్ భాగస్వామి) చెందిన విదేశీ ఉద్యోగుల పర్మిట్లపై పరిమితి ఎత్తివేసింది. గతంలో గరిష్ఠంగా 14 నుంచి 25 సంవత్సరాలకు మాత్రమే పర్మిట్లు ఇచ్చేవారు. ఇకపై ఎటువంటి నియంత్రణ ఉండదు. విదేశీ సిబ్బంది వయో పరిమితిని 60 ఏళ్ల నుంచి 63 ఏళ్లకు పెంచారు. వేతన చెల్లింపుల్లోనూ భారీ మార్పులు చేశారు. కొత్త వేతన విధానం ఈ ఏడాది సెప్టెంబరు నుంచి అమల్లోకి వస్తుంది.

రూ.348.75 లక్షల కోట్లు ఉఫ్

(మొదటి పేజీ తరువాయి)

అతలాకుతలమవుతున్నాయి. స్వయంగా అమెరికా కూడా దీన్ని తప్పించుకోలేకపోతోంది. తీవ్ర అనిశ్చితి, ఆందోళన నేపథ్యంలో భారీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను అమెరికా స్టాక్ మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకుంటున్నారు. దీంతో గత 20 రోజుల వ్యవధిలో ఆ దేశ స్టాక్ మార్కెట్లలో నమోదైన టాప్-500 కంపెనీలు (వీటిని స్టాండర్డ్ అండ్ పూర్స్ 500 లేదా ఎస్ అండ్ పీ 500 అని అంటారు) ఏకంగా 4 లక్షల కోట్ల డాలర్ల (రూ.348.75 లక్షల కోట్ల) నష్టాన్ని చవి చూశాయి. మన దేశ బడ్జెట్ (రూ.50.65 లక్షల కోట్లు)తో పోల్చుకుంటే ఇది దాదాపు ఏడింతలు.



కొత్తలో మార్కెట్ల జోరు

వాస్తవానికి, గత ఏడాది నవంబరు 5వ తేదీన ట్రంప్ మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత అమెరికా స్టాక్‌మార్కెట్లు జోరు చూపాయి. పన్ను తగ్గింపులు, నియంత్రణల తొలగింపు వంటి విధానాలను ట్రంప్ తీసుకొస్తారని మార్కెట్ వర్గాలు ఆశించాయి. ఫలితంగా, స్టాక్‌మార్కెట్లు మంచి వృద్ధి రేటును నమోదు చేశాయి. గత నెల 19న ఎస్ అండ్ పీ 500 రికార్డు స్థాయిలో ముగిసింది. అయితే, ట్రంప్ పలు దేశాలతో సుంకాల యుద్ధం మొదలుపెట్టటం, స్వదేశంలో ప్రభుత్వ ఉద్యోగులను యథేచ్ఛగా ఉద్యోగాల్లోంచి తొలగించటం వంటి విధానాలను తెస్తున్న క్రమంలో స్టాక్‌మార్కెట్ల జోరు తగ్గిపోవటమే కాదు.. బతుకుజీవుడా అనే స్థాయికి చేరుకున్నాయి. సోమవారం ఒక్కరోజే ఎస్ అండ్ పీ 500.. 2.7% మేర పతనమై 8.6% వద్ద ముగిసింది. గత ఏడాది కాలంలో ఇదే అతి పెద్ద రోజువారీ పతనం. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి సోమవారం వరకు 20 రోజుల్లో ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్‌లో దాదాపు 10 శాతం పతనం నమోదైంది. ఫలితంగా కంపెనీలు 4 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయాయని వెల్లడైంది. అమెరికా స్టాక్‌మార్కెట్లలో అతి ముఖ్యమైన నాస్డాక్ కూడా సోమవారం 4% పడిపోయింది. 2022 సెప్టెంబరు నుంచి.. ఒక్కరోజులో నాస్డాక్ ఈ స్థాయిలో పతనం కావటం ఇదే తొలిసారి.

తీవ్ర గందరగోళం

కెనడా, మెక్సికో, యూరప్‌తో మొదలుపెట్టిన సుంకాల యుద్ధం కారణంగా నెలకొన్న అనిశ్చితి.. అనేక కార్పొరేట్ సంస్థలను, సీఈఓలను భవిష్యత్ ప్రణాళికలు సమీక్షించుకునేలా చేస్తోంది' అని హ్యూస్టన్‌లో జరిగిన ఓ వాణిజ్య సదస్సులో లాజార్డ్ సీఈఓ పీటర్ ఆర్స్‌జగ్ ఆందోళన వ్యక్తం చేశారు. లాజార్డ్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇండిపెండెంట్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు. చైనాతో సై అంటే సై అనే విధానాన్ని అర్థం చేసుకోవచ్చుగానీ.. కెనడా, మెక్సికో, యూరప్‌తో ట్రంప్ ఎందుకు దుందుడుకు విధానాల్ని అవలంబిస్తున్నారనే దానిపై గందరగోళం నెలకొందని పీటర్ పేర్కొన్నారు. దీనిపై రానున్న నెల రోజుల్లోపు స్పష్టత రాకపోతే అమెరికా ఆర్థిక రంగం తీవ్రంగా దెబ్బతినబోతోందని ఆయన హెచ్చరించారు. అమెరికాలోని ప్రముఖ వైమానిక సేవా సంస్థల్లో ఒకటైన డెల్టా ఎయిర్‌లైన్స్.. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక అంచనా లాభాలను సోమవారం సగానికి తగ్గించుకుంది. ఫలితంగా ఆ కంపెనీ షేర్ల ధర ఒక్కరోజులోనే 14 శాతం పడిపోయింది. ట్రంప్ 2.0 కేవలం నెలన్నర రోజుల్లో సృష్టించిన ప్రకంపనలు అమెరికా కార్పొరేట్ రంగాన్ని వణికిస్తున్నాయి. స్వయంగా వ్యాపారవేత్త అయిన ట్రంప్ విధానాలు వ్యాపారుల ప్రయోజనాలకు లబ్ధి చేకూర్చకపోగా.. పూర్తి విరుద్ధంగా ఉండటం విచిత్రం.

సుంకాల తగ్గింపుపై అమెరికాకు హామీ ఇవ్వలేదు

పార్లమెంటరీ కమిటీకి వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 11: సుంకాల తగ్గింపు అంశంపై అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ పదేపదే లేవనెత్తుతున్న ఈ సమస్య పరిష్కారానికి సెప్టెంబరు వరకూ సమయం కోరినట్లు పార్లమెంటరీ ప్యానెల్‌కు వెల్లడించింది. తక్షణం సుంకాల సర్దుబాటు కంటే దీర్ఘకాలిక సహకారానికి ప్రాధాన్యం ఇస్తూ పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనే దిశగా భారత్, అమెరికా కృషి చేస్తున్నాయని విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముందు మంగళవారం హాజరైన వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ వివరించారు. కాగా, అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. అమెరికాపై భారత్ భారీగా సుంకాలు విధిస్తోందని, అవి ఆ దేశంలో ఏ వస్తువూ విక్రయించడానికి వీల్లేనంత స్థాయిలో ఉన్నాయని ట్రంప్ పేర్కొన్నారు.

రష్యాపై ఉక్రెయిన్ భీకర డ్రోన్ దాడులు

మాస్కో సహా పది ప్రాంతాలే లక్ష్యం.. శాంతి చర్చల వేళ అనూహ్య చర్య

- 337 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశాం
- దాడుల్లో ఇద్దరి మృతి.. రష్యా ప్రకటన

మాస్కో, మార్చి 11: తమ రాజధాని మాస్కో సహ దేశంలోని పది ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ అతి భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు తెగబడిందని రష్యా సైన్యం మంగళవారం ప్రకటించింది. ఈ దాడుల్లో ఇద్దరు చనిపోయారని, 18 మంది గాయపడ్డారని వెల్లడించింది. ఉక్రెయిన్‌కు చెందిన 337 డ్రోన్లను కూల్చివేశామని వివరించింది. ఒక్క మాస్కో వైపే ఉక్రెయిన్ 91 డ్రోన్లను ప్రయోగించిందని పేర్కొంది. రష్యా దేశ భూభాగంలోపల, సరిహద్దులకు బాగా దూరంగా ఉన్న ప్రాంతాలు కలుగా, లిపెన్స్క్, ఓర్యోల్, ర్యాజాన్ ప్రాంతాలపై కూడా ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు దిగడం, అది కూడా యుద్ధం ముగింపుపై చర్చలు ప్రారంభమైన వేళ ఈ చర్యకు పూనుకోవడం ప్రాధాన్యం సంతరించుకొంది. మూడేళ్ల రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ ఇంతకుముందెన్నడూ రష్యాపై ఈ స్థాయిలో డ్రోన్ దాడులు చేయలేదు.

30 రోజుల కాల్పుల విరమణకు ఓకే

ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన కోసం అమెరికా ప్రతిపాదించిన '30 రోజుల కాల్పుల విమరణ'ను తాము అంగీకరిస్తున్నామని అధ్యక్షుడు జెలెన్‌స్కీ మంగళవారం అర్ధరాత్రి ప్రకటించారు. అంతకు ముందు.. యుద్ధం ముగింపుపై చర్చల కోసం అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధి బృందాలు సౌదీ అరేబియాలోని జెద్దా నగరంలో సమావేశమయ్యాయి. భేటీలో అమెరికా ప్రతిపాదనను ఉక్రెయిన్ ప్రతినిధులు జెలెన్‌స్కీకి తెలియజేశారు.



మారిషస్ అధ్యక్ష దంపతులకు గంగాజలం

పోర్ట్ లూయిస్, మార్చి 11: రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ మంగళవారం మారిషస్ వెళ్లారు. వెళ్తూ ఆయన వెంట కుంభమేళా సమయంలో సేకరించిన పవిత్ర గంగాజలాన్ని తీసుకువెళ్లారు. వాటిని మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్‌కు బహూకరించారు. ఆయన సతీమణికి బనారస్ చీరను బహుమతిగా ఇచ్చారు. మరోవైపు, ప్రధాని మోదీకి ఆ దేశ ప్రధాని నవీన్ రామ్.. మారిషస్ అత్యున్నత పురస్కారమైన 'ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషెన్ అవార్డు'ను బహూకరించారు.

లంచాలు మరిగి.. వలకు దొరికి.. !

- మ్యుటేషన్‌కు 12 వేలు తీసుకుంటూ మెదక్ ఆర్ఐ
- లైసెన్స్ జిరాక్స్‌కు 1500 లంచంతో ఎక్సైజ్ ఉద్యోగి
- రూ.50 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డీఈఈ
- మెదక్, ఖమ్మం, ఆదిలాబాద్‌లలో ఘటనలు



డీఈఈ శంకర్, ఆర్ఐ జానయ్య, భూక్య సోమ్లానాయక్

ఆదిలాబాద్ రూరల్, మెదక్, ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ బిల్లు చెల్లింపునకు, ప్లాట్ మ్యుటేషన్‌కు చేయడానికి, బార్ లైసెన్స్ జిరాక్సు కాపీలు ఇవ్వడానికి లంచాలు తీసుకుంటూ ఈడబ్ల్యూఐడీసీ డీఈఈ, మున్సిపల్ ఆర్ఐ, ఎక్సైజ్ ఉద్యోగి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు దొరికిపోయారు. ఆదిలాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయ స్కూల్ పక్కన మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణాన్ని రూ. 14.36 కోట్లతో నిర్మించారు. జిల్లా కేంద్రానికి చెందిన సబ్ కాంట్రాక్టర్ పీవీ నారాయణకు ఈ నిర్మాణానికి ఇటీవలే రూ.2 కోట్ల బిల్లు మంజూరు అయ్యాయి. దీంతో ఈ బిల్లు కోసం విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఈడబ్ల్యూఐడీసీ) డీఈఈ శంకర్.. సదరు సబ్ కాంట్రాక్టర్‌ను రూ.2 లక్షల కమీషన్ ఇవ్వాలని అడిగారు. ఇద్దరి మధ్య చివరికి రూ.లక్ష ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అనంతరం నారాయణ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం.. సోమవారం సాయంత్రం డీఈఈ శంకర్‌కు నారాయణ రూ. 50 వేలు ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే, మెదక్‌లోని శ్రీనివాస్ చెందిన 605 చదరపు గజాల ఓపెన్ ప్లాట్‌కు మ్యుటేషన్ కోసం విచారణ జరిపి నివేదిక ఇచ్చేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారి (ఆర్ఐ) జానయ్య రూ.20 వేలు డిమాండ్ చేశారు. అంతడబ్బు ఇవ్వలేనని వేడుకోగా రూ.12 వేలకు ఒప్పుకున్నారు. ఆ తర్వాత శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు మంగళవారం శ్రీనివాస్.. ఆర్ఐ జానయ్యకు రూ.12వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మరో ఘటనలో.. లైసెన్సుల రెన్యువల్‌కు సంబంధించి జిల్లా ఎక్సైజ్ అధికారులు తమకు ముందుస్తు నోటీసులు ఇవ్వకుండానే, షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఖమ్మంలోని సాయికృష్ణ, డెలీషియస్ బార్‌ల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ సందర్భంగా లైసెన్స్ జిరాక్స్ కాపీలు సమర్పించాలని కోర్టు నిర్వాహకులకు సూచించింది. దాంతో బార్‌ల నిర్వాహకులు జిల్లా ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ భూక్య సోమ్లానాయక్‌ను సంప్రదించారు. తనకు రూ.2,000 లంచం ఇస్తేనే జిరాక్స్ కాపీలు ఇస్తానని తేల్చి చెప్పాడు. దీంతో బార్‌ల నిర్వాహకులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పథకం ప్రకారం మంగళవారం సోమ్లానాయక్ రూ.1,500 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఫార్మా, ఫ్యూచర్ సిటీల భూసేకరణ ఆపాలి : జాన్ వెస్లీ

యాచారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీల పేరు తో చేస్తున్న భూసేకరణను ఆపాలని, రైతులను ఇబ్బంది పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కుర్మిద్దలో మంగళవారం రైతు సభలో మాట్లాడారు. భూసేకరణకు వ్యతిరేకంగా ఈ నెల 20న మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని, 21న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రకటించారు.

అడుగడుగునా అపరిశుభ్రత

చెట్ల కింద, మరుగు దొడ్ల పక్కనే వంటలు.. చాలని ధరలు.. నెలల తరబడి రాని బిల్లులు

- రోగాలకు కారణమవుతోన్న మధ్యాహ్న భోజనం
- 3.37 లక్షల మంది విద్యార్థులు తినడం లేదు
- సన్నబియ్యం, బగారా అన్నం, పలావ్ వడ్డించాలి
- 4 రోజులు గుడ్లు, 2 రోజులు అరటిపండు ఇవ్వాలి
- జూనియర్ కాలేజీల్లోనూ పథకం అమలు చేయాలి
- రూ.190 కోట్లు అదనంగా ఇస్తే.. అన్నీ సాధ్యమే
- ప్రభుత్వానికి విద్యా కమిషన్ సిఫారసులు



హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉన్న మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు చేయాలని తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర సర్కారును కోరింది. ప్రస్తుత పథకంలో అనేక లోపాలున్నాయని, వాటిని వెంటనే సరిదిద్దాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలపై సమగ్ర అధ్యయనం చేసిన కమిషన్ ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక అందించింది. ఇందులో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి అనేక కీలక సూచనలు చేసింది. ఈ పథకం అధ్యయనానికి కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలోని బృందం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించింది. అనేక పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతోపాటు మధ్యాహ్న భోజన పథకం బాధ్యతలు తీసుకున్న స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడింది. వారి అభిప్రాయాలు తీసుకున్న కమిషన్.. ఈ పథకం మెరుగదలకు సిఫారసులు అందించింది. ప్రస్తుతం 1 నుంచి 10వ తరగతి వరకు ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కాలేజీలకూ విస్తరించాలని సూచించింది. ఈ పథకానికి కేంద్రం 60శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇస్తున్నాయి. రాష్ట్రం అదనంగా రూ.190 కోట్లు కేటాయిస్తే.. పథకాన్ని మరింత మెరుగ్గా నిర్వహించవచ్చని కమిషన్ సూచించింది.

చెల్లింపులు అంతంత మాత్రమే..

విద్యార్థులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించేందుకు ఉద్దేశించిన భోజన మెనూ ఎక్కడా అమలు కావడం లేదని కమిషన్ తెలిపింది. సన్న బియ్యం, కోడి గుడ్లు, తాజా కూరగాయలు, పప్పులతో రోజు వండే మెనూను ప్రభుత్వం పేర్కొంది. కానీ ప్రస్తుతం కేటాయిస్తున్న బడ్జెట్‌లో అవన్నీ అందించే పరిస్థితి లేకుండా పోయింది. 1-5 తరగతుల వరకు ప్రస్తుతం ఒక విద్యార్థికి రూ.8.69, 5-10 తరగతులకు రూ.11.79 చొప్పున అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ ధరల్లో నాణ్యమైన భోజనం అందించడం అసాధ్యంగా మారిందని కమిషన్ అభిప్రాయపడింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక వంట గదులు లేకపోవడంతో చెట్ల కింద, మరుగుదొడ్ల పక్కనే భోజనం వండుతున్నారని తెలిపింది. వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం లేదు. పథకానికి సరఫరా చేసే బియ్యం, సరుకుల్లో నాణ్యత ఉండటం లేదని కమిషన్ వెల్లడించింది. సరైన వంట సౌకర్యం లేకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఉడికీ ఉడకని అన్నం తింటూ తరచూ అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1-10 తరగతుల విద్యార్థులు 16.86 లక్షల మంది ఉండగా.. వీరిలో 13.49 లక్షల మంది మాత్రమే భోజనం తింటున్నారు. పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారం లేకపోవడంతో 33,7270 (20%) మంది మధ్యాహ్న భోజనం తినడం లేదని కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ పథకం బాధ్యతలను స్థానిక మహిళా సంఘాలకు అప్పగించింది. అయితే వీరికి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. అనేక జిల్లాల్లో 3 నెలల నుంచి 12 నెలల వరకు బిల్లులు రావడం లేదు. దీంతో మహిళలు అప్పు చేసి సరుకులు తెచ్చి ఈ పథకాన్ని మొక్కుబడిగా నడిపిస్తున్నారు. సరిపడా నిధులు లేకపోవడంతో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని కమిషన్ తెలిపింది. వంట సమయంలో పరిశుభ్రతకు వంట వారికి ఏటా రెండు జతల కిచెన్ ఆప్రాన్, క్యాప్స్, ఆరు జతల చేతి గ్లవ్స్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కమిషన్ కోరింది. వంట వారికి ప్రతి నెలా బిల్లులు చెల్లించడంతో పాటు ఒక్కో విద్యార్థికి చేస్తున్న ఖర్చును పెంచాలని ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయాలని సిఫారసు చేసింది. దీని కోసం రూ.39 కోట్లు కేటాయించాల్సి ఉంటుందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.190 చెల్లిస్తే మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేయవచ్చని సూచించింది. ఇటీవల ప్రభుత్వం గురుకులాల్లో భోజనాల ధరలు పెంచడంతో అక్కడ నాణ్యత పెరిగిందని గుర్తు చేసింది.

ఈ భోజనం పెట్టండి..

మధ్యాహ్న భోజన పథకం ధరలు పెంచడంతో పాటు విద్యార్థులకు సమతుల, పౌష్టికాహారం అందించేందుకు కొత్త మెనూ అమలు చేయాలని విద్యా కమిషన్ సర్కారును కోరింది. తప్పనిసరిగా సన్నబియ్యాన్ని మాత్రమే సరఫరా చేయాలని, వారంలో నాలుగు రోజులు కోడిగుడ్డు, రెండు రోజులు అరటి పండు ఇవ్వాలని సూచించింది. సోమ, మంగళ, బుధ, శుక్రవారాల్లో సన్నబియ్యంతో వండిన అన్నంతో పాటు కోడిగుడ్డు, కూర, పప్పుచారు అందించాలని కోరింది. గురువారం బగారా అన్నం, టమాటా ఆలు గడ్డ కూరతో పాటు అరటిపండు.. శనివారం వెజిటబుల్ పలావ్, ఆలు, క్యారట్, బీన్స్‌తోపాటు అరటి పండు ఇవ్వాలని కమిషన్ సిఫారసు చేసింది.

కొండపర్తికి బ్రాండ్ ఇమేజ్ తెస్తాం

- దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం
- కారం, మసాలా ఉత్పత్తులకు ప్రోత్సాహం
- దత్తత గ్రామ సందర్శనలో గవర్నర్



కుట్టు మిషన్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

ములుగు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని ఓ కుగ్రామంలో పాల ఉత్పత్తిని ప్రారంభించి దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన అమూల్ సంస్థ తరహాలో ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ఓ చిన్న అటవీ గ్రామమైన కొండపర్తికి కారం, మసాలా దినుసుల ఉత్పత్తితో బ్రాండ్ ఇమేజ్ సాధిస్తామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఈ ఉత్పత్తులకు అద్భుతమైన మార్కెట్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. మంగళవారం ఆయన తన దత్తత గ్రామమైన కొండపర్తిని సందర్శించారు. రూ. 1.45 కోట్ల నిధులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మిర్చి, మసాలా తయారీ, కుట్టుమిషన్ యూనిట్లను గవర్నర్ ప్రారంభించారు. పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించి విద్యార్థులతో ముచ్చటించారు. గ్రామ కూడలిలో కుమ్రంభీం, బిర్సాముండా విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ వికసిత భారత్ సంకల్పానికి చిన్న గ్రామమైన కొండపర్తి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో కొండపర్తిని దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రపతి, తాను, మంత్రి సీతక్క ఆదివాసీ సమాజానికి చెందిన వారమేనని, చేయూత, ప్రోత్సాహన్నిస్తే అట్టడుగు వర్గాలు కూడా ప్రగతి సాధిస్తాయని అన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి కుటుంబ ఆదాయం పెరిగేలా సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నట్లు వెల్లడించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టుసాధించేలా దిశ సంస్థతో కలిసి వంద పాఠశాలల్లో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కొండపర్తిలో 150 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిన మిర్చి, పసుపు సాగు చేయిస్తామని చెప్పారు. గ్రామంలో వంద శాతం ఇందిరమ్మ గృహాలను నిర్మిస్తామని వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కోవిడ్: నిన్న, నేడు, రేపు

ఐదేళ్ల క్రితం (11 మార్చి, 2020) ప్రపంచ ఆరోగ్య సంస్థ కోవిడ్–19ని ప్రపంచ మహమ్మారిగా ప్రకటించింది. దీని విలయ తాండవం 2019 డిసెంబర్‌లో చైనాలో ప్రారంభమై రోజులు, వారాల వ్యవధిలో దావానలంలా సమస్త ప్రపంచానికి విస్తరించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు తలకిందులయ్యాయి. కోట్లాది శ్రామికుల జీవనాధారాలు ధ్వంసమయ్యాయి. ఆరోగ్య విపత్తు ఒక మహాసంక్షోభంగా పరిణమించింది. వివేకం, మానవత, విజ్ఞానాల ఆలంబనతో మానవాళి ఆ విషక్రిమిని అణచివేసింది.

కోవిడ్ భయంకరానుభవాల నుంచి మానవాళి పూర్తిగా బయటపడినట్టేనా? లేదనే చెప్పక తప్పదు. డోనాల్డ్ ట్రంప్ గారి దేశంలో 2024 ఆఖరివారంలో సైతం 521 మంది కోవిడ్‌తో మరణించినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధిపరిచిన వ్యాక్సీన్ల కారణంగా మరణాలు, ఆస్పత్రులలో చేరవల్సిన అగత్యాలు తగ్గిపోయినప్పటికీ కరోనా మహమ్మారి తగ్గుస్థాయిలోనే అయినా తన ప్రతాపం చూపుతూనే ఉన్నది. కోవిడ్ సంక్షోభంతో ఆరోగ్య భద్రతా సేవల్లో అసమానతలు ఎల్లెడలా ఎంత తీవ్రంగా ఉన్నాయో తెలిసి వచ్చింది. అన్ని విధాలా సంపన్నదేశమైన అమెరికానే భవిష్యత్తులో విజృంభించే ప్రాణాంతక అంటువ్యాధుల విషయం అటుంచి అసలు కోవిడ్–19 నైనా సంపూర్ణంగా ఎలా నిరోధించగలుగుతుందనేది ఇదమిత్థంగా చెప్పలేని పరిస్థితి. ఆ వైరస్ నుంచే కాకుండా భావి ప్రాణాంతక అంటువ్యాధుల నుంచి, సంపూర్ణ విమోచన ఎప్పటికి, ఎలా సాధ్యమవుతుంది?

ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ప్రతినెలా కనీసం 2000 మందిని బలి గొంటున్న కోవిడ్–19కి, సిఫిలిస్, ఎయిడ్స్, క్షయ ఇత్యాది సాంక్రామిక వ్యాధుల మధ్య కొన్ని సాదృశ్యాలు ఉన్నాయని మిచిగాన్ విశ్వవిద్యాలయ వైద్య శాస్త్ర ఆచార్యుడు పావెల్ హెచ్ కజాంజియన్ అన్నారు. మహమ్మారులు, సాంక్రామిక వ్యాధులను నిర్మూలించాలంటే నవీన చికిత్సా పద్ధతులు, శక్తిమంతమైన ఔషధాలు మాత్రమే సరిపోవని, ప్రజాహితకరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఉండడం తప్పనిసరి అని ఆయన తన 'Persisting Pandemics' అన్న పుస్తకంలో విపులంగా నిర్ధారించారు. 15వ శతాబ్దం నుంచి పీడిస్తున్న సిఫిలిస్, గత శతాబ్ది పూర్వార్ధంలో సల్వార్సన్, పెన్సిలిన్ అనే డ్రగ్స్‌తో అదుపులోకి వచ్చినప్పటికీ ప్రజారోగ్య వ్యవస్థలు ఆ వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించడంలో విఫలమయ్యాయి. అధునాతన చికిత్సా పద్ధతులు, ఔషధాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఆ వ్యాధి అంతమొందకపోవడానికి కారణం సామాజిక ఆర్థిక పరిస్థితులేనని కజాంజియన్ స్పష్టం చేశారు. 2020లల్లో కూడా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 80 లక్షల కొత్త సిఫిలిస్ కేసులు నమోదవుతున్నాయి. 1980వ దశకంలో వెలుగులోకి వచ్చిన ఎయిడ్స్ వ్యాధి నివారణకు పటిష్ఠమైన చికిత్సా పద్ధతులు, ఔషధాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఏటా దాదాపు ఏడు లక్షల మంది ఆ వ్యాధితో చనిపోతున్నారని, దాదాపు నాలుగుకోట్ల మంది హెచ్ఐవి వైరస్‌తో సహజీవనం చేస్తున్నారని ఆయన తెలిపారు. పారిశ్రామిక విప్లవానంతరం యూరోపియన్ నగరాలలో ప్రబలిన క్షయ వ్యాధి ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఏటా కనీసం 17 లక్షల మందిని బలిగొంటూనే ఉన్నది. పేదరికంలో మగ్గుతున్నవారే ఈ వ్యాధికి బలవుతున్నారు. ఈ సాంక్రామిక వ్యాధులకు కారణమైన సూక్ష్మజీవుల నిర్మూలన లక్ష్యంగా చికిత్సా పద్ధతులు, ఔషధాల అభివృద్ధి ఎంతగా జరిగినా ప్రజారోగ్య కార్యక్రమాలను ఎంత సమర్థంగా అమలుపరిచినా అమానుష సామాజిక, ఆర్థిక పరిస్థితులే ఆ వ్యాధులు కొనసాగేందుకు కారణమవుతున్నాయని కజాంజియన్ నిర్ధారించారు. సాంక్రామిక వ్యాధుల నివారణకు, రోగకారక విషక్రిములను నిర్మూలించేందుకు ఆధునిక వైద్యశాస్త్రం మహాశక్తిమంతమైన చికిత్సాపద్ధతులు, ఔషధాలను అభివృద్ధిపరిచిందని, అయితే ఆ వ్యాధుల విస్తరణకు కారణమవుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను తొలగించినప్పుడు మాత్రమే సంపూర్ణ ప్రజారోగ్యం సాధ్యమవుతుందని కజాంజియన్ స్పష్టం చేశారు. మన ప్రజారోగ్య వ్యవస్థల బాధ్యులు ఈ సత్యాన్ని ఉపేక్షిస్తే మన ఆరోగ్య భవిష్యత్తు నిన్నటి దుఃఖమయ ఇతిహాసమే అవుతుందనడంలో సందేహం లేదు.

వాతావరణ మార్పు సంక్షోభం వలే, భావి మహమ్మారులను కూడా మానవాళి మనుగడకు ఒక మౌలిక సవాలుగా తీసుకోవాలి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కోవిడ్ ఆనవాళ్లను పూర్తిగా చెరిపివేసేందుకు, సంభావ్య మహమ్మారుల నెదుర్కొనే విషయమై చట్టసభల్లో ప్రత్యేక చర్చలు జరగాలి. భావి మహమ్మారులను నిరోధించే విషయమై పంచాయత్ స్థాయి నుంచి ప్రజాప్రతినిధులు అందరికీ అవగాహన కల్పించాలి. సమస్య తీవ్రతపై స్పష్టత ఉంటే ఆర్థిక వనరులు సమకూర్చుకోవడంలో అవరోధాలను అధిగమించడం సులభమవుతుంది. కోవిడ్ విపత్తులో లాక్‌డౌన్ శృంఖలాలలో జనజీవనం అల్లాడిపోయినప్పుడు సామాన్య ప్రజలలో వెల్లువెత్తిన మానవతా స్పందనలను భావి మహమ్మారుల నిరోధానికి స్ఫూర్తిగా నిలుపుకోవాలి. ఆ మానవతా సేవలలో పాల్గొన్నవారి అనుభవాలను, సంబంధిత పాత్రికేయ కథనాలు, వ్యాఖ్యానాలను నిర్దుష్ట రీతుల్లో భద్రపరచుకోవడం మరీ ముఖ్యం.

కాంగ్రెస్‌లో కోవర్టులు కొత్త వాస్తవమా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన సరిగా పనిచేయడం లేదని నలుగురైదుగురు కాంగ్రెస్ నేతలు తరుచూ ఢిల్లీ వచ్చి సోనియాగాంధీకి ఫిర్యాదు చేస్తూ ఉండేవారు. అప్పుడు ఢిల్లీలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉండేది కనుక పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆమెను కలుసుకునేందుకు నేతలు క్యూలు కట్టేవారు. ఒక రోజు సోనియాగాంధీ లోక్‌సభలోనే ఒక వర్కింగ్ కమిటీ సభ్యుడితో మాట్లాడుతూ 'ఇదేమిటి? వైఎస్‌పై ఎప్పుడూ ఏవో ఫిర్యాదులు వస్తున్నాయి' అని అడిగారు. 'మేడమ్, మీ పక్కన మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ, శరద్ పవార్, లాలూ ప్రసాద్ యాదవ్, చిదంబరం, నేనూ కూర్చున్నాం. మన్మోహన్ సింగ్ ఎప్పుడూ ఎన్నికల్లో నెగ్గలేదు. చిదంబరం ఎంపీగా ఉన్న తమిళనాడులో కాంగ్రెస్ ఎప్పుడూ అధికారంలోకి రాలేదు. శరద్ పవార్, లాలూ ప్రసాద్ యాదవ్ మన పార్టీ కాదు. ప్రణబ్ ముఖర్జీ నాలాగే మొదటిసారి ఎన్నికల్లో గెలిచారు. మీరు యూపీ నుంచి గెలిచారు కాని యూపీలో మన పార్టీ లేదు. పార్టీ పెద్దలు ప్రాతినిధ్యం వహిస్తున్న అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోతే, మరి కాంగ్రెస్ పార్టీని గెలిపించి అధికారంలోకి తీసుకువచ్చిన వైఎస్ మీద ఫిర్యాదులు వస్తే ఆయన అధికారం ఎలా చలాయించాలో మనం చెప్పగలమా..' అని ఆయన జవాబిచ్చారు. అందుకు సోనియా నిజమే.. అని నవ్వుతూ అంగీకరించారు. మరునాడు సెంట్రల్ హాలు గుండా వెళుతుండగా ఒక మాజీ ఎంపీ ఆమె వెంటపడి వైఎస్‌పై ఏవో ఫిర్యాదులు చేయబోతే గట్టిగా మందలించారు. 'మీకు ఇదే పనా?' అని అడిగారు. దీనితో ఆయన ఖంగుతిని వెళ్లిపోయారు. మొదట్లో వైఎస్ మాటిమాటికీ ఢిల్లీ వచ్చి రాష్ట్ర పరిణామాల గురించి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చేది. ఎవరు ఏ లేఖలు రాసినా, ఫిర్యాదులు చేసినా ఆయనను పిలిపించేవారు. కాని ఆయన క్రమంగా తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నవారిపై పై చేయి సాధించారు. వారి ఎత్తులకు పై ఎత్తు వేసేవారు. అధిష్ఠానం వద్ద తన నిర్ణయాల గురించి గట్టిగా వాదించేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును బలంగా వ్యతిరేకించేవారు. ఒక సందర్భంలో తాను రాజీనామా చేసి బెంగళూరు వెళిపోతానని చెప్పినట్లు సమాచారం. తొలి రోజుల్లో తాను అంతరాత్మగా వ్యవహరించే కేవీపీ రామచందర్‌రావుకు రాజ్యసభ టికెట్ ఇప్పించుకోలేకపోయారు. కాని క్రమంగా అధిష్ఠానంపై పట్టు సాధించిన తర్వాత కేవీపీకి టికెట్ ఇవ్వాల్సి వచ్చింది. తన వర్గీయులకే ఎమ్మెల్యే టిక్కెట్లు ఇప్పించుకోగలిగిన శక్తి ఆయన సంపాదించారు.

కాంగ్రెస్ రాజకీయాలు అప్పటికీ ఇప్పటికీ ఏమైనా మారాయా? అధిష్ఠానం విన్నా, వినకపోయినా ఇప్పటికీ ఢిల్లీ వచ్చి నేతల్ని కలుసుకుని ఫిర్యాదులు చేసేవారు మాత్రం మారలేదు. సోనియాగాంధీ పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జిల నివేదికలకు ఎక్కువ విలువ ఇచ్చేవారు. వారు మేనేజ్ అవుతున్నారంటే మార్చేసేవారు. కాంగ్రెస్ దాదాపు అన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు ఢిల్లీలో నిరంతరం అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతల హడావిడి ఎక్కువగా ఉండేది. ప్రతి పార్టీ ప్రధాన కార్యదర్శి చుట్టూ రాష్ట్రాల నేతలు తిరిగేవారు. టికెట్ కోసం ఢిల్లీలో నేతల చుట్టూ ఎలా తిరగాల్సి వచ్చేదో ఇటీవల మాజీ కాంగ్రెస్ నేత గల్లా అరుణకుమారి తన ఆత్మకథలో రాశారు. ఒక నాయకుడు తానిచ్చిన కాగితాలు క్రింద విసిరికొట్టారని చెప్పారు. రాష్ట్ర సీనియర్ నేతల అంతర్గత రాజకీయాలు తన పుస్తకంలో స్పష్టంగా వివరించారు. కాంగ్రెస్ వివిధ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన తర్వాత కూడా కాంగ్రెస్ ఢిల్లీ నాయకత్వం పనిచేసే తీరు మాత్రం మారలేదు.

కాంగ్రెస్ కూడా ఇప్పటి బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకున్నట్లే లాగే వివిధ రాష్ట్రాల్లో తామే అధికారంలో ఉండాలని కోరుకునేది. 'బండి ముందుకు సాగాలంటే రెండు ఎద్దులు ఉండాలి. ఆ విధంగా కాక ఒకటి ఎద్దు, మరొకటి ఒంటె, గాడిద, కంచర గాడిదో అయితే బండి ముందుకు సాగదు..' అని రాజీవ్ గాంధీ స్వయంగా చెప్పారు.

ఇటీవల రాహుల్‌గాంధీ గుజరాత్‌లో కాంగ్రెస్ ముఖ్యనాయకులతో సమావేశమైన తర్వాత తమ పార్టీలో సగం మంది నాయకులకు పైగా బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నారని చెప్పారు. అయితే రాహుల్‌గాంధీ చెప్పిందేమీ కొత్త విషయం కాదు. కాంగ్రెస్ పార్టీలో కోవర్టు సంస్కృతి ఎప్పటి నుంచో ఉన్నది. అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ నేతలు తమ పనులకోసం అధికారంలో ఉన్న తమ ప్రత్యర్థి పార్టీతో అంటకాగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కొందరు కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్నారు. దిగ్విజయ్‌సింగ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాలంలో మధ్యప్రదేశ్‌లో చాలా మంది కాంగ్రెస్ నేతలు, ఆయన సోదరుడితో సహా బీజేపీలో చేరారు. 'ఇదేమిటి సార్..' అని అడిగినప్పుడు 'మరి వారంతా ఎలా బతకాలి? అధికారంలో లేనప్పుడు అధికారంలో ఉన్న పార్టీ నేతలతో చేతులు కలపడం అనేది మామూలే. మళ్లీ ఎన్నికలు వస్తున్నాయంటే ఒక విజిల్ వేస్తే వారంతా మళ్లీ మా పార్టీలోకి వస్తారు చూడండి..' అని నవ్వారు. ఆయన చెప్పిన విధంగా అయిదేళ్ల తర్వాత మళ్లీ దిగ్విజయ్‌సింగ్ సోదరుడితో పాటు బీజేపీలో చేరిన అనేకమంది కాంగ్రెస్ నేతలు మళ్లీ స్వంత పార్టీలోకి వచ్చారు. అయితే పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం ఉన్నప్పుడే ఏ విజిల్ అయినా పనిచేస్తుంది. గుజరాత్‌లోనే కాదు, అనేక రాష్ట్రాల్లో నరేంద్రమోదీ ఇతర పార్టీల నేతల్ని ఎలా మచ్చిక చేసుకోవాలో, తన పార్టీని ఎలా విస్తరించాలో అన్న విషయంపై పట్టు సాధించారు. రాజకీయాల్లో అవసరాలు, ప్రయోజనాలు, ప్రలోభాలను అధిగమించి వ్యవహరించేవారు అరుదు. మొగల్స్, పోర్చుగీస్, డచ్, బ్రిటిష్ వారు దండయాత్రలు చేసి రాజ్యాలు కబళించినప్పుడు కూడా వారి అండకోసం స్థానిక రాజులు ప్రయత్నించిన ఉదంతాలు ఎన్నో. ఇప్పుడు పార్టీ నేతల్లో అత్యధికులు కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులే. తమ సొంత ప్రయోజనాలకోసం ఇతర పార్టీ నేతలతో అంటకాగకూడదంటే వింటారా. వారు వింటారన్న గ్యారంటీ లేదుగాక లేదు.



ఒకప్పుడు బీజేపీ తాను ఇతర పార్టీలకంటే భిన్నమైన పార్టీ అని చెప్పుకుని వెలుగులోకి వచ్చిందని, ఇప్పుడు బీజేపీకి భిన్నమైనదిగా తన విశిష్టతను కాంగ్రెస్ నిరూపించుకోవాల్సి ఉన్నదని మాజీ కాంగ్రెస్ నేత ఒకరు అన్నారు. కాంగ్రెస్ నేతలు కోవర్టులుగా వ్యవహరించడం ఆ పార్టీ నాయకత్వ వైఫల్యానికి, బలహీనతకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర రాజకీయాల్లో కూడా ఒకర్నొకరు ఓడించుకున్న, ఒకర్నొకరు పార్టీలో పైకి ఎదగకుండా అడ్డుకున్న సందర్భాలు అసంఖ్యాకం. ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ద్రోణంరాజు సత్యనారాయణ, భాట్టం శ్రీరామమూర్తి మధ్య ఆసక్తికరమైన వైరం ఉండేది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డితో సహా అనేకమంది రాజకీయ నేతలు తమ స్వంత పార్టీ నేతల్నే ఓడించుకుని, తమ ముఖ్యమంత్రులనే గద్దె దించేందుకు ప్రయత్నించిన ఉదంతాలు ఎన్నో. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు కూడా ఈ వెన్నుపోట్ల రాజకీయాలకు గురైనవారే. 1998లో పీసీసీ అధ్యక్షుడైన తర్వాత వైఎస్ ఈ విషయం పార్టీ సమావేశంలోనే అంగీకరించారు. 'నాతో సహా అందరం ఒకర్నొకరు ఓడించుకునేందుకు ప్రయత్నించాం. ఇకమీదట మనమెవరూ అలా చేయకూడదు. కాంగ్రెస్‌ను బతికించుకోవాలంటే మనమందరం కలిసి పనిచేయాలి. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించేందుకు అందరం కృషి చేయాలి..' అని ఉపన్యసించారు. కాని ఆ తర్వాత పరిస్థితుల్లో పెద్దగా మార్పులు కనపడలేదు.

విచిత్రమేమంటే కాంగ్రెస్‌పై తిరుగుబాటు చేసి, స్వంత పార్టీలు పెట్టినవారు మళ్లీ అదే పార్టీలోకి వచ్చి కీలకమైన పదవులు పొందిన దాఖలాలు ఉన్నాయి. చెన్నారెడ్డి, ప్రణబ్ ముఖర్జీ, మూపనార్, చిదంబరం, కరుణాకరన్, ఆంటోనీ, బన్సీలాల్, బంగారప్ప, ఎన్డీ తివారీ, అర్జున్ సింగ్, సుఖ్‌రామ్, సురేశ్ కల్మాడీ లాంటివారు వీరిలో ఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. వీరంటే అసంతృప్తికి గురై, తమకు ప్రాధాన్యం లేదని స్వంత పార్టీలు పెట్టుకుని వెళ్లిపోయి మళ్లీ వచ్చినవారైతే సైద్ధాంతికంగా పూర్తిగా భిన్నమైన భారతీయ జనతా పార్టీలో చేరిన నేతలు కూడా కాంగ్రెస్‌కు చెందినవారు కావడం విస్మయం కలుగుతోంది. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు వంటి పదవులు అనుభవించిన ఎస్ఎం కృష్ణ, అమరేందర్ సింగ్, జ్యోతిరాదిత్య సింధియా, ఆర్‌పిఎన్ సింగ్ లాంటి వారు, పలువురు కాంగ్రెస్ అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు బీజేపీలో చేరారంటే కాంగ్రెస్‌లో ఉండి వారు కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ఎంతమేరకు జీర్ణించుకున్నారా అన్న అనుమానాలకు ఆస్కారం లభిస్తుంది.

మహాత్మాగాంధీ కాలంలో జిన్నాతో విభేదించినా, సావర్కర్‌తో విభేదించినా సెక్యులరిజం అనే సిద్ధాంతాన్ని కాంగ్రెస్ బలంగా అనుసరించేదని, క్రమక్రమంగా ఈ సిద్ధాంతం పలచబడిపోయిందని మాజీ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఆర్థిక విధానాల మధ్య వ్యత్యాసం చెరిగిపోవడం కూడా కాంగ్రెస్ బలహీనపడడానికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు బీజేపీ తాను ఇతర పార్టీలకంటే భిన్నమైన పార్టీ అని ప్రచారం చేసి వెలుగులోకి వచ్చిందని, ఇప్పుడు బీజేపీకి భిన్నమైన పార్టీగా తన విశిష్టతను కాంగ్రెస్ నిరూపించుకోవాల్సి ఉన్నదని ఆయన చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ తాను ప్రజల విశ్వాసాన్ని చూరగొని మళ్లీ గెలుస్తుందన్న నమ్మకాన్ని కార్యకర్తలు, నేతల్లో కల్పించనంతవరకూ పరిస్థితుల్లో మార్పు ఉండదని, తమ పార్టీనేతలే కోవర్టులు కావడం నాయకత్వ వైఫల్యానికి, బలహీనతకు నిదర్శనమని ఆయన అభిప్రాయం. 'సిద్ధాంత కాలుష్యమే ప్రస్తుత రాజకీయాలకు పట్టిన పీడ. దాన్నుంచి బయటపడితే కాని మన సమాజం బాగుపడదు'. అని స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఒకప్పుడు అన్న మాటలు ప్రస్తుత పరిస్థితులకూ వర్తిస్తాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఏఐ వద్దని ఎవరన్నారు?

కృత్రిమ మేధపై రంగనాయకమ్మ రాసిన వ్యాసానికి ('కృత్రిమ మేధ: భ్రమలూ, వాస్తవాలు!' – ఫిబ్రవరి 20, 2025) స్పందిస్తూ మామిడి నారాయణ 'సిద్ధాంతం వేరు, సైన్స్ వేరు' (మార్చి 1, 2025) అంటూ వ్యాసం రాశారు. "మిగులు విలువ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం లేదు. రాదు కూడా" అన్న మామిడి నారాయణ ఆ అదనపు విలువ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం ఎందుకు లేదో సరిగ్గా తెలిస్తే, "సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం రావచ్చు రాకపోవచ్చు, సైన్స్‌కు మాత్రం ప్రత్యామ్నాయం ఉండదు, కేవలం అప్‌గ్రేడేషన్ మాత్రమే ఉంటుంది" అనేవారు కాదు.

మార్క్స్ ఆవిష్కరించిన అదనపు విలువ సిద్ధాంతం కూడా సామాజిక శాస్త్రాలలోని వివిధ సిద్ధాంతాల, వాదాల అప్‌గ్రేడేషనే. చారిత్రక గతితర్కంలో భాగంగా వచ్చినదే మార్క్సిజం. అది ఉన్నపళంగా ఆకాశంలోంచి ఊడిపడలేదు. అప్‌గ్రేడేషన్ అనేది కేవలం ప్రకృతి శాస్త్రాలకే కాక సామాజిక శాస్త్రాలకూ వర్తిస్తుంది. కాకపోతే మార్క్సిజం రాకతో సామాజిక శాస్త్రాల్లో అప్‌గ్రేడేషన్ ఆగిపోయింది. అంటే ఆ శాస్త్రం ఆర్థిక రంగంలో పరిపూర్ణమయింది. ఆ సమగ్రతకు, మార్క్స్ కనిపెట్టిన C+V+S = C'లో ప్రకృతి నియమాలు ఇమిడి ఉండడమే కారణం! ఈ 'C' ఆక్సిలరీ పదార్థాలు, ముడి పదార్థాలు, శ్రమ/ ఉత్పత్తి సాధనాలు అనే మూడు విభాగాలుగా ఉంటుంది. ఇందులోని ఉత్పత్తి సాధనాలే టెక్నాలజీ అంటే. ఇందులో– నాటి చేతి పనిముట్టు నుంచి నేటి ఏఐ వరకు ఇమిడి ఉంటాయి. ఇలా ప్రకృతి సూత్రాలకు అనుగుణంగా ఉన్నందువల్లే మార్క్సిజం సైన్స్ అయ్యింది.

నారాయణ పేర్కొన్న ఆర్థికవేత్తలు జే.బీ. సే, ఆర్థర్ సిసిల్ పిగూ. వీరి సిద్ధాంతాలలో శాస్త్రీయత ఎలాగూ ఉండదు కాబట్టి వాటిని వదిలేద్దాం. "(కార్మిక వర్గం) ఎక్కడా మార్క్స్ చెప్పినట్టు తిరుగుబాటు చేయలేదు" అంటూ నారాయణ పై ఇద్దరి విఫల సిద్ధాంతాలలోకి మార్క్స్ సిద్ధాంతాన్ని కూడా చేర్చారు! కార్మికులు ఇప్పటికీ తిరుగుబాట్లు చేస్తూనే ఉన్నారు వివిధ రూపాలలో. అయితే వ్యవస్థను మార్చుకునే విధంగా తిరుగుబాట్లు రావడం లేదు. రాజకీయంగా విజయాలు ఎలా సాధించాలో కూడా మార్క్స్ చెప్పాడు. ఎంగెల్స్, లెనిన్, మావోలు కూడా చెప్పారు. ప్రధానంగా చారిత్రక పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలను మార్చుకోవాలన్నారు. ఇవన్నీ కమ్యూనిస్టు పార్టీలు చేయాల్సిన కర్తవ్యాలు. పార్టీల వైఫల్యాలే మార్క్స్ సిద్ధాంత వైఫల్యంగా చూడకూడదు.



ఇక నారాయణకు బాగా నచ్చిన ఆర్థికవేత్త జె.ఎమ్. కీన్స్! ఎందుకంటే, వ్యవస్థ తీవ్రమైన ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు 'లోటు బడ్జెట్ విధానాన్ని' సూచించినందుకు! "ఒక సిద్ధాంతం విఫలమైనప్పుడు నష్ట నివారణకు ప్రత్యామ్నాయ సిద్ధాంతం కూడా వస్తుంది అనేది రుజువైంది" అంటున్నారు నారాయణ. ఆ రకంగా మార్క్స్ సిద్ధాంతం విఫలమై కీన్స్ సిద్ధాంతం వచ్చిందట! ఏ కమ్యూనిస్టు అయినా ఈ మాటలను అంగీకరిస్తాడా? అంటే ఇక వ్యవస్థను సమూలంగా మార్చే తిరుగుబాట్లు రావన్నమాట. ఇక ఈ సంస్కరణల సిద్ధాంతాలే మనకు దారీతెన్నూ!

"ఆండ్రాయిడ్ మొబైల్ నిరుద్యోగం సృష్టిస్తున్నదని దాని వాడకం నిలిపివేయలేం కదా" అంటున్నారు నారాయణ. దాన్ని నిలిపివేయాలని ఎవరు అంటారు? టెక్నాలజీని వద్దు అని ఎవరైనా అంటారా? రంగనాయకమ్మ గారి వ్యాసంలో అలా ఎక్కడా లేదే?

"కృత్రిమ మేధవల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ" అంటూనే, "కేవలం అది ఒక దశ మాత్రమే" అని విచిత్రంగా మాట్లాడుతున్నారు నారాయణ. అంటే లాభాలు వచ్చినా కొంతకాలమే వస్తాయి అని. మరి, ఆ తర్వాత? "మళ్లీ అప్పుడు అప్‌గ్రేడేషన్ ఉండనే ఉంటుంది" అట! ఒకవేళ సంక్షోభాలు వస్తే? కీన్స్ ఎలాగూ ఉన్నాడు! ఇలా అంతా పరిష్కారమైపోతున్నప్పుడు అదనపు విలువ సిద్ధాంత ప్రాధాన్యత ఏమిటి? ఏ సిద్ధాంతాన్ని ఆయన 'ప్రత్యామ్నాయంలేని సిద్ధాంతం'గా చెప్తున్నారో దాన్ని ఆచరణలో సాధ్యం చేయడం గురించి ఆయనకు అసలు ఆలోచనే లేదన్నమాట! ఆయన ప్రకారం అదనపు విలువ సిద్ధాంతం కేవలం ఆర్థిక శాస్త్రానికి మాత్రమే పరిమితం. సమాజ పురోగమనం అనేది సైన్స్‌కు సంబంధించింది! దీనికి దానికి ముడిపెట్టకూడదన్నమాట! సమాజం పట్ల ఇలాంటి అవగాహన ఉండబట్టే "సైన్స్ ఏ వర్గ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందనే వాదన అర్థరహితం" అంటున్నారు. ఒక కొత్త సరుకు మార్కెట్‌లోకి వచ్చినప్పుడు వర్గ దృష్టితో అందులోని నిజానిజాల్ని చెప్పుకోకూడదా? దానిపట్ల ప్రచారం అవుతున్న విషయాలలో భ్రమలెంత, వాస్తవాలెంత అనేది చర్చించుకోకూడదా? "కృత్రిమ మేధ పనితీరు పట్ల అనుమానాలూ, భయాలూ అర్థరహితం" అనే నారాయణ దానివల్ల ఉద్యోగాలు పోయే కార్మికులకు, భయం కలగడం అర్థరహితమని భావిస్తున్నట్టా?

• యూ.హెచ్. ప్రీతమ్



ప్రసాదమోహనము

మధుర మధుర మీ మోహనగానము
బుధనుత బాలకృష్ణ ప్రసాద కవితము
వర నారదమౌని వీణాగానము
సరవి అన్నయ్యకు సంపదైన గానము
చెర రామదాసుకు చనవైన గానము
తిరమై త్యాగయ్యకు ధనమైన గానము
భక్తజనుల హరి భజనమె గానము
శక్తులౌ వీరుల శౌర్యమీ గానము
రక్తుల ప్రేమసరాగమె గానము
యుక్తి సరిగపద యోగమె గానము
అల వేదంబుల నమరిన గానము
వెలలేని వ్రేపల్లె వేణుగానము
నవి శ్రీవేంకటేశునామమె గానము
కలనైన నెక్కడ కానము కానము

– డాక్టర్ కందాళ లక్ష్మీనారాయణ
నెల్లూరు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోరియల్ పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కేంద్ర ప్రభుత్వం.. పెన్షన్ పిల్లిమొగ్గలు

మోదీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించేలా యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) అనే పథకాన్ని 2025 ఏప్రిల్ 1 నుండి అమలయ్యేలా 24 జనవరి 2025న ఒక నోటిఫికేషన్ ఇచ్చింది. 2004 నుండి అమలవుతున్న నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) స్థానంలో దీనిని ఎంచుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లు ఇందులో పేర్కొన్నారు.

2004 వరకు దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి ఒకే పెన్షన్ స్కీం ఉండేది. దీనినే పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) అని పిలుస్తున్నారు. వాజపేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఓపీఎస్‌ను రద్దు చేసి, దాని స్థానంలో ఎన్‌పీఎస్‌ను కంపల్సరీ చేస్తూ 2004 జనవరి 1 నుండి అమలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను కూడా ఇందులో చేరేలా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం కల్పించింది. ఈ ఎన్‌పీఎస్ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 2004 సెప్టెంబరు 1 నుండి అమలవుతోంది. దీనినే సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) అని కూడా రాష్ట్రంలో పిలుస్తున్నారు.

ఈ ఎన్‌పీఎస్‌కు ఓపీఎస్‌కు ప్రధాన తేడా ఏమిటంటే ఓపీఎస్‌లో ఉద్యోగి వాటా చెల్లింపు ఏమీ ఉండదు. ఉద్యోగికి ఆఖరి నెల జీతంలో సగం పెన్షన్ కింద లభిస్తుంది. దానితో పాటుగా కమ్యుటేషన్, కరువు భత్యం వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. అంటే ఎంత పెన్షన్ వస్తుందో గ్యారంటీ ఉంది. కానీ ఎన్‌పీఎస్‌లో ఉద్యోగి తన జీతంలో పది శాతం వాటా ఈ ఫండుకు చెల్లించాలి. దీనిని యాజమాన్య 14 శాతం వాటాతో కలిపి షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడతారు. ఉద్యోగి రిటైర్ అయ్యే నాటికి ఆ షేర్ మార్కెట్లో విలువను బట్టి వారికి పెన్షన్ చెల్లిస్తారు. అంటే ఉద్యోగికి పెన్షన్ ఎంత వస్తుందో గ్యారంటీ లేదు. అందుకే దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత అటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలోనూ, వివిధ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలోనూ కూడా వ్యక్తమయింది. వివిధ రూపాల్లో పోరాటాలు కూడా జరుగుతున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో నాటి జగన్ ప్రభుత్వం దీనిపై మాట తప్పినందుకు ఉద్యోగుల ఆగ్రహానికి గురై, అధికారం కూడా కోల్పోవలసి వచ్చింది. ఉద్యోగుల ఈ ఆవేదనను అర్థం చేసుకుని కొన్ని బీజేపీ యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాజస్థాన్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలలో ఓపీఎస్‌ను పునరుద్ధరించడానికి నిర్ణయించాయి. కానీ, కేంద్రం వద్ద ఉన్న ఉద్యోగుల ఎన్‌పీఎస్ నిధులను వీరికి తిరిగి ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం నిరాకరిస్తోంది. దీని రద్దుకూ నిరాకరిస్తోంది.

ఉద్యోగుల అసంతృప్తిని చల్లార్చడానికి మోదీ ప్రభుత్వం నేడు యూపీఎస్ పేరున ఒక కొత్త నాటకానికి తెరలేపింది. కేంద్ర ప్రభుత్వ ఫైనాన్సు కార్యదర్శి టివి సోమనాథన్ నేతృత్వంలో ఎన్‌పీఎస్‌లో మెరుగుదలకు ఒక కమిటీని వేసింది. ఓపీఎస్ పునరుద్ధరణ తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని, అనేక ఉద్యోగ సంఘాలు ఈ కమిటీని బహిష్కరించాయి. వారు ఊహించినట్లుగానే ఎన్‌పీఎస్‌లోని అనేక అంశాలను అలాగే ఉంచుతూ, ఓపీఎస్‌లోని కొన్ని అంశాలను కుదిస్తూ ఈ కమిటీ సిఫార్సు చేసింది. దీనికనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ యూపీఎస్ పథకాన్ని తీసుకువచ్చింది. ఆంధ్ర రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీడ్ పెన్షన్ స్కీం (జీపీఎస్) లాంటిదే స్థూలంగా ఇది కూడా.

ఎన్‌పీఎస్ పథకంలోని నిధులన్నీ షేర్ మార్కెట్‌లో పెట్టడం ద్వారా అది పుంజుకోవడానికి, కార్పొరేట్ శక్తులు లాభపడడానికే ఉద్దేశించబడింది తప్ప అందులో ఉద్యోగుల ప్రయోజనాలు ఇసుమంత కూడా లేవు. ఇంకో రకంగా చెప్పాలంటే నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలలో భాగంగా ఉద్యోగుల కష్టార్జితాన్ని కార్పొరేట్ల పరం చేయడానికే ఎన్‌పీఎస్ రూపొందించబడింది.

నేటి ఈ యూపీఎస్‌ది కూడా అదే లక్ష్యం. ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. దీన్ని పెన్షన్ అని కాకుండా ఎస్యూర్డ్ పేఅవుట్ అని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వం మరో 4.5 శాతం నిధులను అదనంగా జమ చేస్తుంది. ఉద్యోగి వాటా 10 శాతం, కేంద్ర ప్రభుత్వ 18.5 శాతం వాటాతో ఈ యూపీఎస్ పథకం నడుస్తుంది. దీని ద్వారా షేర్ మార్కెట్లో పెట్టే పెన్షన్ నిధులు మరింత పెరిగి, కార్పొరేట్లకు మరిన్ని లాభాలు సమకూరుతాయి. 2024 జూలై చివరి నాటికి ఎన్‌పీఎస్ ద్వారా 99,77,165 మంది ఉద్యోగుల పెన్షన్ నిధులు షేర్ మార్కెట్లో 10,53,850 కోట్ల రూపాయలు ఉన్నాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ అదనపు వాటాతో ఇది మరింత పెరుగుతుంది. పోనీ ఇదేమైనా మెరుగ్గా ఉందా అంటే, అనేక అంశాలలో ఎన్‌పీఎస్ కంటే అధ్వానంగా ఉంది.

ఓపీఎస్ పథకంలో సర్వీసులో ఉన్న ఉద్యోగులతో సమానంగా పెన్షనర్లకు కూడా కరువు భత్యం చెల్లిస్తారు. పే కమిషన్ ద్వారా వేతన సవరణ జరిగినప్పుడల్లా పెన్షన్ కూడా సవరించబడుతుంది. కానీ యూపీఎస్‌లో ఆ అంశాలు ఎక్కడా పేర్కొనలేదు. అలాగే కనీస ఫేమిలీ పెన్షన్ ఓపీఎస్‌లో 14,130 రూపాయలు కాగా, యూపీఎస్‌లో కేవలం 6000 రూపాయలు మాత్రమే. ఓపీఎస్‌లో ఫేమిలీ పెన్షనర్‌కు 80 సంవత్సరాల వయసు నిండితే అదనంగా 20 శాతం, దానిపైన కూడా కరువు భత్యం, 90 సంవత్సరాలు నిండితే 40 శాతం, 95 సంవత్సరాలు నిండితే 50 శాతం, 100 సంవత్సరాలు నిండితే వంద శాతం చెల్లిస్తారు. యూపీఎస్‌లో ఆ సదుపాయం ఏమీ లేదు.

యూపీఎస్‌లో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఉద్యోగులకు ఒకసారి మాత్రమే ఇస్తారు. ఒకసారి చేరిన తరువాత ఇక బయటకు వెళ్లడానికి లేదు. రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు సంబంధించిన ప్రస్తావనే ఇందులో లేదు. ఇటువంటి షరతులతో కూడిన ఈ గందరగోళ యూపీఎస్ చాలా లోపభూయిష్టమయినది. అమలు ప్రారంభమయితే మరిన్ని లోపాలు బయటపడతాయి. ఏ రకంగా చూసినా ఇది ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కాజాలదు.



దీనిలో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఉద్యోగులకు ఒకసారి మాత్రమే ఇస్తారు. ఒకసారి చేరిన తరువాత ఇక బయటకు వెళ్లడానికి లేదు. రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు సంబంధించిన ప్రస్తావనే ఇందులో లేదు. ఇటువంటి అనేక లోపాలు, షరతులతో కూడిన ఈ గందరగోళ యూపీఎస్ చాలా లోపభూయిష్టమయినది. అమలు ప్రారంభమయితే మరిన్ని లోపాలు బయటపడతాయి. ఏ రకంగా చూసినా ఇది ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కాజాలదు. ఏదో చేసేస్తున్నామని భ్రమలు కలిగించి, కార్పొరేట్లకు మరింత సేవ చేయడానికి ఉద్దేశించబడినదే ఈ మోసపూరిత యూపీఎస్. ఈ విషయం నోటిఫికేషన్ 4వ పాయింటు ద్వారా స్పష్టమవుతుంది. అందులో యూపీఎస్‌లో చేరిన సభ్యుల ఎన్‌పీఎస్ నిధిని దీనికి బదిలీ చేస్తారని పేర్కొన్నారు కానీ ప్రభుత్వం ఎన్‌పీఎస్ నిధులను ఓపీఎస్ అమలు చేసే రాష్ట్రాలకు బదిలీ చేయడానికి మాత్రం నిరాకరిస్తోంది. దీన్ని బట్టే తెలుస్తోంది ప్రభుత్వ ఉద్దేశం ఉద్యోగుల ప్రయోజనం కాదని. మోదీ ప్రభుత్వ ఈ జిమ్మిక్కులు అర్థం చేసుకునే ఉద్యోగులు దీన్ని ఏకోన్ముఖంగా తిరస్కరిస్తున్నారు. 'పెన్షన్ ఉద్యోగి ప్రాథమిక హక్కు, భిక్ష కాదు' అనే సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలి. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇలాంటి పెన్షన్ పిల్లిమొగ్గలు ఇకనైనా ఆపాలి. కార్పొరేట్ సేవ విడనాడి, ఉద్యోగుల కష్టార్జిత పొదుపు సొమ్ము వారికే చెందేలా ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి.

■ ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఆ ఎనిమిది మంది!

అది ఊటనీరు కాదు
కన్నీరు
వరద కాదు
రాజకీయ బురద.

ఒక్కక్షణంలో పోయిన
ప్రాణాలు కావవి,
ఎంత సమయం
విలవిలలాడాయో!

ఏ తల్లి కన్న బిడ్డలో
ఏ ఊరి మట్టిగడ్డలో
ఇక్కడ
అనాథల్లా
అంతమైపోయారు.


ప్రాజెక్టుల నిర్మాణానికి
రెక్కలు విరిగిన కూలీలెవ్వరు!
పేదవారి చరిత్ర సమస్తం
అస్తవ్యస్తం.

లక్షల రూపాయల పరిహారం
కుటుంబసభ్యుల
దుఃఖానికి ఖరీదు.

మిత్రులారా!
ఇవాళ అన్నం తింటుంటే
మీరే గుర్తుకొస్తున్నారు
రేపటినుంచి
అంతా సజావుగానే వుంటుంది.

– డా. ఎన్.గోపి

(ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో మరణించిన కార్మికుల కోసం)



హామీలకు.. ఆమోదం వచ్చేనా?

ఉమ్మడి జిల్లా అభివృద్ధి పై ప్రజల్లో పెరుగుతున్న ఆశలు, అంచనాలు

- హైదరాబాద్‌కు దీటుగా డెవలప్ చేస్తామని పలుమార్లు ప్రకటించిన ప్రభుత్వం
- పెండింగ్ పనులు, ప్రాజెక్టులకు కేటాయింపులపై సర్వత్రా ఉత్కంఠ
- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఓరుగల్లు అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. కొంత కాలంగా ఉమ్మడి జిల్లాలోని పలు అభివృద్ధి పనులపై ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. చాలా పనులకు జీవోలు కూడా జారీ చేసింది. అయితే ఆ పనులకు నిధులు రాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఇక పలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న వాటికి కేటాయింపుల కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనైనా వాటికి ఆమోదం వస్తుందని.. సొమ్ముల కేటాయింపు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో సాగునీటికి పెద్దదిక్కుగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు నిధులు, వరంగల్ నగరంలో మెట్రో రైల్ సేవలతో పాటు ఐటీ పార్కు విస్తరణ, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం తదితర వాటికి ఇంకా అడుగులు పడటం లేదు. వీటితో పాటు అనేక నియోజకవర్గాల్లో ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల నిర్మాణం, వీవర్స్ పార్కులు, యూనివర్సిటీలు, కాలేజీలు, డ్రెయినేజీలు, మామునూరు విమా నాశ్రయం భూసేకరణ లాంటి వాటికి నిధులు లేక, కొన్నింటికి అనుమతులు రాక ప్రజలు అసౌకర్యాలకు గురవుతున్నారు. మన ఎమ్మెల్యేలు అభివృద్ధిపై గళమెత్తుతారని.. సొమ్ములు సాధిస్తారన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రభుత్వం పూర్తి చేయాల్సిన ప్రధాన పనులు

వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.4,170 కోట్లు ఇస్తామన్నారు. ఈ నిధులను విడుదల చేయాల్సి ఉంది. వరంగల్ మహానగరంలో మెట్రో రైల్, ఐటీ పార్కు విస్తరణ జరగాల్సి ఉంది. మడికొండ, కొడకండ్ల వీవర్స్ పార్కుల అభివృద్ధికి కేటాయింపులు అవసరం. స్టేషన్‌ఘనపూర్‌లో లెదర్‌పార్కుపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు జరిగితే ఏళ్ల నాటి గ్రహణం వీడుతుందన్న అభిప్రాయాలున్నాయి. భూపాలపల్లిలో మైనింగ్ యూనివర్సిటీ, బైపాస్ రోడ్డుపై కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. ఇక పాలకుర్తి-చెన్నూరు రిజర్వాయర్, కొనాయిమాకులలో ఎత్తిపోతలు, జనగామలో పాలిటెక్నిక్, డోర్నకల్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీలు వస్తాయన్న అంచనాల్లో ఉన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణకు ఇస్తామన్న రూ.205కోట్లు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు పెండింగ్ పనులు, ప్రాజెక్టులకు కేటాయింపులు జరగాల్సి ఉంది.

వివరాలు : 7 లో..

సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోండి



సందేహాలు నివృత్తి చేయనున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

రేపు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్

సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ : 87126 65552

వరంగల్ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత పెరిగింది.. దాంతో పాటే నేరాలు, మోసాలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం పెరిగిన తర్వాత సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. మాయమాటలు చెబుతూ.. వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. యాప్‌లు, రుణాలు, ఆఫర్లు అంటూ ఫోన్లు చేసి.. వినియోగదారుల డాటాను తస్కరించి బ్లాక్‌మెయిల్ చేస్తూ ఖాతాలను లూటీ చేస్తున్నారు సైబర్ నేరస్థులు. ఇలాంటి ఘటనలు ఇటీవల నిత్యకృత్యమయ్యాయి. రోజూ ఎక్కడో ఒక చోట.. ఎవరో ఒకరు వయసు, చదువుతో సంబంధం సైబర్ కేటుగాళ్ల వలలో పడుతూ సొమ్ములు పోగొట్టుకుంటున్నారు. చివరకు మనోవేదనతో ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు. ఇలాంటి సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్న అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 13వతేదీన 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గురువారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు ఈ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్‌కు ఫోన్‌చేసి ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. సలహాలు పొందవచ్చు.



గిరిజన వర్సిటీ వీసీగా శ్రీనివాస్

ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ

6

రైతులకు నష్టం జరిగితే సహించేది లేదు..

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- దేవాదుల పంప్ హౌస్ వద్ద బీఆర్ఎస్ నేతల ధర్నా



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శాయంపేట మండల రైతులకు నీళ్ల ఇవ్వకుండా ధర్మసాగర్ మండలం రైతులకు నీళ్ల తీసుకెళ్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం శాయంపేట మండలంలోని దేవాదుల పంప్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించకుండా ధర్మబద్ధంగా శాయంపేట రైతులకు సాగునీరు అందించాలన్నారు. చలివాగు ప్రాజెక్టులోని 15 ఫీట్ల నీళ్ల ఉంచి మిగతా నీటిని ధర్మసాగర్ మండలంలోని చెరువులకు పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం 10 ఫీట్ల మేరకే నీటి మట్టం ఉందని, వాటిని రైతులు వాడుకుంటుంటే విద్యుత్ మోటార్లను తీసేస్తారా? అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తూ మరో మండలానికి నీళ్ల తీసుకెళ్తామంటే అడ్డుకుంటామని, ఎన్ని కేసులు పెట్టినా ఫరవా లేదన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్ల జనవరిలో జరగాల్సిన పంపింగ్ జరుగకపోవడం వలనే సమస్య తలెత్తిందన్నారు. ఇక్కడి రైతుల పంటలను ఆదుకోవాలంటే ధర్మసాగర్‌కు పంపింగ్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడి రైతులు పంటలకు నీరందకపోతే ఎకరానికి రూ.50వేలు అందించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో శాయంపేట, ఆత్మకూరు, పరకాల, దామెర మండలాల పోలీసులు భారీ సంఖ్యలో ధర్నా వద్దకు చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూళిపాల తిరుపతిరెడ్డి, మాజీ చైర్మన్ దూళిపాల రాజిరెడ్డి, నాయకులు రాంశెట్టి లక్ష్మారెడ్డి, నూనె కిరణ్, సాంబరెడ్డి, అరకిళ్ల ప్రసాద్, విజయ్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, మస్కె సదయ్య, గంటా శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడిక మట్టి తరలింపులో వేగం పెంచాలి

- వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య
- భద్రకాళి చెరువులో క్షేత్రస్థాయి పరిశీలన



భద్రకాళి చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్లు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపు ప్రక్రియ వేగవంతంగా జరగాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం భద్రకాళి చెరువులో పూడికతీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లతో పాటు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. భద్రకాళి చెరువు నుంచి పూడికతీత మట్టి తరలింపు రూట్‌మ్యాప్ వాహనాల రాకపోకలకు సంబంధించి వస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులు, మట్టిని తరలించేందుకు వచ్చే వాహనాల కూపన్లను వారు పరిశీలించారు. భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని ఎంత తరలించాలని వివరాలను నీటి పారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువులో నుంచి కట్ట వరకు చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య సంయుక్తంగా మాట్లాడారు. పూడికతీత మట్టిని బుధవారం నుంచి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పూడికతీత జరుగుతున్న ప్రాంతాల్లో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి తరలింపు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూడికతీత మట్టి పనులు సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సాగునీటిపారుదల శాఖ ఈఈ శంకర్, డీఈ హర్షవర్ధన్, కుడా సీవో అజీత్‌రెడ్డి, ఈఈ భీంరావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్



మిర్చి ప్రాసెసింగ్ కేంద్రంలో మహిళా నిర్వాహకులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు

మేడారం వనదేవతలను దర్శించుకుంటున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క

కొండపర్తిని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతాం

- వికసిత్ భారత్ స్ఫూర్తిగా బ్రాండ్ ఇమేజ్ సాధిస్తాం
- దత్తత గ్రామ పర్యటనలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- బహుళ ఉపాధి కార్యక్రమాల ప్రారంభోత్సవం
- హాజరైన మంత్రి సీతక్క ఉన్నతాధికారులు

7

బీఆర్ఎస్ మాయగాళ్లు మళ్లొస్తున్నారు..

- వరంగల్ సభతో ప్రజలను నమ్మించే డ్రామా
- ఏ ముఖం పెట్టుకొని సభను నిర్వహిస్తున్నారు?
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన బీఆర్ఎస్ మాయగాళ్లు మళ్లీ వరంగల్ సభతో ప్రజల ముందుకు వస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో బీఆర్ఎస్ దివాళా తీయించిందన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలిందన్నారు. వరంగల్‌లో నాలుగు రోజుల పాటు బస చేసి నగర రూపురేఖలు మారుస్తానని చెప్పిన కేసీఆర్ మాటలు నగర వాసులు మరిచిపోలేదన్నారు. వరంగల్ సభ పేరుతో మళ్లీ మాయమాటలు చెబితే ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఏం ముఖం పెట్టుకొని వరంగల్‌లో సభను నిర్వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో నిరుపేదలకు కనీసం ఒక్క డబుల్ బెడ్ రూమ్ పంపిణీ చేయలేని అసమర్థ పాలకులుగా బీఆర్ఎస్ నేతలు మిగిలారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట మేరకు నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు చేపట్టిందన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రింగు రోడ్డు నిర్మాణానికి నిధులను కేటాయింపులు ఉండనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ నగరాభివృద్ధి పట్ల ప్రత్యేక ప్రణాళికతో ఉన్నారని, ఆ మేరకు నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

దమ్ముంటే వరంగల్ నగరాభివృద్ధిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజా సమక్షంలో చర్చకు రావాలని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్, ఏడాదిలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన నగరాభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న హరీశ్‌రావుకు చర్చలోనే సమాధానం చెబుతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో వరంగల్ నగరాన్ని ఏ మేరకు అభివృద్ధి చేశారో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అసెంబ్లీలోని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. నాడు నగరానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రకటించిన కేసీఆర్ హామీ అటకెక్కించారని విమర్శించారు. బీఆర్ఎస్ మాయ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండూ ఒక్కటే అని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. గడిచిన లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు బీఆర్ఎస్ తోడ్పాటు అందించిందన్నారు. త్వరలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుంటే ఆ పార్టీ నేతలు రేవంత్‌రెడ్డిపై నోరు పారేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగలేరంటూ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఐదేళ్ల వరకు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉంటారని, ఇందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, మాజీ కార్పొరేటర్ అబూబాకర్, నాగరాజు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాటల పరిమళం కందికొండ

- 20 ఏళ్ల సినీ ప్రస్థానం.. 1300కుపైగా పాటలు
- కవి, రచయిత, కథకుడిగా కూడా గుర్తింపు
- నేడు కందికొండ యాదగిరి వర్ధంతి

7



నాగేంద్రస్వామికి మొక్కులు చెల్లించుకుంటున్న శ్రీపాల్‌రెడ్డి

నాగేంద్రుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

గీసుగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పింగిళి శ్రీపాల్‌రెడ్డి మంగళవారం మండలంలోని ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎన్నికలకు ముందు ఆయన స్వామివారిని దర్శించుకొని విజయోస్తు కంక ణాన్ని ధరించారు. ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డిని ఆలయ మర్యాదలతో పూజారులు ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు 61 అద్దె బస్సుల కేటాయింపు

వరంగల్ ఆర్ఎం డి.విజయభాను

హనుమకొండ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి మహిళాశక్తి సభలో మహిళా శక్తి-2025 పథకాన్ని ఆవిష్కరించి మండల మహిళా సమాఖ్య సంఘాలకు టీజీఎస్ ఆర్టీసీ ద్వారా వరంగల్‌కు 61అద్దె బస్సులను కేటాయించినట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 600 బస్సులు మొదటి దశలో ప్రారంభించగా, 61 బస్సులు వరంగల్ రీజినల్ పరిధిలోని హనుమకొండ, జనగామ, వరంగల్-1 , వరంగల్ -2, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రురు, భూపాలపల్లి మొత్తం 61 అద్దె బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు.

వన్నాలను పరామర్శించిన ఎర్రబెల్లి

హనుమకొండ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మాజీ శాసనసభ్యుడు వన్నాల శ్రీరాములు సతీమణి వన్నాల విజయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు హనుమకొండ బాలసముద్రంలోని అడ్వకేట్స్ కాలనీలో గల వన్నాల శ్రీరాములు నివాసంలో వారిని కలిసి విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి దయాకర్‌రావు ప్రగాడ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు మార్తినేని ధర్మారావు, వేముల సదానందం, వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు బోర్డు కోశాధికారి గజ్జెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములును పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జీనోమ్ ప్రాజెక్టుతో వ్యాధుల గుట్టు రట్టు

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- జంతుశాస్త్ర విభాగంలో రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీనోమ్ ప్రాజెక్టుతో వ్యాధుల గుట్టు రట్టు అవుతోందని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చెప్పారు. మంగళవారం కేయూ జంతుశాస్త్ర విభాగంలో 'ఇమ్యూనలజీ-బయోటెక్నాలజీ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సమావేశం జరిగింది. కేయూ జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన సదస్సుకు వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2010లో ప్రారంభమైన జీనోమ్ ప్రాజెక్టు మానవుడి వ్యాధులకు కారణమవుతోందని జన్యువులను గుర్తించి, వాటి మూలాల ద్వారా వ్యాధుల గుట్టును రట్టు చేయవచ్చునని తెలిపారు. దేశంలోని విద్యావేత్తలు, పరిశోధకులు పాల్గొని జంతుశాస్త్రాల పరిశోధన పురోగమనంపై చర్చించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి సదస్సులో జంతు బయోటెక్నాలజీ, సెల్ టిష్యూకల్చర్ బయాలజీ, ఇమ్యూనాలజీ, అభివృద్ధి జీవశాస్త్రం, పర్యావరణ టాక్సికాలజీ వంటి అంశాలనూ నూతన అంశాలను ప్రతిపాదిస్తూ చర్చలు జరుగుతాయని తెలిపారు. కృత్రిమ పెంపకం, మత్స్య ఇంజనీరింగ్, బయో ఇన్ఫర్మెటిక్స్, జెనోమిక్స్, ప్రొటియోమిక్స్, మెటబోలోమిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల ప్రాముఖ్యతలను గుర్తిస్తారని నిర్వాహకులు అభినందనలు తెలిపారు. జాతీయ సదస్సులో 'బయో ఫార్మ డైరెక్టర్ ప్రొఫెసర్ గీతాశర్మ, డ్రగ్ డిస్కవరీ' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. మాలిక్యూలర్, డ్రగ్స్ మార్కెట్లలోకి రావడానికి 10 ఏళ్లవరకు కాలం పడుతోందని అన్నారు. రూ. 10 బిలియన్ డాలర్ల ఖర్చు అవుతోందని తెలిపారు. అయితే బయో ఇన్ఫర్మాటిక్స్ అభివృద్ధితో ఖర్చు, సమయం రెండు కలిసి వస్తాయని తెలిపారు. పరిశోధనారంగంలో మంచి పురోగతి లభిస్తోందని తెలిపారు.



జంతుశాస్త్ర పరిశోధన పత్రాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

సదస్సు నిర్వహకుడు ప్రొఫెసర్ వెంకయ్య మాట్లాడుతూ.. రెండు రోజుల జాతీయ సదస్సులో 100కి పైగా స్కాలర్లు, వర్సిటీ ప్రొఫెసర్లు పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వెల్లడించారు. అలాగే నేషనల్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ ఆనిమల్ బయోటెక్నాలజీ, నేషనల్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, జేఎన్‌టీయూహెచ్‌తో వివిధ సంస్థల నుంచి ప్రొఫెసర్లు, సైంటిస్టులు హాజరుకానున్నరని తెలిపారు. ప్రారంభ సమావేశానికి అధ్యక్షుడిగా విభాగాధిపతి శమిత, విశిష్ట అతిథిగా హన్మంతు, చైర్మన్ బోర్డు స్టడీస్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీలు పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన అతిథులు జాతీయ సదస్సుకు వచ్చిన పరిశోధనపత్రాల సావనీర్‌ను వేదికపై ఆవిష్కరించారు. సదస్సులో అకూట్ అధ్యక్షులు ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, కనీజ్ ఫాతిమా, సుజాత పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నెనీ రవీందర్‌రావు

టార్గెట్లు పూర్తి చేయాలి

డీసీసీ బ్యాంక్ మేనేజర్లతో చైర్మన్ మార్నెనీ రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, మార్చి11 (ఆంధ్రజ్యోతి): రికవరీ టార్గెట్లను వంద శాతం పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు ఉంటాయని డీసీసీ బ్యాంక్ మేనేజర్లకు టెస్కాబ్ చైర్మన్ మార్నెని రవీందర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మేనేజర్లతో సమీక్ష జరిపారు. వివిధ రుణాల రికవరీ, కొత్త పంట రుణాలు, డిపాజిట్లు తదితర అంశాలను సమీక్షించి దిశా, నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, స్రవంతి, రాజు, కృష్ణమోహన్, విజయకుమారీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం హనుమకొండ డివిజన్‌లోని నక్కలగుట్ట సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న భవానీనగర్, భవానీ మాత టెంపుల్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు నగరంలో నీటి సరఫరాల బంద్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఎల్ఎండీ (లోయర్ మానేరు డ్యామ్) 33/11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద వార్షిక నిర్వహణ పనులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం వరంగల్ నగరంలో నీటి సరఫరా బంద్ చేస్తున్నట్టు బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ అండర్ రైల్వే గేటు ప్రాంతంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు నీటి సరఫరా ఉండదని, ప్రజలు బల్దియా అధికారులకు సహకరించాలని ఎస్ఈ కోరారు. ఇంకా మడికొండ, కడిపికొండ, భట్టుపల్లి, రాంపూర్, ఎల్లాపూర్, మామునూరు ప్రాంతాలలో నీటి సరఫరా నిలిచిపోతుందని బల్దియా ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- అధికారులు సమన్వయంతో సాగాలి..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

జనగామ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. 16న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జనగామ కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ఏర్పాట్లు చేయాలని, సభ స్థలం వద్ద మహిళా పోలీసు సిబ్బందిని పెద్దసంఖ్యలో అందుబాటులో ఉంచాలన్నారు. సభ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం, సమీపంలో తాత్కాలిక మూత్రశాలలను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన పనులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా పూర్తి ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలన్నారు.



అధికారుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, స్టేషన్ ఘన్‌పూర్ మునిసిపల్ కమిషనర్ రవీందర్, ఏసీపీ భీంశర్మ, డీఆర్డీవో వసంత, డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు, డీపీవో స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ వర్సిటీ వీసీగా శ్రీనివాస్

ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ

ములుగు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ములుగులోని సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్స్‌లర్‌గా యెడవెల్లి లక్ష్మీ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రేయా భరద్వాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ భవన సముదాయం నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో ములుగు శివారులోని జాకారంలో ఉన్న వైటీసీలో గత ఏడాది జూన్‌లో తరగతులు ప్రారంభమయ్యాయి. ఓఎస్డీ, పరీక్షల విభాగాధిపతుల పర్యవేక్షణలో యూనివర్సిటీ కొనసాగింది. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన శ్రీనివాస్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తూ రిటైర్ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అరోరా హయ్యర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అకాడమీ ప్రో వీసీగా పనిచేస్తున్నారు. ఇంగ్లీషు లిటరేచర్, ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన శ్రీనివాస్ 37 సంవత్సరాలుగా అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్నారు. 1992లో ఓయూ ఇంగ్లీషు విభాగంలో ప్రొఫెసర్‌గా చేరారు. తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీలో, ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేశారు. బెంగుళూరు నేషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలందించారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఇగ్లిషు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కూడా కొనసాగారు. ఆయన సమర్పించిన 15 పరిశోధనా పత్రాలు అంతర్జాతీయ పత్రికలలో ప్రచురితమయ్యాయి.



వై.ఎల్.శ్రీనివాస్

శాంతి సమాధానంతో మెదలాలి..

- బిషప్ ఉడుమల బాల
- ప్రారంభమైన ఫాతిమామాత ఉత్సవాలు
- పెద్దఎత్తున హాజరైన క్రైస్తవులు

కాజీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబాల్లో శాంతి సమాధానం ఉంటేనే మంచి జరుగుతుందని, అందుకు ప్రతీ గృహాల్లో మరియమాత ప్రార్థనలు చేసుకోవాలని వరంగల్ పీఠాధిపతి ఉడుమల బాల అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని ఫాతిమా మాత మహోత్సవాలు మంగళవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. బిషప్ ఉడుమల బాల దివ్య బలిపూజ నిర్వహించారు. కుటుంబాల సంరక్షణి మరిమాత అనే అశంపై ఆయన ప్రసంగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, జపమాల దివ్వబలి పూజ నిర్వహించారు. ఆ తర్వాత వివాహమై 25 ఏళ్లు, 50 ఏళ్లు వేడుకలు జరుపుకున్న 40 మంది దంపతులకు సన్మానం చేశారు. వారికోసం బిషప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ పూజల్లో ఫాతిమా కేథడ్రిల్ చర్చి ఫాదర్ కాసుమర్రెడ్డితోపాటు ఫాదర్‌లు ప్రకాశ్, అశీర్వాదం, అనుకిరణ్‌తోపాటు సిస్టర్‌లు, విశ్వాసులు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఉత్సవాల సందర్భంగా ఫాతిమా కేథడ్రిల్ చర్చి రంగురంగుల లైట్లతో అలంకరించారు. చర్చి రోడ్డులో పెద్దఎత్తున షాపులు వెలిశాయి. వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. దీంతో ఫాతిమానగర్ జాతర వాతావరణం నెలకొంది. శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలుగకుండా స్థానిక సీఐ వై.సుధాకర్‌రెడ్డి బృందం భారీ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తోంది. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఫాతిమాచర్చిని సందర్శించారు. ఉత్సవాలు సజావుగా జరిగేందుకు పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఆమె వెంట స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి, చర్చి కమిటీ అధ్యక్షుడు బొక్క దయాసాగర్, ఎస్సై లవన్ కుమార్‌లు ఉన్నారు.



సందేశాన్ని అందిస్తున్న బిషప్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ షేక్ సలీమా

నేటి కార్యక్రమాలు

ఫాతిమామాత మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4. 40 నిమిషాల వరకు ఫాదర్ డి.జోసఫ్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ, ప్రత్యేక పూజలు ఉంటాయి. సాయంత్రం 5.30 నిమిషాలకు ఫాతిమామాత స్వరూపంతో పురవీధుల్లో మహారథ ప్రదక్షణ ఉంటుంది. అనంతరం రాత్రి 8.30నిమిషాలకు పునీత అంథోణివారి కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పసిపాపను కిడ్నాప్ చేసిన ముఠా అరెస్టు

- అమ్మకానికి ప్రయత్నించిన ముఠా
- ఛేధించి పట్టుకున్న జనగామ పోలీసులు
- సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత

జనగామ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జనగామలో పసిపాపను కిడ్నాప్ చేసి అమ్మకానికి ప్రయత్నించిన ముఠాను జనగామ పోలీసులు ఆరెస్టు చేసి తల్లిదండ్రులకు పాపను సురక్షితంగా అప్పగించారు. జనగామ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏఎస్పీ పండరి చేతన్‌నితిన్ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికులు రంజుల్ రజాక్-పార్వతి దంపతులు జనగామలో నిర్మాణంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్ వద్ద కూలీ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. వీరికి 10నెలల పాప శివాణితో పాటు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పతంగి సురేశ్-తిరుపతమ్మ దంపతులు వరంగల్ లేబర్ అడ్డా వద్ద జనగామకు చెందిన అజయ్ అనే మేస్త్రీ పరిచయం కాగా పని చెప్పండని అడిగారు. జనగామలో ఉందని మేస్త్రీ చెప్పడంతో వారు జనగామకు వచ్చారు. సురేశ్ దంపతులు కూడా రాంజుల్ రజాక్ వద్ద ఉంటూ కలిసిమెలిసి పనిచేస్తున్నారు. గతనెల 25న మేస్త్రీ అజయ్ బైక్ తీసుకొని శివాణిని మార్కెట్‌కు తీసుకెళ్లి తీసుకువస్తామని మాయ మాటల చెప్పి సురేష్ ఎత్తుకెళ్లాడు. ఎంత సేపటికీ వారు ఇంటికి రాకపోయే సరికి అనుమానం వచ్చి శివాణి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం పెంబర్తి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అదే సమయంలో బైక్‌పై వస్తున్న సురేష్ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. సురేశ్ గతంలో విజయవాడలో మేస్త్రీ పని చేస్తున్న సమయంలో గరికముక్కు విజయలక్ష్మి అనే మహిళతో పరిచయం ఏర్పడి డబ్బులు వస్తాయని ఆశతో పసి పిల్లల కిడ్నాప్‌కు ప్రణాళిక రూపొందించారని పోలీసుల విచారణలో తేలింది. నిందితులు సురేశ్, తిరుపతమ్మ, విజయలక్ష్మిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, బైకు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పసి పాప ను తల్లిదండ్రులకు అప్పగించారు. గతంలో విజయలక్ష్మిపై పలు కేసులు నమోదయ్యాయి. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్ఐ చెన్నకేశవులు, కానిస్టేబుళ్లు కరుణాకర్, మహేందర్, అరవిందలను అభినందించారు.




నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు

లోకల్ ఇసుకను అందుబాటులో ఉంచాలి

మంత్రి కొండా సురేఖకు వినతి

ఐనవోలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లోకల్ ఇసుకను అందుబాటులో ఉంచి కార్మికులకు ఉపాధిని కల్పించాలని వివిధ రంగాల కార్మికులు మంగళవారం మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు చోటేమియా ఆధ్వర్యంలో నందనం, రాంనగర్, రెడ్డిపాలెం, కక్కిరాలపల్లి, గర్మిళ్లపల్లి, ఐనవోలు తదితర గ్రామాలకు చెందిన భవన నిర్మాణ రంగ కార్మికులు, ట్రాక్టర్ల యాజమానులు, డ్రైవర్లు, కూలీలు, కాంగ్రెస్ గ్రామ స్థాయి నాయకులు వందల సంఖ్యలో హైదరాబాద్‌కు వెళ్లి మంత్రికి మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. 25 రోజుల కిందట గోదావరి ఇసుక రవాణా అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలిస్తే గోదావరి ఇసుకకు బదులు లోకల్ ఇసుకపై అంక్షలు విధించారని వాపోయారు. లోకల్ ఇసుక రవాణాపై అంక్షలు విధించడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. తక్కువ ధరకు లభించే లోకల్ ఇసుకతో గ్రామాలు, మండలకేంద్రాల్లో చిన్న చిన్న నిర్మాణ పనులు జరిగేవని వాటిపై ఆధారపడిన వందల మంది భవన నిర్మాణ రంగ కార్మికులైన మేస్త్రీ, కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు, ఇటుక బట్టి వ్యాపారులు, చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఖరీదైన గోదావరి ఇసుకను గ్రామాలకు తీసుకవచ్చి పనులు చేసుకునే పరిస్థితి లేదని అందువలనే నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. లోకల్ ఇసుక రవాణపై అంక్షలు ఎత్తివేసి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో పాటు జిల్లా కలెక్టర్లతో మాట్లాడినట్లు తెలిపారు.



మంత్రి కొండ సురేఖ నివాసంలో వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

రహదారుల సంస్థ చరాస్తుల జప్తునకు కోర్టు ఆదేశం

భూ సేకరణ నష్ట పరిహారాన్ని చెల్లించడంలో నిర్లక్ష్యం

వరంగల్ లీగల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భారత జాతీయ రహదారుల సంస్థ 163 హైవే నిర్మాణం కోసం భూ సేకరణ చేసి సంబంధిత రైతులకు నష్టపరిహారం చెల్లించనందున భారత జాతీయ రహదారుల సంస్థ, జనగామ రెవెన్యూ డివిజనల్‌కు సంబంధించిన చరాస్తులను జప్తు చేయాలని జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా లింగాల ఘనపురంమండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన రైతుల 40 ఎకరాల భూమిని 163 హైవే కోసం సేకరించారు. ముందుగా భూములు నష్టపరిహారం మార్కెట్ రేటుకు అనుకూలంగా లేదని, సదర్ భూమికి రేటు పెంచి ఇవ్వాలని రైతులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. మార్కెట్‌రేటును దృష్టిలో ఉంచుకొని జిల్లా కోర్టు రేటును పెంచుతూ 2023లో తీర్పు వెలువరించింది. తీర్పును అమలు పర్చడానికి 2023లో ఈపీ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జిల్లా జడ్జి ఫిబ్రవరి 2025లో రైతులకు నష్టపరిహారం తీర్పునకు అనుగుణంగా చెల్లించాలని ఆదేశించినప్పటికీ వారు నిర్లక్ష్యం వహించడంతో హనుమకొండలోని జాతీయ రహదారుల సంస్థ, ఆర్డీవో కార్యాలయానికి సంబంధించిన కంప్యూటర్లు, స్టీల్ అల్మారాలు, ఎక్స్‌క్యూటివ్ ఆఫీస్ కుర్చీలు, తదితర ఫర్నిచర్లను జప్తు చేయాలని ఆదేశించారు. అదే విధంగా జప్తు సమయంలో కార్యాలయంలో కనబడిన చరాస్తిని జప్తు చేయాలని జిల్లా జడ్జి తీర్పులో వెలువరించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)


పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2216	2100
పల్లికాయ (సూక)	7150	6500
పల్లికాయ (పచ్చిది)	4050	3400
కందులు	6766	5540
పెసళ్లు	7152	4645
పత్తి	6950	5800
పసుపు (కాడి)	7607	7522
పసుపు (గోల)	6565	6233
తేజ మిర్చి	13500	9000
డిడి	12500	12500
వండర్‌హాట్	16500	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	13000	9500
దేశీ	30000	25500
సింగిల్ పట్టి	38500	35000
దీపిక	16500	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

హామీలకు.. ఆమోదం వచ్చేనా?

- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజల్లో పెరుగుతున్న ఆశలు, అంచనాలు
- హైదరాబాద్‌కు దీటుగా డెవలప్ చేస్తామని పలుమార్లు ప్రకటించిన ప్రభుత్వం
- పెండింగ్ పనులు, ప్రాజెక్టులకు కేటాయింపులపై సర్వత్రా ఉత్కంఠ
- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు


ఇలాంటి అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ కోసం నగరవాసులు ఎదురుచూస్తున్నారు..


దేవాదుల ప్రాజెక్టు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయి బడ్జెట్ సమావేశాలు ఇవే కావటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 2023 డిసెంబరు 7వతేదీన రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగా.. 2024 మార్చిలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో బడ్జెట్ ప్రవేశ పెట్టలేదు. జూలై 25వ తేదీన ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. దీంతో ఈసారి ప్రవేశ పెట్టే బడ్జెట్ పూర్తిస్థాయిది కావడ ంతో నిధుల వరద పారుతుందనే ఆశతో ప్రజలు ఉన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం పలు సంద ర్భాల్లో ఉమ్మడి వరంగల్ అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చింది. వాటికి సంబంధించిన జీవోలు కూడా విడుదల చేసింది. కానీ నిధుల కేటాయింపులు మాత్రం జరగ లేదు. దీంతో ఈ బడ్జెట్‌లోనైనా ఆ హామీలకు ఆమోదం వస్తుందనే ఆశతో ప్రజలున్నారు. తమ నియోజకవర్గాల్లో సమస్యలను ఎజెండా ఎమ్మెల్యేలు గళం వినిపిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.


ఆగిపోయిన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి భవనం

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి నిధులపై ఆశలు..

వరద భయంతో వణికిపోతున్న వరంగల్ వాసులకు ప్రభుత్వం భరోసా ప్రకటన చేసింది. నగరంలో భూగర్భ డ్రెయినేజీ (యూజీడీ) నిర్మాణానికి రూ.4,170కోట్లు కేటాయిస్తున్నట్లు గత నవంబరు 17న ప్రకటించింది. దీంతో 30ఏళ్ల కల నెరవేరబోతోందని నగరవాసులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ నాలుగు నెలలుగా పనులకు టెండర్లు ఖరారు కాలేదు. అంతేకాకుండా వరంగల్ యూజీడీ కోసం రూ.4,170కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా.. కేంద్ర బడ్జెట్‌లో ఆ నిధుల ఊసులేదు. దీంతో కనీసం రాష్ట్ర బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయింపులు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం తొలి విడత రూ.3,087కోట్లు, రెండో విడతలో రూ.597కోట్లు, మూడో విడతలో రూ.486కోట్లు విడుదల చేయాల్సి ఉంది. అంటే మూడేళ్లలో భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

టెక్స్‌టైల్.. గాడిలో పడేనా..?

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కును 1,350ఎకరాల విస్తీర్ణంలో గత ప్రభుత్వం నిర్మాణం చేసింది. రూ.567 కోట్లతో టెక్స్‌టైల్ పార్కులో టీఎస్ఐఐ ద్వారా రహదారులు, ఇతర మౌలిక వసతులు కల్పించారు. అయితే వరంగల్‌కు మరో వస్త్రనగరిగా అభివృద్ధి జరుగుతుందని భావించినా ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రాలేదు. కేవలం కైటెక్స్, గణేషా ఎకోపెట్, ఎకోటెక్, కొరి యాకు చెందిన యంగ్‌వన్ కంపెనీలు మాత్ర మే పరిశ్రమలు స్థాపించాయి. వీటిలో స్థానికులకు పెద్దగా ఉపాధి అవకాశాలు రాలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కును సందర్శించి సమస్యలు తెలుసుకు న్నారు. మొదట భూనిర్వాసితులకు ఇంటి స్థలాలను కేటాయించారు. ఇటీవల 836మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాని కి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేశా రు. నవంబరులో మెగా టెక్స్‌టైల్ పార్కులో అభి వృద్ధిపనులకు రూ.160.99 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ నిధులు విడుదల కావాల్సి ఉంది. గత ఆగస్టు 12న సీఎం రేవంత్‌రెడ్డి కొరియా పర్యటనలో పెట్టుబడులను ఆహ్వానించినా ఆశించిన ఫలితం రాలేదు. దీంతో వరంగల్ వస్త్రనగరి అభివృద్ధిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. అలాగే మడికొండలో వీవర్స్ పార్కు అభివృద్ధికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. జనగామ జిల్లా కొడకండ్లలో రూ.61కోట్లతో చేపట్టిన టెక్స్‌టైల్ పార్కుకు నిధులు లేక నిలిచిపోయింది.

నగరానికి ప్రత్యేక ప్యాకేజీ దక్కేనా..?

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తుందనే ఆశతో ప్రజలు ఉన్నారు. 2016-17లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.250 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతి ఏటా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి, ఆ తరువాత గత ప్రభుత్వం చేతులెత్తేసింది. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి హైదరాబాద్‌కు ధీటుగా వరంగల్‌ను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తుంది. దీంతో వరంగల్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏటా రూ.500కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ఇస్తుందనే ఆశతో ప్రజలు ఉన్నారు.

ఐటీ అభివృద్ధిపై దృష్టి పెట్టండి సారూ..

వరంగల్‌ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం హడావుడి చేసింది. మడికొండలో శివారుల్లో 27ఎకరాల్లో ఐటీ పార్కును 2016లో అభివృద్ధి చేశారు. బెంగళూరు, మైసూరు తరహాలో వరంగల్‌లో ఐటీని అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చారు. ఆశించిన స్థాయిలో కంపెనీలు రాలేదు. వచ్చిన కంపెనీల్లో కొన్ని సౌకర్యాలు లేవంటూ హైదరాబాద్‌కు తరలిపోయాయి. దీంతో ఐటీ ఉద్యోగాల కోసం వరంగల్ యువత హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. సీఎం చొరవ చూపితే వరంగల్‌కు ఐటీ కంపెనీలు వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్- వరంగల్ రహదారిని ఇండస్ట్రీయల్ కారిడార్‌గా అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

సూపర్ స్పెషాలిటీ పట్టాలెక్కేనా..?

ఉమ్మడి జిల్లా ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో వరంగల్ నడిబొడ్డున 56ఎకరాల్లో 24అంతస్తుల్లో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ అస్పత్రి పనులు ముందుకు సాగడం లేదు. తొలుత రూ.1,100 కోట్లతో చేపట్టిన పనులను రూ.1,725.05కోట్లకు గత ప్రభుత్వం పెంచింది. అదనంగా రూ.625.05కోట్లు పెంచటంపై కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అప్పటి నుంచి పనులు పడకేశాయి. ఈ బడ్జెట్‌లో సూపర్‌స్పెషాలిటీ అస్పత్రికి కావాల్సిన నిధులు కేటాయిస్తారనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

దేవాదులకు నిధుల గ్రహణం వీడేనా..?

ఉమ్మడి జిల్లా వరప్రదాయనిగా ఉన్న దేవాదుల ఎత్తిపోతల పథకం పాతికేళ్లకు పైగా నత్తనడకన సాగుతోంది. మూడో దశ పనులు పూర్తయినా నీటిని ఎత్తిపోసే స్థాయికి చేరుకోలేకపోతోంది. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాలతో పాటు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో సుమారు 5.56లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మించగా.. సుమారు 3.16లక్షల ఎకరాలకు నీరందుతోంది. ఇంకా 2.40లక్షల ఎకరాలకు అందాల్సి ఉంది. అయితే భూసేకరణే దేవాదుల ప్రాజెక్టుకు ప్రధాన అడ్డంకిగా మారింది. 33,224ఎకరాలకు గానూ, 30,268 ఎకరాలను సేకరించారు. ఇంకా 2,956 ఎకరాలు సేకరించటం అధికారు లకు కత్తిమీద సాములా మారింది. ఈ క్రమంలో ప్రభుత్వం దృష్టి పెట్టి నిధుల కేటాయింపులు చేస్తే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయనే చర్చ జరుగుతోంది.

- కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కిలో మీటర్ల వరకు వరంగల్ నియో మెట్రో రైల్‌ను ఏర్పాటు చేయాలని 2019 డిసెంబరు 24న అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2025 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.1,341కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన చేశారు. 2021 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. కానీ ఐదేళ్లుగా ఈ ప్రాజెక్టుకు అడుగుల పడలేదు. ఈ బడ్జెట్‌లోనైనా సీఎం వరంగల్‌లో మెట్రో పరుగులు పెట్టేలా నిధులు కేటాయించాలని కోరుతున్నారు.
- మామునూరు ఎయిర్‌పోర్టుకు ప్రభుత్వం రూ.205కోట్లు కేటాయించింది. రైతులను ఒప్పించి భూసేకరణ పూర్తి చేయాల్సి ఉంది. అందుకోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.205కోట్లు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.
- స్టేషన్‌ఘనపూర్ కేంద్రంలోని శివునిపల్లిలో 117ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ పార్కు నిర్మాణం చేయాలని 1999లో ప్రతిపాదనలు చేశారు. రెండు విడతల్లో 120మందికిపైగా లెదర్ ఉత్పత్తుల తయారీపై చెన్నైలో శిక్షణ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు.
- పాలకుర్తి నియోజకవర్గంలో 2009లో పాలకుర్తి- చెన్నూరు రిజర్వాయర్ పనులకు రూ.370కోట్లతో ప్రతిపాదనలు చేసి, 2021లో పనులు ప్రారంభించారు. నిధుల కొరతతో అసంపూర్తిగా వదిలేశారు.

మరన్ని పనులు.. కావాల్సిన నిధులు..

పాలకుర్తి రిజర్వాయర్ కింద 7,516 ఎకరాల్లో, చెన్నూరు రిజర్వాయర్ ద్వారా 25,165 ఎకరాల్లో పంట సాగు కానుంది. దీనిపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- పరకాల నియోజకవర్గంలో 2017లో గీసుకొండ మండలం కొనాయిమాకులం వద్ద రూ.63కోట్లతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. భూసేకరణ సమస్యతో పనులు నిలిచిపోయాయి. ఈ లిఫ్ట్ పూర్తి అయితే సుమారు 14వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.
- సింగరేణి ప్రాంతంగా ఉన్న భూపాలపల్లిలో మైనింగ్ యూనివర్సిటీ కోసం కార్మికుల పిల్లలు ఎదురుచూస్తున్నారు. పదేళ్లుగా అన్ని పార్టీలు హామీలిస్తున్నాయి. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా మైనింగ్ వర్సిటీతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ కోసం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారనే ఆశతో కోల్‌బెల్ట్ ప్రజలున్నారు.
- డోర్నకల్ నియోజకవర్గంలో మరిపెడ మినహా ఇతర మండలాల్లో డిగ్రీ, జూనియర్ కాలేజీలు లేవు. అలాగే జనగామ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు హామీగానే మిగిలిపోయింది.
- బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం చొరవ చూపి, పనులు ప్రారంభించాలని కార్మికులు కోరుతున్నారు.
- ఏజెన్సీలో అటవీ, రెవెన్యూశాఖల మధ్య నెలకొన్న సుమారు 10వేల ఎకరాల వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపేలా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు చొరవ చూపాలని గిరిజనులు కోరుతున్నారు.
- వరంగల్ ప్రాంత విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కొత్త కోర్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా దృష్టి పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.
- కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రం, డోర్నకల్‌లో మిర్చి యార్డు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వర్ధన్నపేట ప్రభుత్వ అస్పత్రిని వందపడకల అస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది.
- భూపాలపల్లి జిల్లా కాటారంలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.350కోట్లు అవసరంగా గుర్తించారు.
- మహబూబాబాద్ జిల్లా మల్యాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీకే) హార్టికల్చర్ యూనివర్సిటీగా మార్చాలనే డిమాండ్ ఉంది. 1998 నుంచి ఇక్కడి రైతులు హార్టికల్చర్ యూనివర్సిటీ కోసం ఆందోళనలు చేస్తున్నారు.
- వరంగల్ జైలును 2021 జూన్ 1న కూల్చేసి అస్పత్రిని నిర్మించారు. మామునూరులో రూ.250కోట్ల వ్యయంతో అత్యంత ఆధునికంగా నిర్మిస్తామన్న ఈ జైలు పనులు నిధుల్లేక ముందుకు సాగటం లేదు.
- ఖిలా వరంగల్ కోటను మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిధులిస్తారని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు.

పాటల పరిమళం కందికొండ

- 20 ఏళ్ల సినీ ప్రస్థానం.. 1300లకుపైగా పాటలు
- కవి, రచయిత, కథకుడిగా కూడా గుర్తింపు

నేడు కందికొండ యాదగిరి వర్ధంతి



హనుమకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : 'మళ్లీ కూయవే గువ్వా..' అంటూ తన పాటలతో మనసులను జివ్వుమనిపించారు. 'గుచ్చి గుచ్చి చంపకే..' అంటూ కుర్రకారు హృదయాలను హుషారెత్తించారు. 'గల గల పారుతున్న సెలయేరులా..' అంటూ తనువులను పరవశింపజేశారు. మరోవైపు జానపద పాటల పూదోటలో మట్టిపరిమళలాను వెదజల్లారు. బతకమ్మను పాటలనూ ఆవిష్కరించి తెలంగాణ సంస్కృతిని ఎలుగెత్తిచాటారు. ఆయనే కందికొండ యాదగిరి. ప్రముఖ సినీగీత రచయిత, కవి రచయిత, కథకుడు అయిన కందికొండ క్యాన్సర్ బారిన పడి కన్నుమూశారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా యాదగిరి పాటల ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

నాగుర్లపల్లి వాసి.. చక్రితో పరిచయం

20ఏళ్ల సినీ జీవితంలో 1300కుపైగా పాటలు రాసిన కందికొండ స్వస్థలం వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి గ్రామం. ప్రాథమిక విద్య సొంతూర్లోనే పూర్తి చేసిన ఆయన డిగ్రీ వరకు మహబూబాబాద్‌లో చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ (తెలుగు లిటరేచర్), ఎంఏ (పొలిటికల్ సైన్స్) పూర్తి చేసి.. ఇదే యూనివర్సిటీ నుంచి తెలుగులో పీహెచ్‌డీ కూడా అందుకున్నారు. కందికొండ తాను చదువుకునే రోజుల నుంచే పాటలు రాయడం నేర్చుకున్నారు. కందికొండ ఇంటర్ చదివేటప్పుడే సినీ సంగీత దర్శకుడు చక్రితో పరిచయం ఏర్పడింది. మొదట్లో జానపద గీతాలు రాసిన కందికొండ.. తొలిసారిగా చక్రి సంగీత దర్శకత్వం వహించిన ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం చిత్రంలో 'మళ్లి కూయవే గువ్వా..' అనే పాటను రచించి.. సినీ సాహిత్యంలో అడుగు పెట్టారు. ఆ పాట చాలా పాపులర్ అయింది. సంగీత దర్శకుడు చక్రి, దర్శకుడు పూరీ జగన్నాథ్ వరుస అవకాశాలివ్వడంతో సినీ పరిశ్రమలో కందికొండ గేయరచయితగా నిలదొక్కుకున్నారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్‌బాబు నటించిన పోకిరీ సినిమాలోని 'గల గల పారుతున్న సెల యేరులా' పాటను కూడా ఆయనే రచించారు. ఇడియట్ సినిమాలో 'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే' పాట కూడా యాదగిరి కలం నుంచి జాలువారిందే. శ్రీకాంత్ నటించిన కోతల రాయుడు కందికొండ ఆఖరి చిత్రం కాగా.. కందికొండ తన పన్నెండేళ్ల సినీ ప్రస్థా నంలో 1300కుపైగా పాటలు రాశారు. ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం, 143, ఆంధ్రావాలా, అల్లరిపిడుగు, ఆప్తుడు, ఒక రాధా ఇద్దరు కృష్ణుల పెళ్లి, చక్రం, ఎంజాయ్, ఆడుతూ పాడుతూ, షాక్, రణం, పోకిరి, సీతారాముడు, స్టాలిన్, తొలిచూపులోనే, చిన్నోడు, భాగ్యలక్ష్మి బంబర్ డ్రా, ఆదిలక్ష్మి, నువ్వంటే నాకిష్టం, ధన 51, అమ్మ నాన్న తవిళ అమ్మాయి,మున్నా, లవ్ యు బంగారం, తదితర సినిమాలు పేరుతెచ్చిపెట్టాయి.

జానపదాన్ని విడిచిపెట్టని కందికొండ..

కండికొండ సినిమాల్లో పాటలు రాస్తూనే తనకు ఇష్టమైన జానపదాన్ని విడిచిపెట్టలేదు. తెలంగాణ యాస, భాషను ప్రాణంగా భావించే ఆయన తెలంగాణ నేపథ్యంగా 200పైగా జానపద గీతాలను రచించారు. తెలంగాణ యాసలోనూ తెలంగాణ నేపథ్యం ఉట్టిపడేలా పలు ప్రైవేటు ఆల్బమ్స్‌కు సాహిత్యం అందించారు. తెలంగాణ సాహిత్యం, మాండలికం, యాసపై పట్టున్న కందికొండకు ఆదే కళ ఆయనకు గేయరచయితగా మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆయన బతుకమ్మ నేపథ్యంలో రాసిన పాటలు పల్లెపల్లెనా, గడపగడపనా జనాల నోట మారుమ్రోగాయి. ఆయన పాటలే కాదు కవిత్వంలోనూ దిట్ట. తెలంగాణ యాసలో మనసుకు హత్తుకునేలా కవిత్వం రాయటం ఆయన ప్రత్యేకత. మట్టిమనుషుల వెతలను, పల్లె బతుకు చిత్రాన్ని కథలుగా రచించి ఆయన ఒక మంచి కథకుడిగా విశేష ఆదరణ పొందారు.

క్రీడలపై ఆసక్తి.. బాడీబిల్డర్‌గానూ రాణింపు

కందికొండకు క్రీడలపై ఎంతో ఆసక్తి ఉండేది. ఇంటర్ చదువుతున్న రోజుల్లో పరుగు పందెంలో జాతీయ స్థాయిలో పలు పతకాలను గెలుచుకున్నారు. తర్వాత బాడీబిల్డింగ్‌పై దృష్టి పెట్టి అందులోనూ రాణించారు. డిగ్రీ ఫస్టియర్‌లో మిస్టర్ కళాశాల, ఆ తర్వాత మిస్టర్ మహబూబాబాద్ అవార్డులను అందుకున్నారు. 1998 లో పృథ్వీ పేరుతో వార పత్రికను స్థాపించారు. విలేకరులను నియమించుకొని మహబూబాబాద్, నర్సంపేట, ప్రాంతాల్లోని రాజకీయ, సామాజిక అంశాలపై కథనాలు ప్రచురించి పలువురి మన్ననలను పొందారు. అలాగే సినిమా పాటల రచయితగా స్థిరపడిన తర్వాత తన మకాంను హైదరాబాద్‌కు మార్చినా తాను పుట్టి పెరిగిన ఊరు నాగుర్లపల్లెను మరిచిపోలేదు. స్వగ్రామంలో నాలుగు గుంటల స్థలం కొనుగోలు చేసి సొంతంగా ఇల్లు నిర్మించుకున్నారు. 2021లో బతుకమ్మ పాటను రచించిన కందికొండ స్వగ్రామం నాగుర్లపల్లెలోని మాధన్నపేట సరస్సు కట్టపై బతుకమ్మ పాట చిత్రీకరణ చేయించారు. ఇక కందికొండ చిన్న వయసులోనే క్యాన్సర్‌బారిన పడి జయించారు. కానీ ఆ తర్వాత కాలంలో తిరగబెట్టగా.. ఎక్కువ కాలం కీమోథెరపీ చేయించుకోవడంతో వెన్నెముక దెబ్బతిని నడవలేని స్థితికి చేరుకున్నారు. సర్జరీ చేసినా ఆరోగ్యం మెరుగు పడలేదు. చివరకు 2022 మార్చి 12న హైదరాబాద్‌లోని తన ఇంట్లో కన్నుమూశారు. ఆయనకు భార్య రమాదేవి, కూతురు మాతృక, కుమారుడు ప్రభంజన్ ఉన్నారు. తల్లిదండ్రులు సాంబయ్య, కొమురమ్మ. దంపతులకు ముగ్గురు సంతానంలో కొందికొండే పెద్ద. ఆయన మరణంతో వరంగల్ జిల్లా ఒక గొప్ప సినీ గేయరచయితను కోల్పోయింది. ఆయన రాసిన పాటలు ఇప్పటికీ ఎప్పటికీ ప్రజల గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

కొండపర్తిని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతాం

- వికసిత్ భారత్ స్ఫూర్తిగా బ్రాండ్ ఇమేజ్ సాధిస్తాం
- దత్తత గ్రామ పర్యటనలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- బహుళ ఉపాధి కార్యక్రమాల ప్రారంభోత్సవం
- హాజరైన మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు


వనదేవతల సన్నిధిలో ఎత్తు బంగారం తూగుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తాడ్వాయి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అడవిపల్లె కొండపర్తి గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతామని, వికసిత్ భారత్ స్ఫూర్తిగా బ్రాండ్ ఇమేజ్ సాధిస్తామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. తాను దత్తత తీసుకున్న ములుగుజిల్లా తాడ్వాయి మండలం కొండపర్తిలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీనాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూర్య సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తో కలిసి బహుళ ఉపాధి కార్యక్రమాలను ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు కొండపర్తికి చేరుకున్న గవర్నర్‌కు మహిళలు, కళాకారులు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. విద్యార్థులతో డిజిటల్ పాఠాలను విన్నారు. వారితో ఇంగ్లి‌ష్‌లో మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పలకలపై బొమ్మలు గీసి చూపించారు. ఆ తర్వాత గ్రామంలో రూ.35లక్షలతో నిర్మించిన బహుళార్థక భవనాన్ని ప్రారంభించారు. రూ. 7,84,700తో ఏర్పాటు చేసిన మసాల యూనిట్, రూ.7, 76,594 వ్యయంతో ఏర్పాటు చేసిన కుట్టు విఘన్ యూనిట్‌ను ప్రాంభించారు. అనంతరం రిమోట్ తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గవర్నర్ మాట్లాడారు. కొండపర్తిలో 70 ఆదివాసీ గృహాలు, 285మంది ప్రజలు నివసిస్తున్నారని, ఇది చిన్న గ్రామమైనా అభివృద్ధిలో ఆదర్శంగా నిలువాలని గవర్నర్ జిష్ణుదేవ్ ఆకాంక్షించారు. సమాజాభివృద్ధికి మన సేవలు ఎంతో అవసరం అన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఇంగ్లి‌ష్‌లో మాట్లాడుతుండటం అభినందనీయమన్నా రు. మహిళలు ఆర్థికాభివృద్ధికి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో అమూల్ సంస్థ ఏ విధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా యూనిట్లు కూడా అంతే పేరు గడించాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో మిర్చి సాగు బాగుందని మిర్చి పౌడర్‌కు మంచి ఇమేజ్ రావాలని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మిర్చి పౌడర్ ఫేమస్ కావాలని సూచించారు.

వికసిత్ భారత్‌కు స్ఫూర్తిగా కొండపర్తి

ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పానికి కొండపర్తి గ్రామం ఆదర్శంగా నిలువాలని గవర్నర్ పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతమైన కొండపర్తి గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని, రాష్ట్రంలో ఇంకా ఏడు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నానని అన్నారు. దేశంలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.


కొమురం భీం విగ్రహావిష్కరణలో పాల్గొన్న జిష్ణుదేవ్ వర్మ, సీతక్క, అధికారులు

కొండపర్తిలో రూ. 1.5కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధి, పేద ప్రజలు, మహిళల ఆర్థికాభివృద్ధికి తాను, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాగం కృషి చేస్తోందని తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు వల్ల ఆదాయం సమకూరుతుందని, తద్వారా ఆదివాసీలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని అన్నారు. తాను, రాష్ట్రపతి, మంత్రి సీతక్క అందరం ఆదివాసి బిడ్డలమని తెలిపారు. దేశానికి కొండపర్తిని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.




సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పాఠశాలలో పిల్లలతో కలిసి డిజిటల్ పాఠాలు వింటున్న గవర్నర్ జిష్ణుదేవ్


సారలమ్మను దర్శించుకుంటున్న గవర్నర్

జిల్లా యంత్రాగం సేవలు అభినందనీయం : మంత్రి సీతక్క

జిల్లా అభివృద్ధికి, కలెక్టర్ దివాకర, యంత్రాగం సేవలు అభినందనీయమని మంత్రి సీతక్క అన్నారు. దట్టమైన అడవిలో ఉన్న మారుమూల గ్రామమైన కొండపర్తిలో చకాచకా అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. కనీసం రవాణా సౌకర్యం కూడా లేని గ్రామాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకొని అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందన్నారు. మహిళల స్వావలంబన ఇక్కడ యూనిట్లను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. మహిళలు మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ గ్రామానికి అనతి కాలంలోనే రహదారి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు గవర్నర్ ఏడు బోరు మోటర్లు మంజూరు చేశారని తెలిపారు. గ్రామస్థులు రెండు పంటలు పండించే అవకాశం కల్పించిన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 40 పరిశ్రమలు దిశా స్వచ్ఛంద సంస్థ సహకారంతో 100 పాఠశాలలు దత్తత తీసుకున్నామని, ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లి‌ష్‌లో అనర్గళంగా మాట్లాడుతున్నారని అన్నారు. ఆదివాసి విద్యార్థులకు అద్భుతమైన విద్యా బోధనలు జరుగుతున్నాయని అన్నారు.

కలెక్టర్ దివాకర మాట్లాడుతూ 70 గృహాలు, 285 మంది జనాభా కలిగిన ఈ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు గవర్నర్ దత్తత తీసుకోవడం గొప్ప విషయమన్నారు. గవర్నర్ గ్రామాన్ని దత్తత తీసుకున్న వెంటనే ఈ గ్రామం అభివృద్ధిలో పథంలో ముందుందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల భవనాలకు రూ. 70లక్షలతో మరమ్మతులు చేపట్టామని, ఆధునాతన హంగులతో వినియోగంలోకి తెచ్చామని అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి గవర్నర్ రూ. 1.5కోట్లు మంజూరు చేశారని తెలిపారు. పంటలను సాగు చేసుకొనేందుకు బోర్లు నిర్మించారన్నారు. తద్వారా 50ఎకారాల్లో మిర్చి సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, గవర్నర్ ఏడీసీ మేనేజర్ అమన్ కుండు, గవర్నర్ సీఎస్‌వో శ్రీనిస్‌వావు, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రా విశ్రా, జిల్లా గ్రథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, గ్రామ పెద్దలు లచ్చుపటేల్ గ్రామ ప్రజలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలకు ప్రత్యేక పూజలు

మేడారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. కొండపర్తి పర్యటన అనంతరం తల్లును దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

భారీ భద్రత నడుమ గవర్నర్ పర్యటన

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో గవర్నర్ పర్యటనలో భాగంగా జిల్లా పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. తాడ్వాయి నుంచి మేడారం వైపు మీదుగా వాహనాలను తరలించారు.

కొంత సమయం వరకు తాడ్వాయి పస్రా రహదారి వాహనాలు నిలిపివేశారు. దారి పొడవునా బందోబస్తు ఏర్పాటు చేశారు. వనదేవతల దర్శనాల సమయంలో గద్దెల గేట్లకు తాళాలు వేసి సామన్య దర్శనాలు నిలిపి వేశారు.

పర్యావరణ హిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం

కొండపర్తి గ్రామాన్ని పర్యావరణ పరిరక్షణ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా గవర్నర్ కొండపర్తిని దత్తత తీసుకున్నారని ఆయన కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అన్నారు. గ్రామంలో ప్రతి కుటుంబానికీ ఆదాయం సమకూరాలనే సంకల్పంతో అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడ తయారు అవుతున్న కారం, పసుపు, మసాలా పౌడర్ యూనిట్‌కు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక సంఘలకు వ్యాపార నిర్వహణకు ప్రముఖ ప్రాంతంలో దుకాణాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈగ్రాంతంలో 150 ఎకరాల్లో లాభదాయకమైన మార్కెటింగ్ కలిగిన ఆధునిక వ్యవసాయం సాగు చేపట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గవర్నర్ తీసుకున్న ఏడు గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చర్యలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి పాటుపడే సంస్థలకు రాష్ట్ర వ్యాప్తంగా అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

- గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్

మహిళలు ప్రశ్నించే స్థాయికి ఎదగాలి

బాలసముద్రం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక ఎదుగుదల, సమాజ, కుటుంబ సహకారం అందినప్పుడే అదే నిజమైన మహిళా సాధికారత అని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్ సమీపంలో గల స్పందన మానసిక దివ్యాంగుల, బధిరుల ఆశ్రమంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఉపాధ్యాయినీలను సన్మానించారు. పిల్లలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంకా పుల్లూరు సుధాకర్, సురేష్‌లాల్, నవీన్, సుదర్శన్, రమ, సుకుమారి, చిర్ర రాజు, సుచరిత, వసుధ, హరిత పాల్గొన్నారు.

గ్రూప్స్ ఫలితాలను నిలిపివేయాలి

హసన్‌పర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే గ్రూప్-1, 2, 3 ఫలితాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పుట్ట రవి మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షను ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఆరెపల్లి పవన్‌మాదిగ, రాజారపు భిక్షపతి మాదిగ, రేణికుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ పాల్గొన్నారు.



చిన్నారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అడ్‌హక్ కమిటీ సభ్యులు

డంపింగ్ యార్డును ఎత్తివేయించండి

హైదరాబాద్ ప్రజావాణిలో బాధితుల వినతి

మడికొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మడికొండ, రాంపూర్ శివారులోని చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేయాలని కోరుతూ డంపింగ్ యార్డు నిర్మూలన అడ్‌హక్ కమిటీ సభ్యులు. స్థానిక ప్రజలు మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌కు వెళ్లి ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ప్రజావాణి ఇన్‌చార్జ్, స్టేట్ ప్లానింగ్ బోర్డు చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేసి డంపింగ్ యార్డు సమస్య తీవ్రతను వివరించారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న విషవాయువులతో కూడిన పొగ గ్రామాలను కమ్మేసి ప్రజలను ఊపిరాడకుండా చేస్తోందన్నారు. ముఖ్యంగా రాత్రయిందంటే డంపింగ్ పొగతో చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాస తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు శ్వాసకోశ, క్యాన్సర్ తదితర అనేక రుగ్మతల బారిన పడటంతో పాటు అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అలాగే డంపింగ్ యార్డు నీరు చెరువులోకి చేరి నీరు కలుషితం అవుతోందన్నారు. వెంటనే డంపింగ్ యార్డును ఎత్తివేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న చిన్నారెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు, మునిసిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి త్వరగా సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని కలెక్టర్, కమిషనర్ ఆదేశించినట్లు అడ్‌హక్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో టీ కరుణాకర్‌రెడ్డి, దువ్వ నవీన్, పొనగోటి వెంకట్రావు, గడ్డం మహేందర్, బొల్లికొండ వినోద్‌కుమార్, వస్కుల శంకర్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బీ లింగమూర్తి, జవ్వాజి కిషన్, కే రాజేష్‌రెడ్డి, ఎలగొండ శివ, దండిగం సతీష్, శైలశ్రీ, కే రాజేష్, పీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణలో ఆర్పీల సేవలు కీలకం

సమీక్ష సమావేశంలో మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో ఆర్పీల సేవలు కీలకమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆర్పీలు, టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బందికి మేయర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 26 ఆగస్టు 2020కి ముందు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆర్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు అర్హులని అన్నారు. కచ్చా లేఅవుట్ చేసిన వారు ఫోన్ ద్వారా అవగాహన కల్పించాలని వెల్లడించారు. రెగ్యులైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితీతో ఈ నెల 31 వరకు ప్రభుత్వం గడువు కల్పించిందన్నారు. ఈ అవకావాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ ఆర్పీ వంద మంది దరఖాస్తుదారులకు ఫోన్‌ల ద్వారా సమాచారం అందజేయాలన్నారు. మార్చి 31 కంటే ముందు పేమెంట్ చేసే విధంగా ప్రజలకు ఆర్పీలు అవగాహన కల్పించాలని చెప్పారు. బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఉపయోగించుకోవాలని ప్రజలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, ఏసీపీలు ఇర్షాద్, రజిత, టీఎంసీ కంజర్ల రమేష్‌తో పాటు కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న

చేనేత హస్తకళా ప్రదర్శన



హస్తకళా ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

హనుమకొండ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని టీటీడీ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కళా సిల్క్ హాండ్ క్రాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా ప్రదర్శన, అమ్మకాలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. కళాప్రదర్శనలోని వస్తువులు, దుస్తులు పలువురిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దేశంలో పది రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత దస్తుల అమ్మకాలతో పాటు స్టోన్, జువెల్లరీస్, కుర్తా, డ్రెస్ మెటీరియల్, డోర్ కర్టన్స్, పెరల్స్, ఉడెన్ హ్యాండ్ క్రాఫ్ట్, బంజారా కోల్‌కత్తా బ్యాగ్స్, జైపూరీ రాంజీ, ఒరిస్సా హ్యాండ్ క్రాఫ్ట్ వస్తువులు ఈ ప్రదర్శనలో లభిస్తాయి. గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, ఉత్తరప్రదేశ్ జామ్‌దాని, బనారస్, లక్నో డ్రెస్‌మెటీరియల్, రాజస్థాన్ కోట, బందన్, బ్లాక్ ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్‌మెటీరియల్, కర్నాటకలోని క్రేన్, ప్రింటెడ్ చీరెలు, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి, జమ్మూ కశ్మీరులోని ఎంబ్రాయిడరీ చీరెలు, పాష్మిన్‌శాల్, డ్రెస్‌మెటీరియల్, ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పడ చీరెలు, అస్సాంలోని మూగా, ఎరిశిల్క్, బిహార్‌లోని బాగల్పూర సిల్క్, ట్రస్సర్, చత్తీస్‌గఢ్‌లోని ట్రిబుల్ వర్క్, కోస సిల్క్ చీరెలు, గుజరాత్‌లోని బందాని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్‌తోపాటు చీరెలు, నేతన్నలు నేసిన చీరెలను ఈ స్టాల్స్‌లో ప్రదర్శన, అమ్మకాల కోసం ఉన్నాయని ఆర్గనైజర్ సంజయ్ జైన్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్ కూడా ఇస్తున్నామని చెప్పారు. ఈ నెల 13వ తేదీ వరకు మాత్రమే ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని, ఇప్పటికే మహిళల నుంచి ఎక్కువగా ఆదరణ లభిస్తోందని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇన్నోవాను ఢీకొట్టిన గ్రానైట్ లారీ

» రోడ్డుపై పడ్డ భారీ రాయి » ఐదుగురికి గాయాలు




డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

వరంగల్ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవా వాహనాన్ని గ్రానైట్ లారీ ఢీకొట్టగా ఇన్నోవాలో ఉన్న ఐదుగురికి తీవ్రగాయాలైనట్లు సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులు భూపాలపల్లిలో జరిగే వివాహానికి వెళ్లి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున సుమారు 3.30 ప్రాంతంలో కరీంనగర్ నుంచి కాకినాడకు వెళ్తున్న గ్రానైట్ లారీ సుబేదారి ఫారెస్టు ఆఫీస్ జంక్షన్‌లో రెవెన్యూ కాలనీ వైపు నుంచి వడ్డెపల్లి వైపు రోడ్డు దాటుతున్న ఇన్నోవాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ఉన్న ఒక వ్యక్తికి కాళ్లు విరగగా, మిగతా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో లారీలోని భారీ రాయి రోడ్డుపై పడింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా, రోడ్డు ప్రమాదంలో డివైడర్ ధ్వంసమై ట్రాఫిక్ స్తంభించగా సుబేదారి, కాజీపేట ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. కాగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

ఉపాధిహామీ ప్రణాళిక ఖరారు

» 2025-26 సంవత్సరానికి 21,84,800 లక్షల పనిదినాల కేటాయింపు

» గ్రామసభల ద్వారా పనులు గుర్తించిన అధికారులు



హనుమకొండ కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, కూలీలకు ఉపాధి కల్పించేందుకు సంబంధిత అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు కేటాయించే పనులు, కేటాయించాల్సిన నిధులు, ఎలాంటి పనులు చేపట్టాలనే దానిపై ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి గుర్తించారు. ప్రధానంగా వేసవికాలంలో ఎక్కువగా వ్యవసాయ పనులు ఉండవు కాబట్టి కూలీలు పనుల కోసం పట్టణాలు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా నివారించేందుకు అధికారులు ప్రణాళికలు చేపట్టారు.

కూలీలకు వెంటనే బిల్లుల చెల్లిస్తాం

మేన శ్రీను, (డీఆర్‌డీవో) జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి



కూలీలు చేసిన పనులకు వెంటవెంటనే బిల్లులు చెల్లిస్తాం. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో కూలీలు ఉపాధి హామీ పథకం పనులకు వచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం వేసవి కాలం కాబట్టి కూలీ చేసే ప్రదేశాలలో కూలీలకు అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేస్తున్నాం. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూడా కూలీలకు అందుబాటులో ఉంచుతున్నాం.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మత్స్య, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులను గుర్తించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 21,84,800 లక్షల పనులను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ పనులను చేపట్టేందుకు సుమారు రూ.100 కోట్ల నిధులు ఖర్చు చేయాలని అంచనా వేశారు. ప్రతీ కూలీకి పని కల్పించేలా ప్రజల భాగస్వామ్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తారు.

ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు

ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించి గ్రామస్థులు, రైతులు, ఉపాధి హామీ కూలీలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ పాలకవర్గంతో కలిసి గుర్తించారు. గ్రామాల్లో మట్టి రోడ్లు వేయడం, చెరువుల్లో మట్టి పూడికతీత, అవసరమైన రైతుల పొలాల్లోకి ఒండ్రు మట్టిని తరలించడం, నీటి నిల్వల కోసం కట్టలు, కాల్వలు తవ్వడం, కందకాలు ఏర్పాటు చేయడం లాంటి పనులు చేపట్టనున్నారు. అత్యవసర పనులతో పాటు రైతులు, గ్రామస్థులకు అవసరమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

పెరగనున్న కూలీల సంఖ్య

ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూమిలేని కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద యేటా రూ.12వేల ఆర్థిక సాయం అందించనుంది. ఇందుకోసం 20 రోజుల ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలను అర్హులుగా గుర్తిస్తుంది. దీంతో జాబ్‌కార్డు తీసుకోకుండా ఉన్న నిరుపేదలంతా ఉపాధి హామీ పనులకు వెళ్లే అవకాశం ఉంది. పెరిగే కూలీల సంఖ్యకు అనుగుణంగా పనులను కల్పించేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు	86,046
కూలీల సంఖ్య	1,69,958
యాక్టివ్‌గా ఉన్న కూలీలు	80,760
పురుష కూలీలు	1,08,278
మహిళా కూలీలు	61,680
మొత్తం పని దినాలు	21,84,800

మండలాల వారీగా కేటాయించిన పనిదినాలు

మండలం	పనిదినాలు
ఆత్మకూరు	168518
భీమదేవరపల్లి	238822
దామెర	152788
ధర్మసాగర్	156480
ఎల్కతుర్తి	181161
హసన్‌పర్తి	158000
ఐనవోలు	122402
కమలాపూర్	305503
నడికూడ	184423
పరకాల	103200
శాయంపేట	271213
వేలేరు	142290

ఇంటర్ స్పాట్ కేంద్రాన్ని బోర్డు అధికారుల పరిశీలన



స్పాట్ కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాకు నూతనంగా కేటాయించిన ఇంటర్ స్పాట్ కేంద్రాన్ని ఇంటర్ బోర్డు అధికారులు సందర్శించారు. సోమవారం ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో నూతనంగా ప్రారంభించిన ఇంటర్ స్పాట్ కేంద్రాన్ని బోర్డు అధికారులు మంగళవారం సందర్శించారు. స్పాట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులు, స్ట్రాంగ్ రూమ్‌ల వివరాలను తదితరాలను డీఐఈవో డాక్టర్ శ్రీధర్ సుమన్ బోర్డు అధికారులు యాదగిరి, ఖాదర్ షరీఫ్‌లకు వివరించారు. ప్రస్తుతం సంస్కృతం మూల్యాంకనం జరుగుతుండగా ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్, 24 నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్, 26 నుంచి కెమిస్ట్రీ, కామర్స్, 28 నుంచి హిస్టరీ, బోటనీ, జువాలజీ పేపర్ల మూల్యాంకనం ప్రారంభించనున్నట్లు క్యాంపు ఆఫీసర్ శ్రీధర్‌సుమన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డెక్ సభ్యులు కె. మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన సీఎం

ఎమ్మెస్పీ జాతీయ నేత వేల్పుల సూరన్న కాపు

హనుమకొండ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను నమ్మించి మోసం చేశారని ఎమ్మెస్పీ జాతీయ నేత వేల్పుల సూరన్న కాపు అన్నారు. వర్గీకరణపై ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలిపోతాడన్నారు. ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు వద్ద ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష మూడోరోజుకు చేరింది. ఈ దీక్షలకు ముఖ్య అతిథిగా ఎమ్మెస్పీ జాతీయ నేత వేల్పుల సూరన్న కాపు హాజరై మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లోనే వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, నాయకులు మంద రాజు మాదిగ, బండారి సురేందర్ మాదిగ, చేతల్ల శివ మాదిగ, అక్కెనకుంట వెంకటస్వామి మాదిగ, మంద వర్ధన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డికాలనీలో చైన్‌స్నాచింగ్

రెండున్నర తులాల పుస్తెలతాడు చోరీ

వరంగల్ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీలో మంగళవారం ఉదయం వృద్ధురాలి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి పుస్తెలతాడు లాక్కొని పారిపోయాడని ఎస్సై పరుశురాములు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. శ్రీరంగ ఆస్పత్రి సమీపంలో నివాసం ఉంటున్న వల్లెం విజయ (70) ఆస్పత్రికి వెళ్లి తిరిగొచ్చి ఇంటి గేటు తీస్తుండగా హెల్మెట్ ధరించిన ఓవ్యక్తి బైక్‌పై వచ్చి మహిళ మెడలోని పుస్తెలతాడు లాగగా, బాధిత మహిళ అడ్డుకునే ప్రయత్నం చేసింది. పుస్తెలతాడుకు ఉన్న బిల్ల అక్కడే పడిపోగా చేతికి దొరికిన రెండున్నర తులాల తాడును పట్టుకొని గుర్తుతెలియని వ్యక్తి పారిపోతుండగా వృద్ధురాలు కేకలు వేసింది. చుట్టుపక్కల వాళ్లు వెంబడించగా చైన్‌స్నాచర్ దొరకకుండా పరారయ్యాడు. సంఘటనా స్థలాన్ని సీఐ సతీష్, ఎస్సై అశోక్ సందర్శించి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరుశురాములు తెలిపారు.

మహిళా చైతన్యంతోనే

సమాజాభివృద్ధి

ప్రజాస్వామిక రయితల సంఘం ప్రతినిధి రజిత

హనుమకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలు చైతన్యవంతులు అయితేనే దేశం, సమాజం అభివృద్ధి దిశలో పయనిస్తుందని ప్రజాస్వామిక రయితల సంఘం ప్రతినిధి అనిశెట్టి రజిత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మహిళా పెన్షనర్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఫోరం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మహిళా పెన్షనర్స్ ఫోరం ఉమ్మడి జిల్లా చైర్‌పర్సన్ డి.జ్యోతి రమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రజిత మాట్లాడుతూ.. ఇప్పటికీ మహిళలు పూర్తి సాధికారత సాధించలేదని, అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ కుటుంబంలో తగిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేకుండా ఉంటున్నారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శ్రామిక మహిళా పోరాట దినంగా వ్యవహరించాలని కోరారు. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి ఫూలే మహిళల విద్య కోసం, వారి అభివృద్ధి కోసం చేసిన కృషిని రజిత వివరించారు. బి.రమాదేవి (టీపీఎఫ్), ఫోరం జిల్లా కమిటీ సభ్యులు సుమ, రాజకొమురమ్మ తదితరులు ప్రసంగించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన వారికి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు జి.వీరాస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రు సుధీర్‌బాబు, ఎన్.సదానందం, గౌరవ అధ్యక్షుడు తుమ్మ వీరయ్య, హనుమకొండ సహ అధ్యక్షుడు కె.సమ్మారెడ్డి, సుకుమార్ రెడ్డి, సింగారెడ్డి, సత్యనారాయణ, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు, మహిళా పెన్షనర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళల పోరాటాలకు సంఘీభావం తెలిపారు. సమాన పనికి సమాన వేతనం కోసం కృషి చేయాలని, మహిళా పెన్షనర్లు నేటి యువతకు సరైన మార్గదర్శనం చేయాలని, మహిళా సాధికారత కోసం జరిగే ఉద్యమాల్లో పాల్గొనాలని, లింగ వివక్షకు వ్యతిరేకంగా, లింగ సమానత్వం కోసం ఉద్యమించాలని కోరుతూ కూడా సమావేశంలో తీర్మానాలు ఆమోదించారు.

గాత్ర మాధుర్యానికి మెరుగులు దిద్దుకోండి

గాయకులకు మాస్టర్ శరత్‌చంద్ర పిలుపు



పాటకు కీబోర్డు వాయిస్తున్న డాక్టర్ శరత్‌చంద్ర

హనుమకొండ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కళల నగరంలో కళా ప్రతిభకు కొదువలేదని, భిన్నరంగాల కళాకారులకు ఓరుగల్లు నిలయమని ఘంటసాల సంగీత కళాశాల వ్యవస్థాపకుడు మాస్టర్ డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. హనుమకొండలోని సాయిమీరా సంగీత కళాక్షేత్రంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఐడల్ గంధర్వ గాయనీ గాయకుల శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కళాకారులకు తర్ఫీదు ఇస్తున్నారు. సాయిమీర సంగీత కళాక్షేత్రం వ్యవస్థాపకుడు కె.పోతనచారి, కార్యదర్శి ఎన్.లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకుడు, ప్రొఫెసర్ తిరుపతయ్య అధ్యక్షత వహించారు.

విద్యుత్ పునరుద్ధరణ కోసం రీస్టోర్ బృందాలు

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయాలు తగ్గించి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు ఎమర్జెన్సీ రీస్టోర్ బృందాలు (ఈఆర్‌టీ)లు ఏర్పాటు చేశామని వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ కె.గౌతంరెడ్డి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక విద్యుత్ సమస్యలతో ఏర్పడే అంతరాయాలను తగ్గించడానికి బ్రేక్ డౌన్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జీపీఆర్‌ఎస్ లోకేషన్‌తో వేగం వెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు అంబులెన్స్ తరహాలో ఈఆర్‌టీ వాహనాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. బ్రేక్‌డౌన్ బృందాల్లో ఆరుగురు సభ్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని ఎస్ఈ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సై మాధవ్‌గౌడ్‌కు పలువురి అభినందన



హసన్‌పర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన గ్రూప్ -1 ఫలితాలలో కేయూ పోలీసు స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బొంగు మాధవ్‌గౌడ్ 505 మార్కులు సాధించారు. కొంతకాలంగా సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే పట్టుదలతో గ్రూప్-1 పరీక్షలకు సన్నద్ధమై అత్యధిక మార్కులు సాధించడంపై మాధవ్‌గౌడ్‌ను ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, ఎస్సైలు శ్రీకాంత్, రవీందర్, అర్చనలతో పాటు పోలీసు సిబ్బంది అభినందించారు.

ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలించాలి

వరంగల్ మెడికల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని సమష్టిగా నిర్మూలిద్దామని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ మదన్ మోహన్ అన్నారు. సంపూర్ణ సురక్ష కేంద్రం ఛాతి, టీబీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం మేనేజర్ ఇక్బాల్ పాషా అధ్యక్షతన మెగా హెల్త్ క్యాంపును హనుమకొండలోని జితేందర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సుమారు 148 మందికి ఓపీ చూసి, జనరల్ చెకప్‌తోపాటు టీబీ, షుగర్, డెంగీ, మలేరియా, హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ తదితర సాధారణ పరీక్షలు నిర్వహించారు.

అనంతరం మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలించేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. నెల రోజుల పాటు ప్రజల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సులు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.సునీత, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గీత, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ అరుణ్, సురేశ్, రామ్‌కుమార్, రఘు, రాజేష్, రాజేంద్రప్రసాద్, సరిత తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

కేయూ క్యాంపస్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు సామాజిక న్యాయం అందుతుందని, వర్గీకరణ అమల్లోకి వచ్చిన తర్వాతే ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య అన్నారు. మంగళవారం కేయూ దూరవిద్య కేంద్రం వద్ద ఎంఎస్ఎఫ్ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలని రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన గాదె సమ్మయ్య, కేయూ హాస్టల్స్ డైరెక్టర్, అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కేయూ బయోటెక్నాలజీ ప్రొఫెసర్ పోడేటి శ్రీనివాస్‌లు హాజరై దీక్షల్లో కూర్చున్న విద్యార్థులకు పూలమాల వేసి ప్రారంభించారు. దీక్షలకు కేయూ బీసీసెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ నేతలు డాక్టర్ అరూరి రంజిత్, భైరపాక ప్రశాంత్, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగంటి నాగరాజుగౌడ్, ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపల్లి మధు, దివ్యాంగుల సంఘం కేయూ ఇన్‌చార్జి బానికే నాగరాజు, ఎంఎస్ఎఫ్ కేయూ నేతలు అడ్డూరి గణేశ్, రాణాప్రతాప్, ప్రసన్నకుమార్, రమేశ్, కుమ్మరి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తనిఖీ



షెడ్డు వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ

వరంగల్ కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డులోని సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లోని యంత్రాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వెహికల్ షెడ్డుకు వచ్చే స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతు చేయడంతో జాప్యం జరుగుతోందని ఫిర్యాదులు అందాయని, ఇకపై పనిలో ఆటంకం జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ మహేందర్, డీఈ శివానంద్, ఏఈ సంతోష్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాషన్

వేసవిలో గాలి చొరబడే, తేలికపాటి కాటన్ చీరల ట్రెండ్ మొదలైపోతుంది. వీటిలో ప్రింటెడ్ కాటన్ చీరలు సర్వత్రా ఆదరణ పొందుతూ ఉంటాయి. అలాంటి కొన్ని కాటన్ చీరల మీద ఓ లుక్కేద్దామా...

వేసవిలో హాయిగొలిపేలా



మల్ కాటన్

మస్లిన్ కాటన్ అనే పేరున్న ఈ మల్ కాటన్ చీరలు శతాబ్దాలుగా వాడుకలో ఉన్నాయి. పర్షియా భాషలో మల్‌మల్ అనే పదానికి కాటన్ వూల్ అని అర్థం. పేరుకు తగ్గట్టే ఈ చీరలు ఎంతో మెత్తగా, సౌకర్యంగా ఉంటాయి. ఈ మల్ వస్త్రం సహజసిద్ధ మెరుపు కోల్పోకుండా వేర్వేరు రంగులను అద్దే వీలుండడం వల్ల, మల్ కాటన్ చీరలను ఆకర్షణీయమైన ప్రింట్లలో తయారు చేస్తూ ఉంటారు. ప్రధానంగా చమటను పీల్చే గుణం కలిగి ఉండడం మూలంగా మల్ చీరలు వేసవిలో విపరీతంగా ఆదరణ పొందుతూ ఉంటాయి.

బగ్రు కాటన్

సహజసిద్ధ రంగులతో చేతి అద్దకంతో రూపొందే ఆకర్షణీయమైన బగ్రు చీరలకు రాజస్థాన్‌లోని బగ్రు ఎంతో ప్రసిద్ధి పొందింది. వందేళ్ల చరిత్ర కలిగిన బగ్రు అద్దకం కోసం డిజైన్లు చెక్కిన చెక్క బ్లాక్‌లను ఉపయోగిస్తారు. ఇండిగో, పసుపు మొదలైన సహజసిద్ధ రంగులతో రూపొందే బగ్రు చీరలు ఎక్కువ కాలం కూడా మన్నుతాయి.

మన్నిక ఇలా...

వేసవిలో ఎలాంటి కాటన్ చీరలను ఎంచుకున్నా, వాటి రంగులు వెలసిపోకుండా, నాణ్యత తగ్గిపోకుండా కాపాడుకోవడం కోసం ఈ చీరలను నీడలోనే ఆరబెట్టాలనే విషయం మర్చిపోకూడదు. అలాగే వాటిని ఉతికే విధానం కూడా సున్నితంగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే కాటన్ చీరలు ఎక్కువ కాలం మన్నుతాయి.



పిల్లలు అడిగిందల్లా ఇచ్చేస్తున్నారా?

పిల్లలు సాధారణంగా కంటికి ఆకర్షణీయంగా కనిపించిన ప్రతీదీ కావాలని అడుగుతూ ఉంటారు. ఇలా అడిగిందల్లా ఇవ్వడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. పిల్లల కోరికలు, వాటిని నెరవేర్చడం మధ్య తల్లిదండ్రులు ఎలా సమతూకం పాటించాలో తెలుసుకుందాం.

- పిల్లలు అడిగినవన్నీ తెచ్చి ఇస్తూవుంటే వాళ్లలో మొండితనం పెరుగుతుందని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి. అలాగని పిల్లలు ఏమి అడిగినా పట్టించుకోకపోతే వారిలో నిరాశ పెరుగుతుంది. పిల్లల వయసును దృష్టిలో ఉంచుకొని వారి అవసరాల మేరకు ఏది తప్పనిసరిగా కావాలో అడిగి తెలుసుకుని దాన్ని మాత్రమే తల్లిదండ్రులు కొనిస్తే సరిపోతుంది.



- పిల్లలకు ఏదోఒకటి కొనిచ్చి తాత్కాలికంగా సంతోషపెట్టే బదులు వాళ్లకి ఉపయోగపడేవాటిని మాత్రమే తల్లిదండ్రులు తేవడం మంచిది.
- ఖరీదైన బొమ్మలు, డిజిటల్ గేమ్స్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ లాంటివి పిల్లల సామర్థ్యాన్ని పెంచలేవు. వీటివల్ల పిల్లల్లో సృజనాత్మక శక్తి, సంభాషించే సామర్థ్యం, భాషా నైపుణ్యం, సందర్భాన్ని అర్థం చేసుకునే పరిణతి లాంటివి అలవడవు. పిల్లల శరీర బరువు పెరిగి వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం ఏర్పడవచ్చు. సాధ్యమైనంత వరకూ పిల్లలతో ఎక్కువగా మాట్లాడుతూ వారితో రకరకాల ఆటలు ఆడించడం మంచిది.
- స్నేహితుల దగ్గర ఉందనో, తన వద్ద ఉంటే గొప్పగా ఉంటుందనో ఇలా పలు రకాల కారణాలతో పిల్లలు ఏవేవో అడుగుతూ ఉంటారు. పిల్లలు ఏమి అడుగుతున్నారు? ఎందుకు అడుగుతున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు ఒక నిర్ణయానికి రావాలి. వీలైతే పిల్లలతో సవివరంగా మాట్లాడవచ్చు. సరైన కారణం దొరకని పక్షంలో పిల్లలకు నచ్చజెబుతూ వారి మనసు మళ్లించే ప్రయత్నం చేయాలి.
- పిల్లలు అడిగినవన్నీ ఇవ్వకుండా తల్లిదండ్రులు కొన్ని హద్దులు నిర్దేశించడం అలవాటు చేసుకోవాలి. పిల్లల మనసు నొచ్చుకుంటుందనీ, వాళ్లు ఏడుస్తున్నారనీ అడిగిన ప్రతీదాన్నీ తెచ్చి ఇచ్చే ప్రయత్నాలు చేయకూడదు. దీనివల్ల పిల్లల్లో మానసిక సమస్యలు ఏర్పడతాయి.
- పిల్లలు అడిగిన వస్తువును కొనకుండా అద్దెకు తీసుకు వచ్చే వీలుందా? ఎవరి దగ్గర నుంచైనా తీసుకునే అవకాశం ఉందా? సొంతంగా తయారు చేసుకునే వెసులుబాటు ఉందా? అనే అంశాలను తల్లిదండ్రులు పరిశీలించాలి. వీటి గురించి పిల్లలతో చర్చిస్తే వాళ్లలో ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.

పాత్రలపై మొండి మరకలను ఇలా తొలగించాలి..!

ప్రతిరోజూ వంట కోసం వాడే పాత్రలపై మొండి మరకలు ఏర్పడుతూ ఉంటాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగించిన తరవాతే ఆ పాత్రలను తిరిగి ఉపయోగించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వంట పాత్రలపై నిలిచే మరకలు, వాసనలను తేలికగా పోగొట్టే చిట్కాల గురించి తెలుసుకుందాం.

- రాత్రిపూట ఒక గిన్నెలో ఒక కప్పు వేడి నీళ్లు, రెండు చెంచాల డిష్ వాష్ లిక్విడ్ వేసి బాగా కలిపి ఉంచాలి. మరుసటి రోజు ఈ మిశ్రమంలో స్క్రబ్బర్ ముంచి దానితో పాత్రలను తోమి తరవాత నీటితో కడగాలి. దీంతో పాత్రల లోపలి భాగంలో ఏర్పడిన మరకలు, వండిన పదార్థాల వాసనలు తొలగిపోతాయి.



- ఒక గిన్నెలో నాలుగు చెంచాల బేకింగ్ సోడా వేసి దానికి రెండు చెంచాల నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. స్క్రబ్బర్‌తో ఈ పేస్టుని కొద్దిగా తీసుకుంటూ పాత్రలను తోమాలి. తరవాత నీటితో శుభ్రం చేస్తే మసి, జిడ్డు తొలగి పోయి పాత్రలు కొత్తవాటిలా మెరుస్తాయి.
- ఒక పళ్లెంలో మూడు చెంచాల రాళ్ల ఉప్పు తీసుకోవాలి. సగానికి కోసిన నిమ్మకాయ చెక్కతో ఈ ఉప్పుని అద్ది దానితో వంట పాత్రలను తోమి వేడినీళ్లతో శుభ్రం చేయాలి. దీంతో పాత్రలకు పట్టిన వాసనలు పూర్తిగా పోతాయి.
- పాత్రలు మాడిపోతూ ఉంటాయి. ఈ పాత్రల్లో సగం వరకూ నీళ్లు పోసి రెండు చెంచాల ఉప్పు, రెండు చెంచాల డిష్ వాషింగ్ లిక్విడ్, రెండు చెంచాల నిమ్మరసం వేసి స్టవ్ మీద పెట్టి వేడి చేయాలి. అయిదు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించి అరగంటసేపు నాననిచ్చి స్క్రబ్బర్‌తో రుద్దితే పాత్రల్లోని మాడు మరకలు పోతాయి.

సాయంకాలం నడక మంచిది!

వేసవికాలంలో సాయంత్రం పూట వాకింగ్‌కు వెళ్లడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

- సాయంత్రంపూట అహ్లాదకరమైన వాతావరణంలో నడవడం వల్ల మెదడులో సెరటోనిన్ అనే రసాయనం విడుదలవుతుంది. దీంతో రాత్రిపూట నిద్ర బాగా పడుతుంది.
- ఉదయం నుంచి సాయంత్ర వరకూ రకరకాల పనులతో శారీరకంగా అలసట, మానసికంగా ఒత్తిడి అధికంగా ఏర్పడతూ ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం కనీసం అరగంటసేపు నడిస్తే బడలిక తీరి మెదడు ఉత్సాహంగా పనిచేస్తుంది.
- సాయంత్రం వేళ వేగంగా నడవడం వల్ల శరీరానికి తగినంత ఆక్సిజన్ లభిస్తుంది. ఊపిరితిత్తులు, గుండె కండరాలు ఆరోగ్యంగా పనిచేస్తాయి. మానసిక ఉల్లాసం లభిస్తుంది.
- మధుమేహంతో బాధపడేవారు సాయంకాలం నడవడం అలవాటు చేసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయి నియంత్రణలో ఉంటుంది. రక్తపోటు సమస్య రాదు. శరీరంలోని కొవ్వులు తొందరగా కరుగుతాయి.
- సాయంకాలపు నడక వల్ల శరీరంలోని కండరాలు బలపడతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అతిగా తినాలనే కోరిక తగ్గి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జీవక్రియలు వేగవంతమవుతాయి. జీర్ణాశయ సమస్యలు తీరుతాయి. రాత్రి భోజనం తరవాత కొద్దిసేపు నడవడం వల్ల కడుపులో ఆమ్లత్వం, పొట్టలో ఉబ్బరం, అజీర్తి లాంటివి తగ్గుతాయి.



సంకల్పం

అభిరుచే ఆశయంగా

సంకల్ప బలం దేన్నయినా జయించగలదు... ఎంతటి లక్ష్యాన్నయినా... వైకల్యాన్ని అయినా! అందుకు నిలువెత్తు సాక్ష్యం సురభి బన్సాల్. ఊహ తెలిసినప్పటి నుంచీ చక్రాల కుర్చీలో నుంచే ప్రపంచాన్ని చూసినా... ఆ ప్రభావాన్ని తన జీవితం మీద పడనివ్వలేదు. ఉన్నత విద్యతో కార్పొరేట్ కొలువులు సంపాదించిన ఆమె... మోటివేషనల్ స్పీకర్‌గా, యూట్యూబర్‌గా తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకొంది. అన్నిటికీ మించి మించి... సవాళ్లెన్నిటినో అధిగమించి... నాట్యంతో అందరినీ మైమరిపిస్తోంది. ఎందరికో ప్రేరణనిస్తోంది.



"మన జీవితం మన చేతుల్లోనే ఉంటుందనేది నా నమ్మకం. అందుకే దాన్ని అందంగా, విజయవంతంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత కూడా మనదే. ముంబయిలోని సాధారణ మధ్యతరగతి కుటుంబం మాది. పుట్టుకతోనే సెరెబ్రల్ పాల్సీ (మెదడు పక్షవాతం) ఉందని వైద్యులు తేల్చారు. ఇది ఎదుగుదల మీద, మానసిక, శారీరక కదలికల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. ఊహ తెలిసినప్పటి నుంచీ చక్రాల కుర్చీలోనే నా ప్రయాణం. చుట్టుపక్కల పిల్లలతో కలిసి ఆడుకోవాలని, పరుగెత్తుతూ గంతులేస్తూ బాల్యాన్ని ఆస్వాదించాలని... నెరవేరవని తెలిసినా ఎన్నో కలలు. కాస్త పెద్దయ్యాక నా గురించి నాకు పూర్తి అవగాహన వచ్చింది. ఇక అప్పటి నుంచి బాధను పక్కకు నెట్టి... వైకల్యాన్ని మరిచి అడుగు ముందుకు వేశాను. నేను ఎవరికీ తక్కువ కాదని నాకు నేను ధైర్యం చెప్పుకొని, నాకంటూ ఒక కెరీర్‌ను నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నాను. ఎదురైన సవాళ్లను నా అభివృద్ధికి అవకాశాలుగా మలుచుకున్నాను. దృఢ సంకల్పంతో, అచంచలమైన స్ఫూర్తితో నన్ను నేను నిరూపించుకొనేందుకు పోరాటం మొదలుపెట్టాను.



టాప్ కంపెనీల్లో కొలువు...

నా ప్రతి అడుగులో మా అమ్మానాన్న అండగా నిలిచారు. ఏది కావాలంటే అది సమకూర్చారు. వారి ప్రోత్సాహంతోనే నేను పాఠశాలకు వెళ్లి చదువుకున్నాను. అందరితో పోటీపడి మంచి మార్కులు తెచ్చుకున్నాను. ఉన్నత చదువులు కొనసాగించగలిగాను. ముంబయి 'ఠాకూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అండ్ రీసెర్చ్' నుంచి 2006లో ఎంబీయే ఫైనాన్స్ పూర్తి చేశాను. వెంటనే 'జేపీ ఎంటర్‌ప్రైజెస్'లో ఎగ్జిక్యూటివ్‌గా చేరాను. అదే నా తొలి ఉద్యోగం. దాదాపు మూడేళ్లు అక్కడ పని చేశాక 'మెట్రోపాలిటన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా'లో అసిస్టెంట్ మేనేజర్‌గా అవకాశం లభించింది. ఏడేళ్లకు పైగా అక్కడి మెంబర్‌షిప్, ఇన్‌స్పెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తించాను. అందులో పని చేస్తుండగానే, 2016లో ప్రముఖ కంపెనీ 'మోర్గాన్ స్టాన్లే' నుంచి పిలుపు వచ్చింది.. మేనేజర్‌గా. మరో ఏడేళ్లు ఆ సంస్థలో గడిచిపోయాయి. టాప్ కంపెనీల్లో వివిధ విభాగాల్లో పని చేయడంవల్ల వ్యాపార, ఆర్థిక లావాదేవీల మీద పట్టు లభించింది.

ఎవరేమన్నా...

దాదాపు పద్దెనిమిదేళ్ల ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లు, సమస్యలు. నా సామర్థ్యాన్ని కాకుండా నా వైకల్యాన్ని చూసి కుంగదీసే మాటలు. ఎవరేమన్నా.. ఎంతటి అవమానాలు ఎదురైనా దృఢ చిత్తంతో అన్నిటినీ అధిగమించాను. ప్రతికూల పరిస్థితులను సైతం అనుకూలంగా మలుచుకున్నాను. ఉద్యోగంతోనే సరిపెట్టుకోకుండా నలుగురిలో నన్ను నేను భిన్నంగా నిలుపుకొనే ప్రయత్నం కూడా చేస్తూ వచ్చాను. అదే ఇవాళ నన్ను ఈ ప్రపంచానికి గొప్పగా పరిచయం చేయడానికి దోహదపడింది.

లక్ష్యం వైపు నడిపిస్తూ...

ఒక వైపు ఉద్యోగానికి వెళుతూనే ఖాళీ సమయాల్లో వివిధ సర్టిఫికెట్ కోర్సులు చేశాను. లైఫ్ కోచ్‌గా యువతను లక్ష్యం దిశగా నడిపించాను. మోటివేషన్ స్పీకర్‌గా తోటి మహిళల సాధికారతకు తోడ్పాటు అందిస్తున్నాను. మానసికంగా కుంగిపోయినవారికి మనోధైర్యం ఇస్తూ, కార్యోన్ముఖులను చేస్తున్నాను. నా అనుభవం, నాకున్న విజ్ఞానాన్ని పంచుతూ ఒక మార్గదర్శకురాలిగానే కాకుండా ఒక స్నేహితురాలిగా కూడా యువతరంలో స్ఫూర్తి నింపుతున్నాను.

నాట్యం నా అభిరుచి...

చిన్నప్పటి నుంచీ నాకు నాట్యం అంటే ఎంతో ఇష్టం. నర్తకిగా ప్రశంసలు పొందాలనేది నా బలమైన ఆకాంక్ష. నేను తిరిగేది చక్రాల కుర్చీలోనే. శారీరకంగా నా కదలికలకు కొన్ని పరిమితులున్నాయని తెలుసు. కానీ వాటిని దాటి అనుకున్నది సాధిస్తేనే కదా... మనమేంటో ప్రపంచానికి తెలిసేది. అందుకే నాకు అత్యంత ఇష్టమైన నాట్యం నేర్చుకోవాలని నిశ్చయించుకున్నాను. దాని కోసం నా ఉద్యోగం వదిలేశాను. పూర్తి సమయం కథక్ అభ్యాసానికి కేటాయించాను. కథక్‌లో తొలి అంకం పూర్తి చేశాను. 'భావ్ నృత్య' పరీక్షలో ఉత్తీర్ణత సాధించాను. నా శరీరం ఇప్పుడు లయబద్ధంగా కదులుతుంది. ఇదేకాకుండా బాలీవుడ్ పాటలకు కూడా నాదైన శైలిలో నాట్యం చేస్తున్నాను.

రికార్డులూ ఉన్నాయి...

నాట్యం నా అభిరుచి మాత్రమే కాదు... నా హృదయ స్పందన కూడా. నాలోని భావాలను పలికించే ఒక ప్రక్రియ. నాట్యానికి సరిహద్దులు లేవు. నా దృష్టిలో ఇది ఒకరిలో చైతన్యం రగిలించగలదు. కొన్ని రియాలిటీ షోస్‌లో, మరికొన్ని వేదికలపై ప్రదర్శనలు ఇచ్చాను. కళ పట్ల నాకున్న అంకితభావానికి గుర్తుగా 'హార్వార్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నా పేరు నమోదైంది. కొన్ని ప్రముఖ సంస్థల నుంచి అవార్డులు, అభినందనలు అందుకున్నాను. నాలాంటివారిలో, యువతరంలో స్ఫూర్తిని నింపే ఉద్దేశంతో యూట్యూబ్ చానల్ కూడా ప్రారంభించాను. నా డ్యాన్స్ వీడియోలను అందులో పోస్ట్ చేస్తున్నాను. 'మీ ప్రయాణం నాకు ప్రేరణ కలిగిస్తోంది' అంటూ కామెంట్లు చదివినప్పుడు నా మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది. గర్వంగానూ ఉంటుంది."

శరణార్థులకు ఆమె భరోసా

ఊహ తెలియకముందే శరణార్థిగా భారతదేశంలో అడుగుపెట్టారు జగదీశ్వరి శశిధరన్. అనేక ఆంక్షలు, పరిమితుల మధ్య తన కలను నెరవేర్చుకోవడానికి పోరాటం సాగించారు. ఇప్పుడు శ్రీలంక కాందిశీకుల పిల్లలకు మెరుగైన జీవితాలు కల్పించడానికి కృషి చేస్తున్నారు.

"మాతృభూమి స్వర్గం లాంటిదంటారు. కానీ నేను పుట్టిన దేశం అంతర్యుద్ధంతో ప్రత్యక్ష నరకంగా మారిపోయింది. దాంతో 'ఎక్కడో ఒక చోట బతికుంటే చాలు' అనుకుంటూ ఎన్నో కుటుంబాలు ప్రాణాలను అరచేత పట్టుకొని పరుగులు తీశాయి. అలాంటి కుటుంబాల్లో మాదీ ఒకటి. మా స్వస్థలం శ్రీలంకలోని మన్నార్ జిల్లా పేసాలై. మా నాన్న పేరు చిదంబరం, అమ్మ భువనేశ్వరి. వారికి అక్కడ సొంత ఇల్లు, స్థిరమైన జీవనోపాధి ఉండేవి. 1990ల్లో అంతర్యుద్ధం, ఘర్షణలతో శ్రీలంక అట్టుడికిపోయింది. తమిళ సంతతికి చెందిన వారి మీద దాడులు తీవ్రతరమయ్యాయి. దాంతో నా తల్లితండ్రులు అన్నీ వదిలేసి... కట్టుబట్టలతో ఒక నాటు పడవ మీద భారతదేశానికి శరణార్థులుగా వచ్చారు. వారి దగ్గర పాస్‌పోర్ట్ లాంటి పత్రాలేవీ లేవు. వారితో పాటు ఇదే విధంగా శ్రీలంకను కొన్ని వేలమంది విడిచిపెట్టారు. రామేశ్వరం చేరుకున్నప్పుడు... సినీ నటుడు విజయకాంత్ వారందరినీ పరామర్శించి, భోజన సౌకర్యం కల్పించినట్టు నా తల్లితండ్రులు గుర్తు చేసుకొనేవారు. ఆ తరువాత అధికారులు వారిని మదురైకి సమీపంలో ఉన్న 'అనైయూర్ శరణార్థ శిబిరాని'కి తరలించారు. అప్పటికి నా వయసు ఎనిమిది నెలలు. శ్రీలంకలో పరిస్థితులు చక్కబడిన తరువాత మళ్ళీ అక్కడికి వెళ్ళాలని అమ్మా నాన్నా అనుకున్నారు. కానీ ముప్ఫయ్యేళ్ళు దాటినా అది జరగలేదు.

సీటు ఇచ్చేది లేదన్నారు...

శరణార్థ శిబిరంలో తలదాచుకున్నవారికి ఎన్నో ఆంక్షలు, నిఘా ఉంటాయి. ఎక్కడికి వెళ్తున్నదీ నిర్వాహకులకు, అధికారులకు చెప్పాలి. నిర్ణీత సమయం లోపల తిరిగి శిబిరానికి చేరుకోవాలి. బతుకుతెరువు కోసం నా తల్లితండ్రులు భవన నిర్మాణ పనివారుగా మారారు. అప్పటి నుంచి మేము 'కేరాఫ్ అనైయూర్ రెఫ్యూజీ క్యాంప్'గా మిగిలిపోయాం. చిన్న వయసులో నాకు చాలా కలలుండేవి. బాగా చదువుకోవాలనీ, మంచి డ్యాన్సర్‌నీ, నటినీ కావాలనీ... ఇలా ఎన్నో. ఇరుకైన ఇళ్ళు, చాలీచాలని వసతుల మధ్య బతుకుతున్నా నా కలల్ని ఎప్పుడూ చంపుకోలేదు. వాటిని నెరవేర్చుకోవడం కోసం కష్టపడ్డాను. అయితే ఈ క్రమంలో... నేను కాందిశీక కుటుంబానికి చెందినదాన్ని కావడంతో చాలా ఇబ్బందులు పడ్డాను. మదురై ప్రభుత్వ సంగీత కళాశాలలో... నృత్యంలో డిప్లమా చేయడానికి దరఖాస్తు చేసుకున్నాను. సీటు కూడా వచ్చింది. కానీ కమ్యూనిటీ సర్టిఫికెట్ లేకపోవడంతో అడ్మిషన్ ఇవ్వలేమని నిర్వాహకులు చెప్పారు. ఏడుస్తూ బయటకు వెళ్తున్న నన్ను కాలేజీ ఫ్యాకల్టీ సభ్యురాలు తాంజై భవానీ మణి గమనించి పిలిచారు. "విద్యకు ఆంక్షలేమిటి?" అని కాలేజీవారిని నిలదీసి, నాకు సీటు ఇప్పించారు. ఆ తరువాత ఎన్నో ప్రదర్శనల్లో నా నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో... నాడు అభ్యంతరపెట్టినవారే "నువ్వు మా కాలేజీకి గర్వకారణం" అని మెచ్చుకున్నారు. చదువు పూర్తి కాగానే పలు సంస్థల్లో పార్ట్-టైమ్ లెక్చరర్‌గా పని చేశాను. మరోవైపు ప్రసిద్ధ తమిళ గాయని డాక్టర్ విజయలక్ష్మి నవనీత కృష్ణన్ బృందంలో పదహారేళ్ళుగా దేశంలోని పలుచోట్ల ప్రదర్శనలు ఇచ్చాను. విదేశాల్లో కూడా ఎన్నో అవకాశాలు, ఆహ్వానాలు వచ్చాయి. కానీ శరణార్థినైన నాకు పాస్‌పోర్ట్ లేకపోవడంతో వాటన్నిటినీ వదులుకోవాల్సి వచ్చింది. 2010లో సొంతంగా ఒక డ్యాన్స్ స్కూల్ ఏర్పాటు చేశాను. మరోవైపు వివిధ పాఠశాలల్లో డ్యాన్స్‌టీచర్‌గా ఉన్నాను. ఏడేళ్ళుగా పలువురు పిల్లలకు ఉచిత శిక్షణ అందిస్తున్నాను.



అదే మా కల...

భర్త, ఒక కుమారుడి బాధ్యతలు, నా ప్రదర్శనలు, బోధన... వీటన్నిటితో బిజీగా ఉన్న నాకు కొవిడ్ సమయం కావలసినంత తీరిక కల్పించింది. అప్పటివరకూ మా శరణార్థ శిబిరంలోని పిల్లలకు తరచుగా వివిధ రూపాల్లో సాయం చేస్తున్నా... పూర్తి స్థాయి ప్రణాళికతో ముందుకి సాగే అవకాశాన్ని అది కలిగించింది. వారిలో చాలామందికి ఎదగాలనే ఆశ ఉన్నా కాందిశీకులనే ముద్ర వెంటాడుతూనే ఉంది. శరణార్థులను అక్రమ చొరబాటుదారులుగా చూసే ధోరణి కూడా ఎక్కువ కావడంతో... సమాజంలో అవమానాలను, అసమానతలను ఎదుర్కోవాల్సి వస్తోంది. చక్కగా చదువుకోడానికి అవకాశం కల్పిస్తే వారిలో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. అందుకే నా ప్రదర్శనల ద్వారా వచ్చే డబ్బు, కొందరు స్పాన్సర్ల సహకారంతో... ప్రతిభ, ఆసక్తి ఉన్న పిల్లల చదువుకు సాయం చెయ్యడం ప్రారంభించాను. మొదట ఒకరు, తరువాత మరొకరు... ఇలా అనైయూర్ క్యాంప్ నుంచి 15 మందికి పైగా పిల్లలు ఉన్నత చదువుల్ని పూర్తి చేసి, ఉద్యోగాలు సంపాదించుకున్నారు. వారిలో ఒకరు సివిల్ ఇంజనీర్. ఒక అమ్మాయి అగ్రికల్చర్ బీఎస్సీ ఫైనలియర్‌లో చదువుతోంది. మరికొందరు పిల్లలు కూడా సాయం పొందుతున్నారు. ఒక బాలుడికి బోన్ మారో మార్పిడి అవసరం అయింది. నా అభ్యర్థన మేరకు మాజీ ఐఎఎస్ ఒకరు ముందుకొచ్చి, ఆ ఖర్చు భరించారు. ఆ ఆపరేషన్ విజయవంతమైంది. ఆ రోజు నేను పొందిన ఆనందాన్ని నా జీవితంలో ఎన్నడూ అనుభూతి చెందలేదు. ఇక, కొందరు వితంతువులకు కుట్టు మిషన్లు సమకూర్చి వారి జీవనోపాధికి దోహదం చేశాను. అలాగే... ఇతర అవసరాల్లో ఉన్నవారిని కూడా ఆదుకోవడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. వీలున్నంతవరకూ దీన్ని కొనసాగిస్తాను. ఎప్పుడో ఈ దేశానికి కాందిశీకులుగా వచ్చాం. మాకు భద్రతతో సహా ప్రతిదీ ఈ దేశం ఇచ్చింది. అందుకే భారతీయ పౌరులుగా మరణించాలనేది మా కల. పరిస్థితులు క్రమంగా మారి, నా కుమారుడితో సహా తరువాతి తరం పిల్లలకైనా భారతీయ పౌరసత్వం లభించాలని, శరణార్థి శిబిరాల్లో కాకుండా హుందాతనంతో గౌరవంగా జీవించే అవకాశం దక్కాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నాను."

జన్వాడ ఫాంహౌస్‌పై డ్రోన్ కేసులో
కౌంటర్ దాఖలు చేయండి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

» రేవంత్‌రెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు జన్వాడ ఫాంహౌస్‌పై డ్రోన్ ఎగురవేసిన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. డ్రోన్ ఎగురవేతకు సంబంధించి రంగారెడ్డి జిల్లా కోర్టులో ఉన్న కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి 2020లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాజాగా మంగళవారం జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై పెట్టిన సెక్షన్లకు జరిగిన నేరానికి సంబంధం లేదని తెలిపారు. ఏడేళ్లలోపు శిక్షపడే నేరాలకు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా పోలీసులు అత్యుత్సాహంతో రేవంత్‌ను 18రోజులు జైల్లో పెట్టారని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావుకు ఆదేశాలు జారీచేసింది. పోలీసులు రికార్డు చేసిన ఐదుగురు సాక్షుల వాంగ్మూలాలు, జన్వాడ ఫాంహౌస్ నిషేధిత ప్రాంతంలో లేదని నిరూపించేలా జీవో నెంబర్ 92ను సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఈనెల 19కి వాయిదా పడింది.

రఘునందన్‌రావుపై ఎన్నికల కేసు కొట్టివేత

నాగార్జునసాగర్ నియోజకవర్గ ఉపఎన్నిక సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పేర్కొంటూ ప్రస్తుత బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుపై నమోదైన కేసును హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. ముందస్తు అనుమతి లేకుండా నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో రఘునందన్‌రావు కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. అందుకు ఆధారాలు చూపకపోవడంతో కేసు కొట్టివేసింది.

హైకోర్టులో ఈటల క్వాష్ పిటిషన్

హుజూరాబాద్ ఉపఎన్నిక సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పేర్కొంటూ నమోదైన కేసును కొట్టివేయాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ముందస్తు అనుమతి లేకుండా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో కార్యకర్తల ఇంటికి వెళ్లారని తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఈటల పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని హైకోర్టు పోలీసులకు నోటీసులు పంపించింది.

ఎ.జీవన్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై తీర్పు వాయిదా

ఓ భూఆక్రమణ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. భూకబ్జా చేయడంతోపాటు ఫాంహౌస్ కూల్చివేశారని, అడ్డుపడిన వ్యక్తులపై దాడిచేశారని పేర్కొంటూ మోకిల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వాలని జీవన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది.

ఐపీఎస్ అభిషేక్ మహంతికి దక్కని ఊరట

» ఏపీకి వెళ్లాలన్న ఉత్తర్వులపై స్టే ఇవ్వని క్యాట్

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతికి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)లో మంగళవారం ఎలాంటి ఊరట లభించలేదు. ఆయన తెలంగాణ నుంచి ఏపీ క్యాడర్‌కు వెళ్లిపోవాలంటూ డీవోపీటీ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే మంజూరు చేసేందుకు క్యాట్ నిరాకరించింది. తనను ఏపీకి పంపడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

నిషేధిత భూమికి రెక్కలు!

(మొదటిపేజీ తరువాయి)

మంజూరు చేస్తూ.. వాటిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కోట్లాది రూపాయలు విడుదల చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ నగర శివార్లలోనూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో భారీ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్కు పేరుతో కొందరు కంపెనీ ఏర్పాటు చేసి పనులు మొదలుపెట్టారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని చేగూరు గ్రామంలో 141.24 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో కొంత ప్రభుత్వ భూమితోపాటు ప్రైవేటు భూముటూ ఉన్నాయి. కాగా, మొత్తం రూ.106 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న టెక్స్‌టైల్ పార్కు కోసం కేంద్రం రూ.40 కోట్ల గ్రాంట్ ఇస్తామని ప్రకటించింది. రూ.100 కోట్ల టర్మ్ లోన్ కూడా ఇస్తామని పేర్కొంది. 12 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేయాలని సూచించింది. అయితే ఈ పార్కుపై పెత్తనం చేసేందుకు అప్పట్లోనే కొందరు భారీ స్కెచ్ వేశారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పడిన హైటెక్ టెక్స్‌టైల్ పార్కును కొద్ది రోజుల తరువాత నిబంధనలకు విరుద్ధంగా హైటెక్ టెక్స్‌టైల్ పార్కు ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చేశారు.

కేంద్రానికే కుచ్చుటోపీ..

హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్కు కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు మాయమయ్యాయి. 2008 డిసెంబరులో ప్రాజెక్టును సమీక్షించిన కేంద్రం.. నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.58 కోట్లకు సవరించింది. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో తన వాటా కింద రూ.23.20 కోట్లు ఇస్తానని పేర్కొంది. దీని ప్రకారం సగం కంటే ఎక్కువగా రూ.12 కోట్ల గ్రాంట్‌ను అప్పటికే మంజూరు చేసింది. 2006 అక్టోబరు 3న తొలివిడతగా రూ.4 కోట్లు, 2008 ఫిబ్రవరి 18న రెండో విడతగా మరో రూ.8 కోట్లు మంజూరు చేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.1.10 కోట్లు మంజూరు చేసింది. అయితే లెక్కలు సక్రమంగా చూపకపోవడం, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటులో పురోగతి లేకపోవడంతో కేంద్రం తదుపరి నిధులు నిలిపివేసింది. చివరకు ప్రాజెక్టును రద్దు చేసింది. తాము ఇచ్చిన మొత్తం సొమ్మును చెల్లించాలంటూ టెక్స్‌టైల్ పార్క్ ఛైర్మన్‌కు 2011 ఆగస్టు 11న కేంద్రం లేఖ రాసింది. దీనికీ స్పందన లేకపోవడంతో ఈ ప్రాజెక్టు కోసం విడుదల చేసిన రూ.12 కోట్లు చెల్లించే వరకు సేకరించిన భూముల క్రయవిక్రయాలు నిలిపివేయాలని కొత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ లేఖ రాసింది. దీంతో ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. ఇదిలా ఉండగా.. టెక్స్‌టైల్ పార్కును అభివృద్ధి చేయడానికంటూ రెండు జాతీయ బ్యాంకుల నుంచి సుమారు రూ.70 కోట్ల



టెక్స్‌టైల్ పార్కు కోసం నిర్మించిన షెడ్లు

రుణం తీసుకున్నట్లు తెలిసింది. కానీ, ఆ రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో సదరు బ్యాంకు అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు నేషనల్ కన్స్యూమర్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. కేసు ఇప్పటికీ నడుస్తున్నట్లు సమాచారం.

ఖాళీ భూములపై పెద్దల కన్ను..

టెక్స్‌టైల్ పార్కు కోసం సేకరించిన భూములు ఖాళీగా ఉండడంతో.. గత ప్రభుత్వ హయాంలో కొందరు పెద్దల కన్ను వాటిపై పడింది. 22ఏ కింద నిషేధిత జాబితాలోపెట్టిన ఈ భూములను దశలవారీగా తొలగించేందుకు పన్నాగం పన్నారు. ధరణి రాగానే ఈ భూములకు రెక్కలొచ్చాయి. టెక్స్‌టైల్ పార్కు పేరుమీద ఉండాల్సిన మొత్తం 141.24 ఎకరాల భూముల్లో 19.31 ఎకరాల భూమి ప్రస్తుతం నిషేధిత జాబితాలో లేకుండాపోయింది. ఈ భూములపై కన్నేసిన పెద్దలే తెరవెనుక తతంగం నడిపినట్లు తెలుస్తోంది. హైటెక్ టెక్స్‌టైల్ పార్కుతో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్న వ్యక్తులు ఇందులో సూత్రధారులుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అప్పటి ప్రభుత్వంలో బడానేత కుటుంబసభ్యురాలు దీని వెనుక ఉండి కథ నడిపారని అంటున్నారు. ఆమె ఆడపడుచు భర్త ఇందులో 38 ఎకరాలు కొనుగోలు చేసేందుకు గతంలో భూములు అమ్మిన రైతులతోపాటు టెక్స్‌టైల్ పార్కులో ఉన్న పెద్దల నుంచి ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకనుగుణంగానే కొన్ని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు చెబుతున్నారు. ఎకరా రూ.4 కోట్ల విలువ చేసే ఈ భూములను.. బినామీల పేరుతో ఎకరా రూ.75 లక్షల నుంచి కోటి రూపాయలకు కొనుగోలు చేసేందుకు ప్రైవేటుగా ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం మారడంతో వారి ప్రయత్నాలకు బ్రేక్ పడింది. దీంతో ప్రస్తుతం ప్రభుత్వంలో కూడా కొందరిని కలుపుకొని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి మధ్యవర్తిగా పనిచేసిన ఓ ప్రజాప్రతినిధి ఇటీవలే అధికార కాంగ్రెస్‌లో చేరిపోయారు. మిగతా భూమి కోసం ఆయన ద్వారా స్కెచ్ వేస్తున్నట్లు సమాచారం.

భూములుంటే దర్జాగా బతికేటోళ్లం

ఉపాధి కల్పిస్తామంటూ రైతుల నుంచి భూములు లాక్కున్నారు. 20 ఏళ్లు గడుస్తున్నా నేటికి ఒక్క వస్త్ర పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు వస్తాయనే ఆలోచనతోనే భూములను ప్రభుత్వానికి ఇచ్చాం. అవే భూములు ఉంటే ఈ రోజు ఎకరా రూ.3-4 కోట్ల వరకు ధర పలుకుతుంది. ఎకరం భూమి అమ్మినా నేడు రైతులు దర్జాగా బతికేవాళ్లు. ఇప్పటికే ఈ భూములపై పెద్దల కన్ను పడింది. వారి నుంచి భూములకు రక్షణ కల్పించాలి.

\- మల్లేశ్, నర్సప్పగూడ

25 ఎకరాలు తీసుకున్నారు

మా వద్ద నుంచి ప్రభుత్వం 25 ఎకరాలు స్వాధీనం చేసుకుంది. కానీ, నేటి వరకు కూడా చిన్న పరిశ్రమను ఏర్పాటు చేయలేదు. అభివృద్ధి పేరిట రైతుల కడుపులు కొట్టి భూములను లాక్కొని వాటిని పడావుగా ఉంచడం ఎంతవరకు సమంజసం? ఉపాధి అన్నారు, ఉద్యోగాలన్నారు.. ఏదీ లేదు. ఆ భూములే ఇప్పుడు మా చేతుల్లో ఉంటే మేం కూడా ఆర్థికంగా ఎదిగేవాళ్లం. అందుకే మా భూములను మాకు అప్పగించాలని కోరుతూ హైకోర్టులో కేసు వేశాం. తీర్పు కోసం ఎదురు చూస్తున్నాం.

\- దరూర్ సతీశ్ పటేల్, రైతు, చేగూరు

ఆ శిక్షణ సర్టిఫికెట్లకు 20 ఏళ్లు..!

చేగూరులో టెక్స్‌టైల్ పార్కు కోసం భూసేకరణ సమయంలో ఎకరానికి రూ.3 లక్షలు చెల్లించడమే కాకుండా.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇదిన మ్మిన రైతులు సర్వే నంబరు 423 నుంచి 440 వరకు ఉండే 142 ఎకరాల భూమిని అప్పగించారు. భూములు కోల్పోయిన వారికి కొంత పరిహారంతోపాటు ఈ పార్కులో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్థానికులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. కేంద్ర పవర్ లూమ్ సర్వీస్ సెంటర్ ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశారు. కానీ, శిక్షణ పొంది 20 ఏండ్లు గడుస్తున్నా పరిశ్రమ జాడే లేదు.

గద్దర్ అవార్డులకు ఎంట్రీల ఆహ్వానం



హైదరాబాద్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ పేరిట ఏర్పాటు చేసిన తెలంగాణ చలన చిత్ర అవార్డులకు సంబంధించి విధివిధానాలు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవార్డుల దరఖాస్తులు ఏసీగార్డ్స్‌లోని తెలంగాణ చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయంలో గురువారం నుంచి అందుబాటులో ఉంటాయి. ఫీచర్ ఫిల్మ్, జాతీయ సమైక్యతపై చలన చిత్రం, బాలల చలన చిత్రం. పర్యావరణం/వారసత్వ సంపద/చరిత్రపై చలన చిత్రం, యానిమేషన్ ఫిలిం, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీ ఫిల్మ్, లఘుచిత్రం క్యాటగిరిలతోపాటు తెలుగు సినిమాలపై వెలువడిన పుస్తకాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు, ఆర్టిస్టులు/టెక్నీషియన్లను వ్యక్తిగతంగా గద్దర్ అవార్డులకు ఎంపిక చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఖరారు చేస్తూ.. ఉత్తర్వులు(జీవో 25) జారీ చేసిన విషయం తెలిసిందే.! తెలంగాణ సినిమా రంగానికి విశేష సేవలందించిన పైడి జయరాజ్, కాంతారావు పేర్లపై ప్రత్యేక అవార్డులు కూడా ఇవ్వాలని, ఇప్పటికే ప్రముఖ నటుడు ఎం.ప్రభాకర్ రెడ్డి పేరిట ఉన్న అవార్డును కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2014 నుంచి 2023 వరకు.. అప్పటి బీఆర్ఎస్ సర్కారు చలన చిత్ర అవార్డులను జారీ చేయకపోవడంతో, ఆ సంవత్సరాలకు సంబంధించి ఒక్కో ఉత్తమ చిత్రానికి అవార్డులివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఫీచర్‌ఫిలిం క్యాటగిరిలో తొలిసారిగా ఉర్దూ భాషా చిత్రాలకు కూడా స్థానం కల్పించింది.

ఆ 5 రైళ్లు సికింద్రాబాద్‌కు రావు!

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు ముమ్మరం కావడంతో స్టేషన్‌కు వచ్చే 14 ముఖ్యమైన రైళ్ల రూటు మార్చేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. మొదటి దశలో భాగంగా 5 రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. ఆదిలాబాద్-తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈనెల 26 నుంచి చర్లపల్లి, బొల్లారం, దయానంద్‌నగర్ స్టేషన్ల మీదుగా నడుస్తుందని పేర్కొంది. లింగంపల్లి- కాకినాడ స్పెషల్ ఏప్రిల్ 2 నుంచి, కాజీపేట- హడాస్పర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 22 నుంచి, లింగంపల్లి- విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి సికింద్రాబాద్‌కు రాకుండానే వయా చర్లపల్లి, అమ్ముగూడ, సనత్‌నగర్ స్టేషన్ల మీదుగా నడుస్తాయని సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. మరోవైపు సికింద్రాబాద్- కర్నూలు సిటీ మధ్య నడిచే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 10న కాచిగూడ టెర్మినల్ నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు.

చిత్రజ్యోతి
SINCE 1965

ప్రేక్షక హృదయాలను కొల్లగొడుతుంది



కిరణ్ అబ్బవరం

'క' సినిమాతో సూపర్‌హిట్ అందుకున్నారు కిరణ్ అబ్బవరం. ఆయన నటించిన తాజా చిత్రం 'దిల్‌రుబా'. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్‌రెడ్డి... సారెగమ సంస్థతో కలసి నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ మీడియాతో ముచ్చటించారు. "ఇందులో సిద్ధు అనే పాత్రలో కనిపిస్తా. నా పాత్రను విశ్వకరుణ్ చాలా కొత్తగా తీర్చిదిద్దారు. ఇదో న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొడుతుంది. మహిళలను గౌరవించాలనే సందేశం అంతర్లీనంగా ఉంటుంది. దర్శకుడు సినిమాను నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ఎక్కడా బోర్ కొట్టదు. విజయంపై టీమ్ అంతా నమ్మకంతో ఉంది. మంచి సినిమా చూశామనే సంతృప్తితో ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వస్తారు. సినిమాలో సిద్ధు ఏ సందర్భంలోనూ 'సారీ', 'థ్యాంక్స్' చెప్పడు. దానికి కారణం ఏమిటనేది ఆసక్తికరంగా ఉంటుంది. లవ్ ట్రాక్, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు.

రెండింతల వినోదం

నితిన్

'రాబిన్‌హుడ్ సినిమాలో దర్శకుడిగా వెంకీ కుడుముల విశ్వరూపం చూడబోతున్నాం. గతంలో మా ఇద్దరి కలయికలో వచ్చిన 'భీష్మ' చిత్రం కన్నా 'రాబిన్‌హుడ్'లో రెండింతల వినోదం ఉంది. పతాక సన్నివేశాలను చూసి ప్రేక్షకులు 'వావ్' అంటారు. ఈ చిత్రంతో మైత్రీ సంస్థ మరో విజయాన్ని అందుకోబోతోంది' అని హీరో నితిన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం మీడియా సమావేశం నిర్వహించింది. వెంకీ కుడుముల మాట్లాడుతూ "రాబిన్‌హుడ్‌తో బ్లాక్‌బస్టర్ కొట్టబోతున్నాం అనే నమ్మకం ఉంది. అతిథి పాత్రలో నటించిన డేవిడ్ వార్నర్‌కు ధన్యవాదాలు. మా నిర్మాతలు నవీన్, రవి ఖర్చుకు వెనకాడకుండా నిర్మించారు' అని చెప్పారు. వెంకీ గారి నుంచి ప్రేక్షకులు ఆశించే వినోదం ఈ చిత్రంలో ఉంది అని శ్రీలీల అన్నారు. అన్ని వాణిజ్య హంగులతో పాటు మంచి కథ ఉన్న చిత్రమిది అని నిర్మాత వై. రవిశంకర్ తెలిపారు.





ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు, నటుడు మంచు మోహన్‌బాబు, ఆయన తనయుడు... మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు.

వందేళ్ల నాటి భవనానికి ఆధునిక హంగులు



సీనియర్ నటుడు, నిర్మాత, మాజీ ఎంపీ మురళీమోహన్ స్వగ్రామంలో గృహ ప్రవేశం చేశారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఆయన తాతగారు 1925లో నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఇటీవల చాటపర్రు వచ్చిన మురళీమోహన్, తాతల నాటి ఇంటి జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో పునర్‌నిర్మాణం చేపట్టారు. పాత భవనం రూపురేఖలను మార్చకుండా.. మరో 50 ఏళ్ళు చెక్కు చెదరకుండా ఉండేలా కోట్లు వెచ్చించి కొత్త భవనాన్ని నిర్మించారు. కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు మాజీ ఎంపీ మాగంటిబాబు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

దృశ్యకావ్యంలా షణ్ముఖ



ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా తెరకెక్కిన చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తూ, తులసీరామ్ సాప్పని, రమేశ్ యాదవ్‌తో కలసి నిర్మించారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆది సాయికుమార్ మాట్లాడుతూ "ఆసక్తికరమైన కథతో తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని చెప్పారు. "ఇందులో శక్తిమంతమైన పోలీస్ పాత్రలో ఆది కనిపిస్తాడు. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని కొత్త పాయింట్‌తో దృశ్యకావ్యంలా ఈ సినిమా ఉంటుంది" అని దర్శక నిర్మాత షణ్ముగం సాప్పని అన్నారు.

వెలుగు నింపే దీపం అవ్వాలి



వినోద్ నువ్వుల, మధుప్రియ జంటగా నటించిన చిత్రం 'ల్యాంప్'. ఈ నెల 14న విడుదలవుతోంది. రాజశేఖర్ రాజ్ దర్శకత్వంలో జీవీఎస్ శేఖర్‌రెడ్డి నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సీనియర్ నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ 'ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో చిన్న చిత్రాలకు ఆదరణ లేక చీకటి అలుముకుంది. ఈ 'ల్యాంప్' ఆ చీకట్లు పోగొట్టి వెలుగు నింపే దీపం అవ్వాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్ర నిర్మాణంలో ఎన్నో కష్టాలు పడ్డామనీ, ఈ దీపం ఆరిపోయే పరిస్థితులు ఏర్పడినా జాగ్రత్తగా కాపాడుకుని రిలీజ్ వరకూ తీసుకువచ్చామని దర్శకుడు రాజశేఖర్ చెప్పారు. ఓ మంచి ప్రయత్నంగా 'ల్యాంప్' పేరు తెచ్చుకుంటుందనీ, కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో సినిమాను విడుదల చేస్తున్నామనీ నిర్మాత జీవీఎస్ రెడ్డి చెప్పారు.

యుగళ గీతం



తమిళ నటుడు చియాన్ విక్రమ్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'వీర ధీర సూరన్ పార్ట్ 2'. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మించారు. ఎస్‌జే సూర్య, దుషార విజయన్ కీలక పాత్రలు పోషించారు. తాజాగా, ఈ చిత్రం నుంచి 'కలల్లో కానరాకున్నా.. నీకోసం నేను వేచి ఉన్నా' అంటూ సాగే యుగళ గీతాన్ని విడుదల చేశారు మేకర్స్. రాజేశ్ గోపిశెట్టి లిరిక్స్ అందించగా, శరత్ సంతోష్, రేష్మ, శ్యామ్ ఆలపించారు. జివి ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది.

దర్శకుడు శంకర్‌కు ఊరట

● ఈడీ దర్యాప్తుకు హైకోర్టు బ్రేక్



తమిళ దర్శకుడు ఎస్.శంకర్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు చెందిన రూ.10.11 కోట్ల విలువ చేసే ఆస్తులను జప్తు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు మంగళవారం తాత్కాలిక స్టే విధించింది. శంకర్ దర్శకత్వంలో 'యందిరన్' చిత్రం రాగా, ఈ మూవీ వ్యవహారంలో శంకర్ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ ఈ సినిమా కోసం తీసుకున్న పారితోషికం ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. అయితే, ఈడీ చర్యను సవాల్ చేస్తూ శంకర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన ధర్మాసనం... శంకర్ ఆస్తులను జప్తు చేస్తూ ఈడీ జారీ చేసిన ఆదేశాలపై తాత్కాలిక స్టే విధించింది. ఈ వ్యవహారంలో ఈడీ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 21వ తేదీకి వాయిదా వేసింది.

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి)

సాయికుమార్‌కు కొమరం భీమ్ జాతీయ పురస్కారం



నటుడిగా యాభై ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న సాయికుమార్‌కు 2024 సంవత్సరానికి గాను కొమరం భీమ్ జాతీయ పురస్కారం అందజేయనున్నట్లు సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ సి.పార్థసారథి, కో ఛైర్మన్ నాగబాల సురేశ్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. పన్నెండేళ్లుగా భారత కల్చరల్ అకాడమి, ఆదివాసి సాంస్కృతిక పరిషత్ సంయుక్త నిర్వహణలో ఈ అవార్డ్‌ను అందచేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 23న కొమరం భీమ్ జిల్లా ఆసిఫాబాద్‌లో జరిగే కార్యక్రమంలో సాయికుమార్‌కు అవార్డ్ అందజేస్తామని తెలియజేశారు.



భారత్‌లో స్టార్‌లింక్ సేవలు..

● ఎయిర్‌టెల్‌తో స్పేస్‌ఎక్స్ జట్టు ● రిలయన్స్ జియోకు గట్టి పోటీ!!



న్యూఢిల్లీ: భారత్‌లోని తన కస్టమర్లకు స్టార్‌లింక్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించేందుకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు దేశీయ ప్రైవేట్ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ మంగళవారం ప్రకటించింది. అయితే, భారత్‌లో స్టార్‌లింక్ సేవలందించేందుకు స్పేస్‌ఎక్స్ లైసెన్సు పొందడంపై ఈ ఒప్పందం ఆధాపడి ఉంటుందని ఎయిర్‌టెల్ స్పష్టం చేసింది. స్టార్‌లింక్ సేవలకు అవసరమైన లైసెన్సు దరఖాస్తును భారత ప్రభుత్వం ఇంకా సమీక్షిస్తోంది. స్టార్‌లింక్ మాతృసంస్థ స్పేస్‌ఎక్స్. ప్రధాని మోదీ గత నెలలో అమెరికాలో పర్యటించిన సందర్భంగా మస్క్‌తోనూ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా స్పేస్, మొబిలిటీ, టెక్నాలజీ, ఆవిష్కరణలు తదితర అంశాలపై చర్చించారు. తర్వాత కొద్ది వారాలకే మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా, స్పేస్‌ఎక్స్ భారత్‌లోకి ప్రవేశించేందుకు వేగంగా పావులు కదుపుతుండటం గమనార్హం.

నీకు నేను.. నాకు నువ్వు

ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇరు సంస్థలు కలిసి స్టార్‌లింక్ సేవలు ఎయిర్‌టెల్ సర్వీసులకు ఏ విధంగా తోడ్పడతాయి..? భారత్‌లో స్పేస్‌ఎక్స్ నేరుగా సేవలందించేందుకు ఎయిర్‌టెల్ అనుభవం ఏ విధంగా దోహదపడుతుందని పరిశీలించనున్నాయి. భారత్‌లోని ఎయిర్‌టెల్ కస్టమర్లకు స్టార్‌లింక్ సేవలందించేందుకు స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేయడం కీలక మైలురాయి అని, భవిష్యత్ తరం శాటిలైట్ సేవలందించే విషయంలో కంపెనీ నిబద్ధతకు ఇది నిదర్శనమని భారతీ ఎయిర్‌టెల్ ఎండీ, వైస్ చైర్మన్ గోపాల్ విఠల్ అన్నారు. దేశంలోని ప్రస్తుతం ఇంటర్నెట్ సౌకర్యం లేని అత్యంత మారుమూల ప్రాంతాల్లోనూ తమ కంపెనీ గరిష్ఠ వేగంతో కూడిన ఇంటర్నెట్ సేవలందించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడనుందన్నారు.

పరస్పర ప్రయోజనాలపై పరిశీలన

ఈ ఒప్పందంలో భాగంగా స్పేస్‌ఎక్స్. ఎయిర్‌టెల్ ద్వారా స్టార్‌లింక్ డివైజ్‌లతో పాటు సేవలను ఆఫర్ చేయనుంది. అలాగే, బిజినెస్ కస్టమర్లు, కమ్యూనిటీ సెంటర్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు తదితర వర్గాలతో అనుసంధానమయ్యే అవకాశాలను సైతం అన్వేషించనుంది. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను మరింత మెరుగుపర్చడంతోపాటు విస్తరించేందుకు స్టార్‌లింక్ ఏ విధంగా సాయపడగలదని ఇరు సంస్థలు అన్వేషించనున్నాయి.

జియో వర్సెస్ స్టార్‌లింక్

శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను వేలం వేయాలని భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో డిమాండ్ చేయగా.. స్టార్‌లింక్ సహా ఇతర అంతర్జాతీయ సంస్థలు నేరుగా కేటాయింపులు జరపాలని కోరాయి. కాగా, కేంద్రం మస్క్ కంపెనీకే సానుకూలంగా ప్రకటన చేసింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం అనుసరిస్తున్న విధానానికి అనుగుణంగా శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను నిర్దిష్ట ధరకు నేరుగా కేటాయించడం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజా భాగస్వామ్యం ద్వారా స్టార్‌లింక్, ఎయిర్‌టెల్ కలిసి రిలయన్స్ జియోకు గట్టిపోటీనిచ్చేందుకు సిద్ధమవుతున్నట్లుగా కన్పిస్తున్నది. ఎయిర్‌టెల్, స్పేస్‌ఎక్స్ కలిసి చవకగా సేవలను ఆఫర్ చేయడం ద్వారా బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో జియో మార్కెట్ వాటాను కొల్లగొట్టేందుకు అవకాశాలున్నాయి.

ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా సంతకంతో కొత్త రూ.100, 200 నోట్ల జారీ

ముంబై: ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కూడిన రూ.100, 200 కరెన్సీ నోట్లు త్వరలో మార్కెట్లోకి విడుదల కానున్నాయి. కొత్త నోట్ల డిజైన్ ఇప్పటికే మార్కెట్లో అందుబాటులో ఉన్న మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లోని రూ.100, 200 నోట్లను అన్ని విధాలుగా పోలి ఉంటాయని ఆర్‌బీఐ మంగళవారం వెల్లడించింది. అంతేకాదు, ప్రస్తుతం మార్కెట్లో చలామణి అవుతున్న రూ.100, 200 నోట్లు యధావిధిగా చెల్లుబాటవుతాయని స్పష్టం చేసింది.

క్రీమ్‌లైన్ డెయిరీలో పూర్తి వాటా

గోద్రెజ్ ఆగ్రోవెట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గోద్రెజ్ ఆగ్రోవెట్ డెయిరీ రంగంలో పట్టు పెంచుకుంటోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే క్రీమ్‌లైన్ డెయిరీ ఈక్విటీలో మిగిలిన 48.06 శాతం వాటాను ప్రమోటర్ల నంచి రూ.930 కోట్లకు కొనుగోలు చేసినట్టు తెలిపింది. ఈ డెయిరీ ఈక్విటీలో గోద్రెజ్ ఆగ్రోవెట్‌కు ఇప్పటికే 51.9 శాతం వాటా ఉంది. తాజా వాటా కొనుగోలుతో క్రీమ్‌లైన్ డెయిరీ ఈక్విటీలో 100 శాతం వాటా గోద్రెజ్ ఆగ్రోవెట్ పరమైంది. ఈ ఏడాది సెప్టెంబరుకల్లా ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది.

యూపీఐ, రూపే కార్డు లావాదేవీలు ప్రియమవుతాయా?

మర్చంట్ చార్జీలను పునఃప్రవేశపెట్టే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), రూపే డెబిట్ కార్డు ద్వారా జరిపే లావాదేవీలపై మర్చంట్ చార్జీల (మర్చంట్ డిస్కౌంట్ రేట్-ఎండీఆర్)ను పునఃప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని సమాచారం. ప్రస్తుతం యూపీఐ, రూపే కార్డు లావాదేవీల ప్రాసెసింగ్‌పై బ్యాంకులకు మర్చంట్లు ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, చిన్న వ్యాపారులకు మర్చంట్ చార్జీల మినహాయింపును కొనసాగించినప్పటికీ, వార్షిక జీఎస్‌టీ టర్నోవర్ రూ.40 లక్షలకు మించిన వ్యాపారుల నుంచి ఎండీఆర్ వసూలు చేయాలని బ్యాంకింగ్ రంగం ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. ఎండీఆర్ చార్జీలను శ్రేణుల వారీగా ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. అంటే, బడా మర్చంట్ల నుంచి అధిక చార్జీ, చిన్న విక్రేతల నుంచి అత్యల్ప రుసుము వసూలు చేస్తే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

వినియోగదారులపై భారం పడుతుందా..?

ఎండీఆర్ విక్రేతల నుంచి బ్యాంకులు వసూలు చేసే రుసుము. అది కూడా బడా మర్చంట్ల నుంచి మాత్రమే. కాబట్టి, యూపీఐ ద్వారా చెల్లింపులు జరిపే వినియోగదారులపై, చిన్న విక్రేతలపై ఎలాంటి ప్రభావం ఉండదని ఇండస్ట్రీ వర్గాలన్నాయి.

ఎండీఆర్ అంటే..?

సాధారణంగా మనం యూపీఐ లేదా కార్డు ద్వారా షాపుల్లో చెల్లింపులు జరుపుతాం. ఆ లావాదేవీని సంబంధిత బ్యాంక్ ప్రాసెసింగ్ చేశాకే మనం చెల్లించిన సొమ్ము విక్రేత ఖాతాలో జమవుతుంది. ఈ లావాదేవీని ప్రాసెస్ చేసేందుకు విక్రేత బ్యాంక్‌కు చెలించాల్సిన రుసుమునే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అంటారు. ఆ మొత్తం లావాదేవీ విలువలో ఒక శాతం కంటే తక్కువే. అయితే, దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం యూపీఐ, రూపే కార్డులపై ఎండీఆర్‌ను 2022లో ఎత్తివేసింది. మాస్టర్, వీసా కార్డులు, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులపై ఇప్పటికీ విక్రేతలు ఎండీఆర్ చెల్లించాల్సి ఉంటుంది.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ అకౌంటింగ్‌లో తేడాలు

రూ.2,100 కోట్ల నెట్‌వర్త్ హాంఫట్

రూ.20,000 కోట్ల మార్కెట్ క్యాప్ ధమాల్

న్యూఢిల్లీ: డెరివేటివ్స్ పోర్టుఫోలియో ఆస్తుల లెక్కింపులో తేడాలు ప్రైవేట్ రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ను కుదిపేస్తున్నాయి. ఈ తేడాతో 2024 డిసెంబరు నాటికి బ్యాంకు నికర ఆస్తుల విలువ 2.35 శాతం (సుమారు రూ.2,100 కోట్లు) తగ్గిపోయిందని రెగ్యులేటరీ సంస్థలకు బ్యాంక్ తెలిపింది. గత ఏడాది సెప్టెంబరు-అక్టోబరు మధ్య జరిగిన అంతర్గత ఆడిటింగ్‌లోనే ఈ లోపాన్ని గుర్తించినా సోమవారమే ఈ విషయాన్ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కి తెలిపినట్టు బ్యాంక్ సీఈఓ, ఎండీ సుమంత్ కథ్‌పాలియా తెలిపారు. ఈ నష్టం ఏ మేరకు ఉంటుందనే స్పష్టత కోసం అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీని బ్యాంక్ ఆడిటర్‌గా నియమించింది. ఈ సంస్థ నివేదిక ఈ నెలాఖరు లేదా వచ్చే నెల ప్రారంభం కల్లా అందుతుందని కథ్‌పాలియా చెప్పారు.

భయపడొద్దు: మరోవైపు ఈ అకౌంటింగ్ లోపంపై వాటాదారులెవరూ గాభరా పడాల్సిన అవసరం లేదని ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రమోటర్ అశోక్ హిందూజా కోరారు. డిపాజిట్ల చెల్లింపులకూ ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. ఈ రూ.2,100 కోట్ల నష్టాన్ని భర్తీ చేసుకునే ఆర్థిక సామర్థ్యం తమకు ఉందని వాటాదారులకు, మదుపరులకు హామీ ఇచ్చారు. అవసరమైతే బ్యాంక్ ఈక్విటీలో తమ వాటా మరింత పెంచుకునేందుకూ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

షేరు ధమాల్

మరోవైపు మంగళవారం కూడా ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు కుప్పకూలింది. బీఎస్ఈలో ఇంట్రాడేలో ఒక దశలో 28 శాతం వరకు నష్టపోయి రూ.649 కనిష్ఠ స్థాయిని తాకింది. చివరికి 27.17 శాతం నష్టంతో రూ.655.95 వద్ద ముగిసింది. 2020 నవంబరు తర్వాత ఇండస్‌ఇండ్ షేరు ఈ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. కాగా ఈ భారీ నష్టాలతో బ్యాంకు షేర్లలో మదుపు చేసిన మదుపరులు రూ.20,000 కోట్ల వరకు నష్టపోయారు.

ఆరంభ నష్టాల నుంచి రికవరీ

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో ఆరంభ నష్టాల నుంచి తేరుకున్నప్పటికీ, మిశ్రమంగా ముగిశాయి. ఒక దశలో 451 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్. చివరికి 12.85 పాయింట్ల నష్టంతో 74,102.32 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మాత్రం 37.60 పాయింట్ల లాభంతో 22,497.90 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 14 రాణించగా.. మిగతా 16 నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం తగ్గగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.72 శాతం పెరిగింది.

23 రోజుల్లోనే రైట్స్ ఇష్యూలు పూర్తికావాలి : సెబీ

కంపెనీల రైట్స్ ఇష్యూలను సెబీ బాగా కుదించింది. ప్రస్తుతం కంపెనీలు తమ డైరెక్టర్ల బోర్డు ఆమోదం పొందినప్పటి నుంచి 317 రోజుల్లో రైట్స్ ఇష్యూలు పూర్తి చేయాలి. సెబీ దీన్ని తాజాగా 23 రోజులకు కుదించింది. అంతేగాక ఈ ఇష్యూల కోసం ముందుగా తనకు ఎలాంటి దరఖాస్తులు పంపాల్సిన అవసరం లేదని స్పష్టించింది. అయితే కంపెనీ షేర్లు లిస్టయిన స్టాక్ ఎక్స్ఛేంజీలకు మాత్రం విషయం తెలియజేయాలని కోరింది. రైట్స్ ఇష్యూలకు మర్చంట్ బ్యాంకర్ల నియామకం కూడా ఇక కంపెనీల ఇష్టమని తెలిపింది. వీటికి తోడు రైట్స్ ఇష్యూలను వారం నుంచి నెల రోజుల వరకు సబ్‌స్క్రిప్షన్ కోసం ఓపెన్ చేసి ఉంచాలని స్పష్టం చేసింది.

'టెంప్లెట్ మోడల్'లో కొత్త విమానాశ్రయాలు

పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో నానాటికీ పెరిగిపోతున్న విమాన ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు మరిన్ని విమానాశ్రయాలు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నంలో భాగంగా కొత్త విమానాశ్రయాలు అందుబాటులోకి తెచ్చేందుకు "టెంప్లెట్ మోడల్" అనుసరించాలనుకుంటున్నట్టు పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు చెప్పారు. టెంప్లెట్ మోడల్‌లో ప్రయాణికులు, సరుకు రవాణా, విమానయాన శిక్షణ సంస్థలు సహా విభిన్న అవసరాలకు వేర్వేరు విమానాశ్రయాలుంటాయి. దీని వల్ల ప్రయాణికులు రాకపోకలు సాగించే విమానాశ్రయాలపై ఒత్తిడి తగ్గుతుంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగుతున్న విమానయాన మార్కెట్లలో ఒకటైన మన దేశంలో ప్రస్తుతం 159 విమానాశ్రయాలున్నాయి. 200 శిక్షణ విమానాల సరఫరాకు ఎంఓయూపై సంతకాలు చేసే కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ విమానయాన సంస్థలు ఇప్పటికే 1,700 విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయని చెప్పారు. దీన్ని బట్టి రాబోయే 15-20 సంవత్సరాల కాలంలో మన దేశానికి 30 వేల మంది పైలట్లు అవసరమని మంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఆరు వేల నుంచి ఏడు వేల మధ్యలో పైలట్లున్నారని ఆయన చెప్పారు.

150 శిక్షణ విమానాలు తయారుచేయనున్న 'శక్తి': దేశీయంగా విమానాల తయారీకి ఉత్తేజం కల్పిస్తూ శక్తి ఎయిర్‌క్రాఫ్ట్ పరిశ్రమ 150 శిక్షణ విమానాలను నిర్మించనుంది. తమిళనాడుకు చెందిన శక్తి గ్రూప్, ఆస్ట్రియాకు చెందిన డైమండ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల మధ్య జాయింట్ వెంచర్ ఇది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	410
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	73	విజయవాడ	95
వరంగల్	73	గుంటూరు	90
కరీంనగర్	73	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	73	చిత్తూరు	77
కర్నూలు	73	నెల్లూరు	82
విశాఖపట్నం	89	అనంతపురం	82
గోదావరి	95		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,490 ▼	80,200 ▼	1,07,000 ▼
విజయవాడ	88,500 ▼	83,400 ▼	99,300 ▼
విశాఖపట్నం	86,250 ▲	79,060 ▲	97,540 ▼
రాజమండ్రి	87,490 ▼	80,200 ▼	99,500 ▲
ప్రొద్దుటూరు	87,600 ▼	81,120 ▼	97,800 ▼
ముంబై	86,024 ▼	78,798 ▲	96,626 ▼

స్పోర్ట్స్

నిరాశపరచిన షట్లర్లు

బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో గాయత్రీ గోపీచంద్ జోడీ మినహా భారత అగ్రశ్రేణి క్రీడాకారులందరూ టాప్-10లో చోటు కోల్పోయారు. మంగళవారం బీడబ్ల్యూఎఫ్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో లక్ష్యసేన్ ఐదు స్థానాలు దిగజారి 15వ ర్యాంక్‌కు, ప్రణయ్ 29వ ర్యాంక్‌కు పడిపోయారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 15 నుంచి 16వ ర్యాంక్‌కు దిగొచ్చింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి 2021 తర్వాత తొలిసారి టాప్- 10లో స్థానం కోల్పోయి 7 నుంచి 12వ ర్యాంక్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి-ట్రీసా జంట నిలకడగా తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జోడీ కెరీర్‌లో తొలిసారిగా 20వ ర్యాంక్ సాధించి, టాప్-20లోకి ప్రవేశించింది.



లక్ష్య సేన్

ప్రీక్వార్టర్స్‌కు లక్ష్య సేన్, మాళవిక

ప్రణయ్ ఇంటిదారి ● ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్


మాళవిక

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షి‌ప్‌లో భారత ఏస్ షట్లర్ లక్ష్య సేన్, మాళవిక బన్సోడ్ ముందంజ వేయగా.. హెచ్‌ఎస్ ప్రణయ్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో లక్ష్య సేన్ 13-21, 21-17, 21-15తో లి యంగ్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు. తొలి గేమ్‌లో ఓడినా.. సేన్ బలంగా పుంజుకొని మిగతా రెండు గేమ్‌లో నెగ్గాడు. రెండో రౌండ్‌లో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో సేన్ తలపడనున్నాడు. కాగా, హెచ్‌ఎస్ ప్రణయ్ 19-21, 16-21తో టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో వరుస గేముల్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోడ్ 21-13, 10-21, 21-17తో యో జి మిన్ (సింగపూర్)పై గెలిచి రెండో రౌండ్‌కు చేరుకొంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీష్ కుమార్-ఆద్య వరియత్ జంట 6-21, 15-21తో చైనాకు చెందిన గు జిన్ వ-చెన్ ఫాంగ్ హుయ్ చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 20-22, 18-21తో చైనీస్ తైపీకి చెందిన షి పి షాన్-హంగ్ యన్ జు చేతిలో పోరాడి ఓడింది.

ఆర్‌సీబీకి ఓదార్పు

● రాణించిన మంధాన ● ముంబైపై విజయం ● డబ్ల్యూపీఎల్


మంధాన (53)

ముంబై: గెలిస్తే ఫైనల్లో చోటు లభించే కీలక మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తడబడింది. అటు వరుసగా ఐదు ఓటములతో ఇప్పటికే డబ్ల్యూపీఎల్ నుంచి వైదొలిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఉత్కంఠ పోరులో హర్మన్‌ప్రీత్ సేనకు షాకిచ్చింది. మంగళవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 11 రన్స్ తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 3 వికెట్లకు 199 పరుగులు చేసింది. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ చెలరేగడంతో ఆర్‌సీబీ భారీ స్కోరందుకుంది. ముఖ్యంగా ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న ఓపెనర్ స్మృతి మంధాన (53)తో పాటు ఎలిస్ పెర్రీ (49 నాటౌట్), రిచా (36) రాణించారు. ఓపెనర్ సబ్బినేని మేఘన (26)తో కలిసి మంధాన తొలి వికెట్‌కు 41, ఆ తర్వాత ఎలిస్‌తో రెండో వికెట్‌కు 59 పరుగులు జత చేసింది. చివర్లో వేర్‌హామ్ (10 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 31 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్ జట్టు విజయంలో కీలకమైంది. మరో ఎండ్‌లో ఎలిస్ కూడా ధాటిని చూపగా ఆఖరి నాలుగు ఓవర్లలో ఆర్‌సీబీ 65 పరుగులు రాబట్టింది.

బ్రంట్ పోరాటం: అనంతరం భారీ ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 188 పరుగులు చేసి ఓడింది. వీరి ఇన్నింగ్స్‌లో నాట్ సివర్ బ్రంట్ (69) ఆరంభంలో పోరాడగా, చివర్లో సజన (23) ఆర్‌సీబీని వణికించినా ఫలితం లేకపోయింది. హర్మన్ (20), మాథ్యూస్ (19) విఫలమయ్యారు. ఆఖరి ఓవర్‌లో 28 పరుగులు కావాల్సిన వేళ సజన వరుస సిక్సర్లతో హడలగొట్టి ఐదో బంతికి వెనుదిరిగింది. స్నేహ్ రాణాకు మూడు.. గార్త్, పెర్రీలకు రెండేసి వికెట్లు దక్కాయి.


ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్

ఆర్‌సీబీ చేతిలో ముంబై ఓడిపోవడంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ప్రవేశించింది. వాస్తవానికి ఢిల్లీ-ముంబై ఖాతాలో పది పాయింట్లే ఉన్నా రన్‌రేట్ మెరుగ్గా ఉండడం ఢిల్లీకి వరంగా మారింది. అటు గురువారం జరిగే ఎలిమినేటర్‌లో ముంబై-గుజరాత్ జట్లు తలపడతాయి. ఇందులో విజేత ఫైనల్‌కు వెళ్తుంది.

సంక్షిప్త స్కోర్లు: బెంగళూరు: 20 ఓవర్లలో 199/3 (మంధాన 53, పెర్రీ 49 నాటౌట్, రిచా ఘోష్ 36, వేర్‌హామ్ 31 నాటౌట్; హేలీ మాథ్యూస్ 2/37)
ముంబై: 20 ఓవర్లలో 188/9 (సివర్ 69, సజన 23, హర్మన్ 20; స్నేహ్ 3/26, గార్త్ 2/33, ఎలిస్ 2/53).

రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం ఎత్తివేత

ఊపిరిపీల్చుకొన్న రెజ్లర్లు


సంజయ్ సింగ్

న్యూఢిల్లీ: కొన్ని నెలలుగా అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న రెజ్లర్లకు శుభవార్త. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)పై విధించిన నిషేధాన్ని క్రీడా మంత్రిత్వ శాఖ ఎత్తివేసింది. దీంతో జోర్డాన్‌లోని అమ్మాన్ వేదికగా జరగనున్న ఆసియా చాంపియన్‌షిప్ సెలెక్షన్ ట్రయల్స్ సహా సమాఖ్య తమ కార్యకలాపాలను యథావిధిగా కొనసాగించేందుకు మార్గం సుగమం అయింది. ఈ ట్రయల్స్‌ను ఈనెల 15న నిర్వహించనున్నారు. అలాగే ప్రస్తుత అధ్యక్షుడు, బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అనుచరుడు అయిన సంజయ్ సింగ్ నియంత్రణలోకి సమాఖ్య వచ్చేసినట్టయింది. స్పోర్ట్స్ కోడ్ ఉల్లంఘన కారణంగా 2023, డిసెంబరు 24న సంజయ్ సింగ్ అధ్యక్షతన ఏర్పడిన డబ్ల్యూఎఫ్‌ఐ కార్యవర్గంపై క్రీడాశాఖ సస్పెన్షన్ విధించింది. రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ హవాసాగే గోండాలోనే అండర్-15, అండర్-20 జాతీయ చాంపియన్‌షిప్స్‌ను ఏర్పాటు చేయాలనుకోవడం కూడా ప్రభుత్వాగ్రహానికి కారణమైంది. రెజ్లర్ల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్టు క్రీడాశాఖ ప్రకటించింది. సమాఖ్య కార్యాలయాన్ని బ్రిజ్‌భూషణ్ ఇంటి నుంచి ఢిల్లీకి తరలించినట్టు దర్యాప్తులో తేలిందని తెలిపింది. ప్రభుత్వ నిర్ణయంపై అధ్యక్షుడు సంజయ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశాడు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నడుచుకొంటామన్నాడు. సమాఖ్యపై నిషేధం ఎత్తివేయకపోతే రెజ్లర్లకు అన్యాయం చేసినట్టేనని క్రీడామంత్రి మన్‌సుఖ్ మాండవ్య అన్నారు. కాగా, ప్రభుత్వ నిర్ణయంతో కుటదారులు మట్టికరిచారని బ్రిజ్‌భూషణ్ చెప్పాడు.

టాప్-5లో దీప్తి శర్మ



దుబాయ్: ఐసీసీ మహిళల వన్డే క్రికెట్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన దీప్తి శర్మ ఐదో స్థానానికి ఎగబాకింది. ఈక్రమంలో తను అమేలియా కెర్ (న్యూజిలాండ్)ను అధిగమించడం విశేషం. తాజా జాబితాలో ఆసీస్ క్రికెటర్ ఆష్లే గార్డ్‌నర్ టాప్‌లో ఉంది. ఇక టీ20 ఆల్‌రౌండర్లలో దీప్తి మూడో ర్యాంకులోనే కొనసాగుతోంది. అలాగే వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి స్మృతి మంధాన (2) మాత్రమే టాప్-10లో చోటు దక్కించుకుంది.

మూర్ఖుల మాటల్ని పట్టించుకోవద్దు: జావేద్ అక్తర్



న్యూఢిల్లీ: టీమిండియా పేసర్ షమికి బాలీవుడ్ ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ మద్దతుగా నిలిచారు. అతిగా స్పందించే మూర్ఖుల మాటలను పట్టించుకోవద్దన్నారు. ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ మధ్యలో షమి ఎనర్జీ డ్రింక్ తాగాడు. దీంతో రంజాన్ నెలలో ఉపవాసం ఉండకుండా షమి పాపం చేశాడని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వి విమర్శించారు. దీనిపై జావేద్ స్పందిస్తూ..'షమి సాబ్.. దుబాయ్‌లోని క్రికెట్ మైదానంలో.. మండుటెండలో నీళ్లుతాగడాన్ని తప్పుబట్టే మూర్ఖుల మాటల్ని పట్టించుకోవద్దు. అద్భుత భారత జట్టులో నువ్వుకూడా ఒకడివైనందుకు గర్విస్తున్నా' అని పోస్టు చేశారు.

ఈ జట్టూ ఫైనల్ చేరుతుంది..

భారత్-బి టీమ్‌ను ఎంపిక చేసిన వాన్

న్యూఢిల్లీ: భారత జట్టును విమర్శించడానికి ఎప్పుడూ కాచుకు కూర్చొనే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్.. చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన తర్వాత రోహిత్ సేనపై ప్రశంసల జల్లు కురిపించాడు. యువ ఆటగాళ్లతో తాను ఎంపిక చేసిన భారత్-బి జట్టుకు కూడా చాంపియన్స్ ట్రోఫీ నెగ్గగల సామర్థ్యం ఉందని అన్నాడు.

వాన్ ఎంపిక చేసిన 'బి' జట్టు: యశస్వీ జైస్వాల్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్, నితీష్ కుమార్, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్.

ఐసీయూలో పాక్ క్రికెట్!



కరాచీ: తప్పుడు నిర్ణయాల కారణంగా పాకిస్థాన్ క్రికెట్ ప్రస్తుతం ఐసీయూలో ఉన్నదని ఆదేశ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీది సంచలన వ్యాఖ్యలు చేశాడు. టీ20ల్లో స్పిన్ ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ పునరాగమనాన్ని గట్టిగా నిలదీశాడు. పదేపదే కెప్టెన్ల మార్పు ప్రతికూలంగా మారిందని చెప్పాడు. పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహిసిన్ నఖ్వీకి క్రికెట్ పరిజ్ఞానం లేదని అఫ్రీది అన్నాడు.

స్వదేశానికి చాంపియన్లు


గిల్

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన భారత జట్టు క్రికెటర్లు ఒక్కొక్కరుగా స్వదేశానికి చేరుకుంటున్నారు. సోమవారం కోచ్ గౌతమ్ గంభీర్, పేసర్ హర్షిత్ రాణాతో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ తన కుటుంబ సభ్యులతో ముంబైకి చేరుకున్నాడు. అయితే మరి కొంత మంది ఆటగాళ్లు రెండు, మూడు రోజుల పాటు దుబాయ్‌లోనే సేద తీరనున్నారు. ఇక స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. భార్య అనుష్కతో కలిసి ఫైనల్ మ్యాచ్ ముగిసిన రోజు రాత్రే హోటల్ నుంచి వెళ్లిపోయాడు. ఈనెల 22 నుంచి ఐపీఎల్ ఆరంభం కానుండడంతో టీమిండియా ఆటగాళ్లకు విశ్రాంతి తీసుకునేందుకు బోర్డు అనుమతిచ్చింది. అందుకే ఈసారి విక్టరీ పరేడ్ కూడా నిర్వహించలేదు.

భారత్ దూరం.. లార్డ్స్‌కు నష్టం



లండన్: భారత క్రికెట్ జట్టు ప్రపంచంలో ఎక్కడ ఆడినా స్టేడియాలు కళకళలాడుతుంటాయి. ఇక ఐసీసీ టోర్నీలయితే చెప్పనక్కర్లేదు. టిక్కెట్లు ఎంత ఖరీదైనా హాట్‌కేకుల్లా అమ్ముడుపోతుంటాయి. తాజాగా చాంపియన్స్ ట్రోఫీలోనూ అదే జరిగింది. ఇక లండన్‌లో జరిగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు కూడా టీమిండియా అర్హత సాధిస్తుందని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) గట్టి నమ్మకమే పెట్టుకుంది. అందుకే భారత అభిమానుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్న భావనతో ఫైనల్ టిక్కెట్ రేట్లను ఒక్కో దానిపై రూ.5 వేలకు పెంచింది. కానీ న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లపై సిరీస్‌లను ఓడడంతో భారత్ ఈసారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరలేకపోయింది. ఈ దెబ్బకు ఈసీబీ తమ టిక్కెట్ల రేట్లను తగ్గించి రూ.4000-11000 మధ్య ఖరారు చేయడంతో రూ.45 కోట్ల నష్టం వాటిల్లనుంది. ఇంతకుముందే పాత ధరకు కొన్నవారికి మిగిలిన డబ్బును రిఫండ్ చేయనున్నారు. లార్డ్స్ వేదికగా జూన్ 11-15 తేదీల్లో ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ జరుగుతుంది.

గ్రూప్-1 ఫలితాలలో అవకతవకలు

- తెలుగులో గ్రూప్-1 రాసిన అభ్యర్థులపై వివక్ష!
- గ్రూపు-1 పేపర్ రీ వాల్యూయేషన్ చేయాలి
- టాప్ 100లో సీఎం సామాజిక వర్గం వారే ఎక్కువ
- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్ గౌడ్

పంజాగుట్ట, మార్చి11(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాలలో అవకతవకలు జరిగాయని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆరోపించారు. గ్రూప్-1 పరీక్షలు తెలుగులో రాసిన అభ్యర్థులపై వివక్ష చూపారని, గ్రూప్-1 పేపర్ రీ వాల్యూయేషన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొదటి వంద మంది ర్యాంకుల వివరాలు పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అశోక్‌నగర్‌లోని కొన్ని కోచింగ్ కేంద్రాలకు సీఎంకు మధ్య ఉన్న సంబంధం ఏమిటని ప్రశ్నించారు. టాప్ వందలో సీఎం సామాజిక వర్గానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారని, వారికి ఆర్డీఓ, డీఎస్పీ లాంటి ఉన్నత పోస్టులు కట్టబెట్టాలని చూస్తున్నారని, ఒక్కో పోస్టుకు కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ఓపెన్ క్యాటగిరిలో ఎంపిక అయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఓపెన్ కేటగిరీలోనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నా భర్త హత్య కేసును పక్కదోవ పట్టిస్తున్న పోలీసులు

- డీజీపీని ఆశ్రయించిన రాజలింగమూర్తి భార్య

భూపాలపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తన భర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసును పోలీసులు పక్కదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని ఆయన భార్య సరళ ఆరోపిస్తున్నారు. ఈమేరకు డీజీపీ జితేందర్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 19న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కలకలం రేపింది. స్థానిక పోలీసులు ఈ కేసును మొదటి నుంచి పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సరళ ఆరోపించారు. తన భర్త హత్య వెనుక కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరుల హస్తం ఉందని తాను స్వయంగా డీఎస్పీ సంపత్‌రావుకు వాంగ్మూలం ఇచ్చానని తెలిపారు. పెద్దవాళ్ల పేర్లు చెబితే కేసు నీరుగారిపోతుందంటూ డీఎస్పీ సాకు చెప్పి, వేరే వారిచేత మళ్లీ పిటిషన్ రాయించి దుఃఖంలో ఉన్న తనతో సంతకాలు చేయించారని ఆరోపించారు.

ఈఎన్‌సీ పదోన్నతులకు డీపీసీ లైన్ క్లియర్

హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో చీఫ్ ఇంజనీర్ల(సీఈ) నుంచి ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్)లుగా పదోన్నతి కల్పించడానికి వీలుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో మంగళవారం శాఖాపరమైన పదోన్నతుల కమిటీ(డీపీసీ) సమావేశం జరిగింది. ఇందులో 9 మందికి ఈఎన్‌సీలుగా పదోన్నతికి అర్హతను కల్పిస్తూ డీపీసీ ఆమోదం తెలిపింది. ఫైలును ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి పంపించారు. ఈఎన్‌సీ(జనరల్)గా జి.అనిల్‌కుమార్‌ను పూర్తిస్థాయిలో నియమించి, ఈఎన్‌సీ(అడ్మిన్)గా అంజద్ హుస్సేన్‌కు అప్పగించే అవకాశాలున్నాయి. ఈఎన్‌సీ(రామగుండం)గా శ్రీనివాస్‌ను నియమించే అవకాశాలున్నాయి.

రేవంత్.. పసుపు రైతుల బాధలు పట్టవా?

- గిట్టుబాటు ధరలేక అల్లాడుతున్నారు: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్/నార్సింగి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మద్దతు ధర రాక పసుపు రైతులు అల్లాడుతున్నారు. వారిబాధలు, కష్టాలు మీకుపట్టవా..?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతులను చిత్తుచేస్తున్నాయని, పంటకు గిట్టుబాటు ధర కోసం రైతులు ఆందోళన చేస్తుంటే ఆ రెండు సర్కార్‌లు కనీసం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.15వేల మద్దతు ధరకు పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని సంచార జాతులకు ప్రభుత్వం డీనోటిఫైడ్ జాతుల (డీఎన్టీ) సర్టిఫికెట్లు జారీచేయాలని ఆమె డిమాండ్ చేశారు. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత గట్టు రామచందర్‌రావును ఎమ్మెల్సీ కవిత కలిసి పరామర్శించారు.

420 రోజులు.. 42 సార్లు ఢిల్లీకి సీఎం రేవంత్: బూర నర్సయ్య

సీఎం రేవంత్‌రెడ్డి, అధికారం చేపట్టి 420 రోజులు పూర్తయ్యిందని, ఈ కాలంలో ఆయన 42 సార్లు ఢిల్లీ వెళ్లివచ్చారని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత బూర నర్సయ్యగౌడ్ చెప్పారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేవంత్ ముఖ్యమంత్రి తెలంగాణకా? లేక ఢిల్లీకా? లేదంటే కేంద్ర మంత్రా? అని ప్రశ్నించారు. తెలంగాణ సచివాలయాన్ని ఢిల్లీలోనే ఏర్పాటు చేసుకోండని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌ది 5 డీ(డైవర్షన్, డిమాలిషన్, డిస్ట్రక్షన్, డిసీవింగ్, ఢిల్లీ బ్లేమ్)పాలన అని విమర్శించారు.

అన్నదాతపై కక్షగట్టిన కాంగ్రెస్: కేటీఆర్

"అన్నదాతలపై కాంగ్రెస్ కక్షగట్టి వ్యవహరిస్తోంది. వారి పాలనలో రైతు భరోసా రాదు.. సాగునీళ్లివ్వరు.. కరెంటు సరఫరాలేదు.. ఎరువులుండవు.. విత్తనాలూ దొరకడంలేదు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పండగలా ఉంటే.. రేవంత్‌రెడ్డి సర్కార్‌లో తెలంగాణ వ్యవసాయ రంగం ఆగమాగమైందని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎండాకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకితే.. ఇప్పుడు నీళ్లలేక వెలవెలబోతున్నాయన్నారు. ప్రాజెక్టులను పడావుబెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదుల్తున్న కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని పంటలను ఎండబెడుతోందని కేటీఆర్ విమర్శించారు.

మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి: హరీశ్‌రావు

గజ్వేల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సిద్దిపేట జిల్లాలో నిర్మించిన శ్రీ కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటానని గతంలో భూ నిర్వాసిత గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్‌లో రేవంత్‌రెడ్డి నిరహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, ఆ బాధ్యత ఆయనపైనే ఉందని లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 90% ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాస కాలనీల నిర్మాణం, ఇంటి స్థలాలు, మౌలిక సదుపాయాలు కల్పించామని మిగిలిన 10% సమస్యలు గత ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లోనే పెట్టిందన్నారు.

గరిమెళ్లకు కన్నీటి వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు)/తిరుమల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు సంగీతాభిమానులు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో ఆదివారం కన్నుమూసిన ఆయనకు ప్రభుత్వ అధికార లాంఛనాలతో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా అధికార యంత్రాంగం అంత్యక్రియల్లో పాల్గొని గరిమెళ్లకు నివాళులర్పించారు. తిరుపతి భవానీనగర్‌లోని నివాసం నుంచి అంతిమ యాత్ర సాగింది. హరిశ్చంద్ర శ్మశానవాటికలో గరిమెళ్ల గౌరవార్థం పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం పలికారు. అంతకుముందు బాలకృష్ణ ప్రసాద్ పార్థివదేహానికి తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ పుష్పగుచ్ఛంతో నివాళులర్పించగా, పోలీసులు జాతీయ పతాకాన్ని కప్పారు. కాగా, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల మృతిపై ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి బాధాకరం. ఆయన ఆలపించిన కీర్తనలు గొప్ప ఆధ్యాత్మిక, సంగీత వారసత్వాన్ని కొనసాగిస్తూ అనేకమంది హృదయాలను స్పృశించాయి. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను' అంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

క్యాన్సర్ కన్నెర్ర



పెరుగుతున్న కంటి క్యాన్సర్ కేసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ కన్నెర్ర చేస్తోంది. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా అన్ని వయసుల వారిలోనూ చూపును దెబ్బతీస్తోంది. కాలేయం, ఊపిరితిత్తులు, గర్భాశయ ముఖద్వారం, చర్మ సంబంధిత క్యాన్సర్లను మనం ఎక్కువగా చూస్తుంటాం. అయితే, ఇప్పుడు కంటి క్యాన్సర్ కేసులూ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోవడం, ప్రాణాలకు ముప్పు వాటిల్లడం జరుగుతుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కంటి కాన్సర్ అరుదైనప్పటికీ, సకాలంలో గుర్తించకపోతే ప్రాణాంతకం కావచ్చని చెబుతున్నారు. శాశ్వతంగా చూపు పోయే, కంటిని పూర్తిగా తీసివేసే ముప్పు ఉంటుందని ఎల్.వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు పేర్కొంటున్నారు. అవగాహనా లోపం వల్ల చాలా కేసులు తీవ్రమైన దశకు చేరేదాకా గుర్తించలేకపోతున్నారని ఎల్వీపీఈఐ ఆక్యులర్ ఆంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ స్వాతి తెలిపారు. ఎల్వీపీఈఐలో ఏటా దాదాపు 500 కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా, వెయ్యి వరకు ఫాలో అప్ కేసులు ఉంటున్నాయని, మూడు వందల సర్జరీలు జరుగుతున్నాయని వెల్లడించారు. పిల్లల్లో రెటినోబ్లాస్టోమా కేసుల సంఖ్య ఎక్కువగా ఉంటోందని చెప్పారు.

పెరుగుతున్న రెటినోబ్లాస్టోమా కేసులు

పిల్లలలో ప్రాణాంతకమైన కంటి కాన్సర్ రెటినోబ్లాస్టోమా. ఇది ఇతర దేశాలకంటే భారతదేశంలో ఎక్కువగా నమోదు అవుతున్నట్లు వైద్యులు వివరించారు. సాధారణ కంటి కాన్సర్లలో ఆక్యులర్ సర్ఫేస్ స్క్వామస్ నియోప్లాసియా(ఓఎస్ఎస్ఎన్), సెబాసియస్ గ్లాండ్ కార్సినోమా పెద్దవారిలో కనిపిస్తున్నాయన్నారు. పదేళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో ఓఎస్ఎస్ఎన్ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తోంది. సెబాసియస్ గ్లాండ్ కార్సినోమా, కనురెప్పల క్యాన్సర్ కేసులూ నమోదవుతున్నట్లు డాక్టర్లు తెలిపారు. జన్యుపరమైన లోపాలు, రోగనిరోధక శక్తి తగ్గడం, ధూమపానంవంటి కారణాలు వల్లకంటి కాన్సర్లు పెరగుతున్నాయని చెప్పారు.

ఇవీ లక్షణాలు

పిల్లల కంటిలో ఒక తెల్లని మచ్చ ఏర్పడటం రెటినోబ్లాస్టోమాకు సంకేతం; చెదిరిన చూపు లేదా ఉన్నట్టుండి చూపు పోవడం;కంటిలోని ఐరిస్‌పై నల్ల మచ్చ పెరగడం; కంటి ఆకారంలో అకస్మాత్తుగా మార్పు, ఒక కన్ను ఉబ్బడం;కనురెప్పపై, కంటి చుట్టూ గడ్డ ఏర్పడటం; కన్ను ఎరుపెక్కడం, వాపు, దీర్ఘకాలంగా చికాకు ఉండటం; కంటిలో, కంటి చుట్టూ నొప్పి అనిపించడం

సమస్య ఉంటే పరీక్షలు తప్పనిసరి..



కంటిలో ఏవైనా అసాధారణ మార్పులు గమనిస్తే ఆలస్యం చేయకుండా పరీక్ష చేయించుకోవాలి. కంటిచూపులో ఉన్నట్టుండి ఏదైనా మార్పు వచ్చినా, కంటి వాపు ఉన్నా అప్రమత్తం అవ్వాలి. ఏ లక్షణాలూ లేకపోయినా కంటి పరీక్ష చేయించుకోవడం వల్ల కాన్సర్‌ను ముందే గుర్తించే అవకాశం ఉంటుంది. త్వరగా గుర్తిస్తే రెటినోబ్లాస్టోమాను నయం చేయవచ్చు.

- డాక్టర్ స్వాతి, ఆక్యులర్ ఆంకాలజీ విభాగం అధిపతి, ఎల్వీపీఈఐ

ఆధారాలతో నిలదీద్దాం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో అనుసరించాల్సిన విధానం, హామీల అమల్లో కాంగ్రెస్ వైఫల్యం, బడ్జెట్‌లో ఆయా రంగాలకు జరిపే కేటాయింపులు, ఇతర అంశాలపై ఏ విధంగా స్పందించాలన్న దానిపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, రైతుల సమస్యలు, మంచినీటి కొరత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలతో పాటు ఇతర ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నలతో ముంచెత్తాలని అన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ సభ్యులు దూకుడుగా వెళ్లాలని, రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులు, సృష్టించిన ఆస్తుల గురించి వివరించిన కేసీఆర్.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.4 లక్షల కోట్ల అప్పు చేస్తే.. కాంగ్రెస్ అధికారం చేపట్టిన 14 నెలల్లోనే రూ.1.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు భారీగా అప్పులు చేస్తున్నా.. ఎన్నికల హామీలు మాత్రం అమలు చేయడంలేదని ఆరోపించారు. రైతు బంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌పై నిందలను తిప్పికొట్టాలి..

అప్పుల విషయంలో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని, వేస్తున్న నిందలను బలంగా తిప్పికొట్టాలని, సభ ద్వారా ప్రజలకు వాస్తవాలు వివరించాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచించారు. ప్రధానంగా.. ఎండిన పంటలు, అందని సాగునీరు, విద్యుత్తు, కాలిపోతున్న మోటార్లు వంటి రైతాంగ సమస్యలతోపాటు మంచినీటి కొరతపై అసెంబ్లీ, మండలిలో పోరాడాలన్నారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా బీఆర్ఎస్ గొంతుక వినిపించాలన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై, ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్లు, డీఏల పెండింగ్, పీఆర్సీ అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని, విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల బకాయిలు, వైద్యరంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, ఇతర ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగటాలన్నారు. దళితబంధు నిలిపివేయడం, గొర్రెల పెంపకం, చేపల పంపిణీ సమగ్ర అమలుపై ప్రశ్నించాలన్నారు. శాసనసభ, మండలిలో ప్రతిభావంతంగా ప్రజాసమస్యలపై పోరాడేందుకు సభ్యులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకునేలా.. డిప్యూటీ లీడర్లను నియమించనున్నట్టు కేసీఆర్ ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు.



తెలంగాణభవన్‌లో జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న కేసీఆర్, కేటీఆర్

అసెంబ్లీకి రానున్న కేసీఆర్..!

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదని విమర్శలు, ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో బుధవారం ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో ఆయన పాల్గొనేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు, విమర్శలు చేయడంపై ఇటీవల స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి, "మీ పార్టీ అధినేత అసెంబ్లీకి వస్తే అన్ని ఆరోపణలు, విమర్శలకు జవాబిస్తాం" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షనేత సభకు హాజరైతే.. అధికార, ప్రతిపక్షాల మధ్య వాడి వేడి చర్చ జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్ష నేతల విమర్శలను తిప్పికొట్టేలా ఈ బడ్జెట్ సమావేశాలకు హాజరుకావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈసారి అసెంబ్లీ సమావేశాలకు సారొస్తారంటూ.. గులాబీ శ్రేణులు ఘటాపథంగా చెబుతున్నాయి. అయితే బడ్జెట్ సమావేశాలు జరిగినన్ని రోజులూ కేసీఆర్ సభకు వస్తారా? తొలిరోజు గవర్నర్ ప్రసంగ సమావేశానికి, ఆ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు మాత్రమే హాజరవుతారా? అన్న దానిపై మాత్రం స్పష్టత లేదు.

'గ్యారెంటీలు' భారమని రేవంత్ చెప్పారు!

- ముఖ్యమంత్రి అయ్యాకే భారం విలువ తెలిసిందన్నారు
- జాతీయ స్థాయిలో చర్చ కూడా జరగాలన్నారు
- తెలంగాణ గ్యారెంటీల అంశాన్ని కర్ణాటక అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రతిపక్ష నేత అశోక్

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు అంశంపై కర్ణాటక అసెంబ్లీలో చర్చ జరిగింది. గ్యారెంటీల అమలు భారంగా మారిందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారంటూ ప్రతిపక్ష (బీజేపీ) నేత అశోక్ సభలో ప్రస్తావించారు. 'ఆరు గ్యారెంటీల అమలు భారంగా మారుతోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఓ చర్చాగోష్ఠిలో చెప్పారు. సీఎం అయిన తర్వాతే భారం విలువ తెలిసొచ్చిందనీ వ్యాఖ్యానించారు. ఏడాదికి రూ.18 వేల కోట్ల పింఛన్లు, వేతనాలను చెల్లిస్తున్నామని, గ్యారెంటీలు భారం అవుతున్నాయని చెప్పారు. వీటిపై జాతీయస్థాయిలో చర్చ జరగాలని కూడా అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీకే చెందిన పొరుగు రాష్ట్ర సీఎం గ్యారెంటీలు భారం అంటుంటే కర్ణాటకలో మాత్రం కాంగ్రెస్ కార్యకర్తలకు రాజకీయ ఉద్యోగాలు కల్పించేలా, అమలుకు కమిటీ వేసి, క్యాబినెట్ ర్యాంకులు కట్టబెట్టారు' అని సిద్దరామయ్య సర్కారుపై అశోక్ ధ్వజమెత్తారు. కర్ణాటకలో అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలపై మంగళవారం సభ అట్టుడికింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ్యుల అధికారాలను లాగేసుకునే ప్రయత్నం చేస్తోందని అశోక్ ఆరోపించారు. శాసనసభ నియోజకవర్గంలో కమిటీ ఏదైనా ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉండాలని, ఈ నిబంధనను దేశంలోని అన్ని రాష్ట్రాలు పాటిస్తున్నాయని చెప్పారు. కానీ, రాష్ట్రంలో గ్యారెంటీ పథకాల అమలుకు కమిటీ వేసి, కాంగ్రెస్ కార్యకర్తలకు క్యాబినెట్ హోదాలు కల్పించి, ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే జోక్యం చేసుకొని.. మహారాష్ట్రలో మంత్రుల పీఏలుగా ఆరెస్సెస్ కార్యకర్తలను నియమించుకుని వేతనాలివ్వడం లేదా? అని నిలదీశారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు.

సీఎం రేవంత్ అధ్యక్షతన సీఎల్పీ సమావేశం

- శాసనసభ, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ



హైదరాబాద్, మార్చి 11(ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం కాంగ్రెస్ శాసన సభా సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలు-1లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు. 2025-26 బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో శాసనసభ, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం రేవంత్ సభ్యులకు దిశా నిర్దేశం చేయనున్నారు.

1,532 మంది అధ్యాపకులకు నేడు నియామక పత్రాలు

విద్యాశాఖలో నూతనంగా ఎంపికైన 1,532 మంది అధ్యాపకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం మధ్యాహ్నం 12.30గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. కొత్తగా ఎంపికైన వారిలో ఇంటర్మీడియట్ విద్యలో జూనియర్ లెక్చరర్లుగా 1,292 మందికి (పురుషులు-794, మహిళలు-498), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధించేందుకు 240 మందికి (పురుషులు-177, మహిళలు-63) నియామకపత్రాలను అందిస్తారు.

ఫీజు బకాయిలు చెల్లించకుంటే సెమిస్టర్ పరీక్షలు బంద్

- డిగ్రీ కాలేజీ యాజమాన్యాల హెచ్చరిక
- ప్రభుత్వానికి ఈ నెల 20 వరకు గడువు

హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించకపోతే త్వరలో జరగనున్న సెమిస్టర్ పరీక్షలు నిర్వహించలేమని తెలంగాణ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం స్పష్టం చేసింది. రూ. 2500 కోట్ల బకాయిలను మార్చి-20లోపు చెల్లించాలంటూ గడువు విధించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి అధ్వర్యంలోని ప్రతినిధుల బృందం మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందించింది. గత 16 నెలల్లో ఇప్పటివరకు కనీసం 20 శాతం కూడా ఫీజు బకాయిలు విడుదల చేయలేదని సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. యాజమాన్యాలన్నీ ఆర్థిక భారం, అప్పుల బాధతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు.

19న రాష్ట్ర బడ్జెట్?

నేటి నుంచి శాసన సభా సమావేశాలు

- 11 గంటలకు గవర్నర్ ప్రసంగం
- తర్వాత బీఏసీ భేటీ.. సభ తేదీల ఖరారు
- ఈసారి సమావేశాలకు కేసీఆర్ హాజరు



హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి శాసనసభ, మండలి సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సమావేశాలకు హాజరు కావడం, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతులు, ప్రాజెక్టుల అంశంపై బీజేపీ, అధికారపార్టీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండడం, దక్షిణాది రాష్ట్రాలకు నిధుల విడుదల, పార్లమెంటు నియోజక వర్గాల డీ లిమిటేషన్‌పై చర్చ సాగుతుండడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈసారి సమావేశాలు హాట్‌హాట్‌గా కొనసాగుతాయని అంటున్నారు. తొలి రోజు బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగం ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ఆయన వివరిస్తారు. అనంతరం సభ గురువారానికి వాయిదా పడుతుంది. తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో జరిగే 'శాసన సభా వ్యవహారాల కమిటీ(బీఏసీ)' భేటీలో అసెంబ్లీ సమావేశాల తేదీలను ఖరారు చేస్తారు. 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. 14న హోలీ పండుగ కావడంతో సభకు సెలవు ప్రకటించే అవకాశముంది. 15న బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముందని సమాచారం. ఆ రోజు రెండు వర్గాలకు సంబంధించిన బిల్లులను ప్రవేశపెడతారా లేదా ఒక వర్గానికి సంబంధించిన బిల్లును మాత్రమే పెడతారా అనేది బీఏసీలో తేలుస్తారు. ఒకవేళ 15న బిల్లులను ప్రవేశపెట్టకపోతే... 16న ఆదివారం సభకు సెలవు ఇచ్చి, 17, 18 తేదీల్లో బిల్లులను ప్రవేశపెట్టడం, చర్చించడం పూర్తి చేస్తారు. 19న మాత్రం 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్‌ను ప్రవేశపెడతారని అత్యంత విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బడ్జెట్‌ను సభ్యులు చదువుకోవడానికి వీలుగా 20న సెలవు ఇస్తారు. 21 నుంచి బడ్జెట్‌పై చర్చను చేపడతారు. సమావేశాలను ఈ నెలాఖరు వరకు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఈ దృష్ట్యా.. అప్పటి వరకు బడ్జెట్‌పై, బడ్జెట్ పద్దులపై చర్చను చేపట్టి, చివరి రోజు ద్రవ్య వినిమయ బిల్లును సభలో ఆమోదిస్తారని తెలుస్తోంది. ఈ సమావేశాలు పూర్తి అయిన అనంతరమే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

ఈసారి కేసీఆర్ హాజరు


బీఆర్ఎస్ అధ్యక్షుడు, శాసన సభలో ప్రతిపక్ష నేత కేసీఆర్ ఈసారి సమావేశాలకు హాజరు కానున్నారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిర్వహించిన శాసన సభా సమావేశాల్లో ఒక్క రోజు మాత్రమే కేసీఆర్ పాల్గొన్నారు. 2024 జూలైలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు ఆయన సభకు వచ్చి వెళ్లిపోయారు. మళ్లీ ఇప్పుడు హాజరవుతున్నారు. అయితే, రెండు ప్రత్యేక రోజుల్లో మాత్రమే ఆయన సభకు హాజరవుతారని సమాచారం. గవర్నర్ ప్రసంగం ఉన్న బుధవారం, బడ్జెట్‌ను ప్రవేశపెట్టే 19వ తేదీన ఆయన సభకు వస్తారని సమాచారం. మిగతా రోజుల్లో సభకు వస్తే గవర్నర్ ప్రసంగంపైనో, బడ్జెట్‌పైనో, ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులపైనో మాట్లాడాలన్న డిమాండ్లు ఉంటాయి. ఇలాంటివాటికి దూరంగా ఉండాలంటే.. 12, 19 తేదీల్లో మాత్రమే సమావేశాలకు హాజరవుతారన్న చర్చ జరుగుతోంది.

డీలిమిటేషన్‌పై తీర్మానం ?

పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనపై ఈ సమావేశాల్లోనే తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలన్నది సర్కారు ఆలోచన. . 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్లను పెంచాలనుకుంటే.. తాము నష్టపోతామని, అందుకే... 1971 జనాభాల లెక్కలను ఆధారంగా చేసుకుని పునర్విభజన ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర వాదనను వివరిస్తూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.

కాంగ్రెస్ ప్రభుత్వానిది దివాలాకోరుతనం

- 7.5 లక్షల కోట్ల అప్పు ఉందని ఇప్పుడు తెలిసిందా..?..
- లక్షన్నర కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరడం హాస్యాస్పదం
- వైఫల్యాల నుంచి జనం దృష్టి మరల్చే యత్నం: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాన చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి వనరులకు తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఇన్ని నెలల తర్వాత రూ.1.5 లక్షల కోట్లు కావాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.3 లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందనుకున్నామని, ఇప్పుడు రూ.7.5 లక్షల కోట్లు ఉందని తెలిసిందని, అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని చెప్పడం.. రాహుల్, రేవంత్, కాంగ్రెస్ అసమర్థతకు అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రజల దృష్టిని మళ్లించడం కోసం ఇప్పుడు కేంద్రాన్ని డబ్బులు అడగటం దివాళాకోరుతనమని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా దేశ, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని తెలిపారు. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డును తప్పకుండా పూర్తి చేస్తామన్నారు. రైల్వే ప్రాజెక్టులకు ఇచ్చిన హామీ కంటే ఎక్కువ నిధులే కేటాయిస్తామని తెలిపారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పనులు 65 శాతం పూర్తయ్యాయని చెప్పారు. రూ.750 కోట్ల వరకు బడ్జెట్ పెరిగే అవకాశం ఉన్నా, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామని వెల్లడించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి భూమి పూజ చేసిన విషయం కూడా కాంగ్రెస్ ఎంపీలకు తెలియకుండా, దాని గురించి రైల్వే మంత్రికి మెమొరాండం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు.

'వూట్జ్.. ది ఫర్‌గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్' పుస్తకావిష్కరణ..

'వూట్జ్.. ది ఫర్‌గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్' పుస్తకాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు వేల ఏళ్ల కిందటే స్టీలు వంటి అద్భుతమైన లోహాల తయారీలో మన పూర్వీకులు ఎంతో ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు. స్టీలు కన్నా శక్తిమంతమైన లోహమైన 'వూట్జ్' గురించి ప్రపంచానికి తెలియజేసేందుకు రచయిత జై కిషన్ శ్రీ పెరంబుదూరు చేసిన కృషిని ప్రశంసించారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌లో ఈ లోహం ఒకప్పుడు అందుబాటులో ఉండేదని తన పరిశోధనలో వెల్లడైందని పుస్తకంలో పేర్కొన్నారని స్పష్టం చేశారు. ఈ లోహాన్ని వెలికితీసేందుకు జీఎస్ఐని ఆదేశిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

3000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.3000 కోట్ల అప్పు తీసుకున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 24 ఏళ్ల కాల పరిమితి, 7.23% వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 27 ఏళ్ల కాల పరిమితి, 7.23% వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 28 ఏళ్ల కాల పరిమితి, 7.23% వార్షిక వడ్డీతో రూ.1000 కోట్ల చొప్పున ఈ అప్పును తీసుకున్నది. రాష్ట్రంతో కలిపి దేశంలోని మొత్తం 20 రాష్ట్రాలు రూ.49,522 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

సింగరేణి థర్మల్ ప్లాంటుకు జాతీయ స్థాయి అవార్డు

జైపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నెట్ హీట్ రేట్(థర్మల్ పవర్ ప్లాంట్లలో ఒక కిలోవాట్-అవర్ విద్యుదుత్పత్తికి అవసరమయ్యే ఉష్ణం)ను తగ్గించడంలో మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)కు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు ఈ విషయాన్ని మంగళవారం వెల్లడించారు. "మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ వారు గోవాలో నిర్వహించిన నేషనల్ ఎఫీషియెన్సీ అవార్డు-2025ల కార్యక్రమంలో నెట్ హీట్ రేట్ కేటగిరిలో.. 1000మెగావాట్లు అంతకంటే ఎక్కువ సామర్థ్యం గల దక్షిణ భారత థర్మల్ పవర్ ప్లాంట్‌లలో ఎస్టీపీపీకి అవార్డు లభించింది" అని తెలిపారు. అవార్డును ఎస్టీపీపీ డీజీఎం(ఈ అండ్ ఎం) మహేందర్ కేంద్ర మాజీ మంత్రి సురేశ్ ప్రభు చేతుల మీదుగా అందుకున్నారు.

జోగులాంబ ఆలయ పూజారిపై విచారణకు మంత్రి సురేఖ ఆదేశం

హైదరాబాద్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ జోగుళాంబ ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మపై విచారణకు మంత్రి కొండా సురేఖ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తక్షణం విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు. హైదరాబాద్‌లో మంత్రిని అర్చకులు, స్వామీజీలు కలిసి అర్చకుడు ఆనంద్‌శర్మ, ఈవో పురేందర్ అవినీతిపై సమగ్ర విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరారు. అంతకు ముందు హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం ఎదుట వారంతా ఆందోళన చేశారు. శక్తిపీఠాల్లో ఒక పీఠమైన జోగుళాంబ ఆలయ పవిత్రతను కాపాడాలని కోరారు. ఆనంద్ శర్మపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా అతడిపై ఆరోపణలు వస్తున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ఆలయంలోని ఆభరణాల మాయం, పూజారి అవినీతిపై ప్రభుత్వ సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు బయట పడతాయని వారు అన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: ఆనంద్ శర్మ

అలంపూర్ ఆలయంలో అవినీతి, అక్రమాలు జరిగితే దానిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, అక్రమాలు నిజమని తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ అన్నారు. ఆలయంతో సంబంధంలేని వ్యక్తులు కొంతమంది ఆలయాన్ని అభాసుపాలు చేస్తున్నారని మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఒక వీడియోలో పేర్కొన్నారు.

నేడు పీజీఈసెట్-2025 నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పోస్టు గ్రాడ్యుయేషన్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పీజీఈసెట్)2025 నోటిఫికేషన్‌ను బుధవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు కన్వీనర్ డాక్టర్ ఎ. అరుణకుమారి తెలిపారు. ఈ నెల 17 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అర్హతలు, కోర్సులు, ఫీజులు.. తదితర వివరాల కోసం అభ్యర్థులు పీజీఈసెట్.టీజీసీహెచ్ఈ.ఏసీ.ఇన్ వెబ్ సైట్‌ను చూడాల్సిందిగా సూచించారు.

జైపూర్‌లో సింగరేణి మరో విద్యుత్ కేంద్రం

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఉన్న 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో 800 మెగావాట్లతో మరో ప్లాంట్ నిర్మించేందు సింగరేణి సిద్ధమవుతోంది. రూ.6,700 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం చేసుకుంది. గత ఫిబ్రవరిలోనే ఈ కాంట్రాక్ట్‌ను బీహెచ్ఈఎల్ దక్కించుకోగా.. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం ఒప్పంద పత్రాలపై సింగరేణి, బీహెచ్ఈఎల్ సంతకాలు చేశాయి. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ బలరామ్, బీహెచ్ఈఎల్ జీఎం పార్థ సారథి దాస్ పాల్గొన్నారు. నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలని ఒప్పందం ఉన్నప్పటికీ.. 40 నెలల్లోనే ప్లాంట్‌ను అందుబాటులోకి తేవాలని సింగరేణి సీఎండీ బలరామ్ స్పష్టం చేశారు.

చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం: తుమ్మల

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పవర్ టిల్లర్స్, పవర్ వీడర్, రోటోవేటర్లతో పాటు ట్రాక్టర్‌తో నడిపే పరికరాలు, తైవాన్ స్ప్రేయర్లు వంటి వ్యవసాయ పనిముట్లను రాయితీపై రైతులకు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంత్రి తుమ్మల సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని రైతులు, అధికారులు, శాస్త్రవేత్తలతో మాట్లాడారు. పసుపు రైతులకు నష్టం కలగకుండా పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల సంబంధిత అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం పసుపు రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి కృషి చేస్తోందన్నారు.

సీతారామ అంచనాలపై ప్యాకేజీల వారీ సమీక్ష

సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు సవరించిన అంచనాలను ప్రాథమిక స్థాయి నుంచి పరిశీలించాలంటూ మంత్రివర్గం ఇచ్చిన ఆదేశాలతో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రంగంలోకి దిగారు. ప్యాకేజీల వారీగా జరిగిన పనులను సమీక్షించనున్నారు. మంగళవారం జలసౌధలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఇప్పటిదాకా ఏయే కాంపోనెంట్‌ల పనులు జరిగాయో... వాటి వీడియోలు, ఫొటోలతో పాటు ప్యాకేజీల వారీగా జరిగిన పనులు, మిగిలిన ఉన్న పనులకు సంబంధించిన వివరాలు అందించాలని రామకృష్ణారావు ఆదేశించారు.

ప్రభుత్వ ఉద్యోగం కోసం భర్తను హత్య చేసిన భార్య

- నల్లగొండలో ఘటన..

నల్లగొండ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం కోసం కట్టుకున్న భర్తను కడతేర్చిందో భార్య. ఈ ఘటన నల్లగొండలోని ఉస్మాన్‌పురాలో గత నెల 24న జరిగింది. ఈ కేసును ఛేదించిన పోలీసులు దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం వెల్లడించారు. నల్లగొండ ఉస్మాన్‌పురంలో నివసిస్తున్న మహ్మద్ ఖలీల్ హుస్సేన్ (44) కనగల్ మండలం చర్లగౌరారం జడ్పీ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్నారు. హుస్సేన్ మానసికంగా ఇబ్బందులు పడుతుండడంతో వైద్యుడిని సంప్రదించి మందులు వాడుతున్నారు. హుస్సేన్ చనిపోతే ఉద్యోగం తనకుగాని, పిల్లలకు గాని వస్తుందని ఎలాగైనా అతడిని హతమార్చాలని నిశ్చయించుకున్న ఆయన భార్య అక్సర్ జహా గత నెల 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఖురాన్ గ్రంథం పెట్టే స్టాండ్‌తో ఆయన్ను బలంగా కొట్టింది. అనంతరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి నామమాత్రంగా చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లింది. అదే రోజు రాత్రి పరిస్థితి విషమించడంతో హుస్సేన్‌ను నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు చెప్పారు. ఈ ఘటనపై అనుమానం ఉందని ఫిబ్రవరి 25న హుస్సేన్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేసిన పోలీసులు హుస్సేన్ భార్య అక్సర్ జహానే ఆయన్ను చంపినట్లు నిర్ధారించారు. ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం

(మొదటిపేజీ తరువాయి)

స్వయం ఉపాధి పథకాలను అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖలు సీఎం వద్ద, బీసీ సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్ వద్ద ఉన్నాయని తెలిపారు. యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో వారు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారన్నారు. ఇప్పటికే టీజీపీఎస్సీ ద్వారా ఉద్యోగాలను భర్తీ చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని, ఇంకా మిగిలిపోయిన వారికి స్వయం ఉపాధి పథకాలను అందించాలని నిర్ణయించామని చెప్పారు. అందులో భాగంగానే రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకం కిందో ఒక్కో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగికి రూ.3 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. రాష్ట్రంలోని 5 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సాయం అందిస్తామని చెప్పారు. ఇందుకోసం రూ.6000 కోట్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఒక్కొక్కరికి అందించే ఆర్థిక సహాయంలో బ్యాంకు లింకేజీ ఉంటుందన్నారు. రూ.3 లక్షలు పూర్తిగా సబ్సిడీనా? బ్యాంకు రుణమా? ఎంత శాతం సబ్సిడీ? అనే వివరాలను త్వరలో వెల్లడిస్తామని భట్టి చెప్పారు. విధివిధానాలు, లబ్ధిదారుల అర్హతలు వంటి వివరాలను కూడా ప్రకటిస్తామన్నారు. లబ్ధిదారుల వయసు 55 ఏళ్లకు మించి ఉండరాదని తెలిపారు. పథకానికి సంబంధించి ఈ నెల 15న నోటిఫికేషన్ జారీ చేస్తామని, ఏప్రిల్ 5 వరకు నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న స్వయం ఉపాధి పథకాల మంజూరు పత్రాలను అందజేస్తామని తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న భట్టి

చాకలి ఐలమ్మ వర్సిటీకి రూ.540 కోట్లు

చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో భవనాల నిర్మాణానికి రూ.540 కోట్లను కేటాయించినట్లు భట్టి తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత యూనివర్సిటీ ప్రధాన ద్వారాన్ని తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలోని వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు రూ.15.5 కోట్లు, నూతన భవన నిర్మాణాలకు రూ.100 కోట్లను తక్షణమే విడుదల చేస్తామని చెప్పారు.

2 నెలల్లో ఆర్ఆర్ఆర్ పనులు

కేంద్ర మంత్రి గడ్కరీ హామీ.. రాష్ట్ర రహదారుల అభివృద్ధిపై గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ

న్యూఢిల్లీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు సంబంధించిన పెండింగ్ అంశాలను పూర్తిచేసి, పనులను ప్రారంభించేలా చూస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, రామ్మోహన్ నాయుడులను వేర్వేరుగా కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. ఆయా పనులను వేగవంతం చేయాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..భేటీల వివరాలను వెల్లడించారు. ఆర్ఆర్ఆర్‌కు కేంద్ర మంత్రివర్గ ఆమోదం లభించేలా చూడాలని గడ్కరీని కోరినట్లు వివరించారు. "ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి గత ఏడాది డిసెంబరు 27న రూ.7,100 కోట్లతో ఐదు ప్యాకేజీలుగా టెండర్లను పిలిచారు. అటవీ అనుమతులను వేగవంతం చేయాలని, ఆర్థిక త్రైపాక్షిక ఒప్పందంపై సంతకం చేయాలని గడ్కరీని కోరాం. చౌటుప్పల్-అమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి మీదుగా నిర్మిస్తున్న దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను ఖరారు చేయాలని విన్నవించాం" అని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్

"హైదరాబాద్-శ్రీశైలం 187 కిలోమీటర్ల రహదారిలో అమ్రాబాద్ పులుల అభయారణ్యం మీదుగా 62 కిలోమీటర్ల ఎలివేటెడెట్ కారిడార్ నిర్మించాలి. అటవీ ప్రాంతం కావడంతో అనుమతుల్లేక ఈ ప్రాంతంలో అభివృద్ధి జరగలేదు. ఈ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలివేటెడ్ కారిడార్ సౌకర్యవంతంగా ఉంటుంది" అని గడ్కరీని కోమటిరెడ్డి కోరారు. ఎలివేటెడ్ కారిడార్‌తోపాటు.. సోమశిల కేబుల్ బ్రిడ్జికి టెండర్లను ఆహ్వానించేందుకు గడ్కరీ సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. "పర్వతమాల కింద తెలంగాణకు ఎటువంటి ప్రాజెక్టులు లేవు. ఈ నేపథ్యంలో.. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి రెండు కిలోమీటర్లు, భువనగిరి కోటకు కిలోమీటరు, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండకు రెండు కిలోమీటర్లు, నాగార్జునసాగర్ ఆనకట్ట మీదుగా నాగార్జునకొండను కలుపుతూ ఐదు కిలోమీటర్లు, మంథనిలోని రామగిరి కోటకు రెండు కిలోమీటర్ల రోప్‌వే ప్రాజెక్టులను మంజూరు చేయాలి" అంటూ కేంద్ర మంత్రికి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సీఆర్ఐఎఫ్-సేతుబంధు పథకం కింద రూ.887.45 కోట్ల విలువైన 12 రహదారి పనులను మంజూరు చేయాలని, దీనిపై గత ఏడాది జూన్ 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాశారని కోమటిరెడ్డి గుర్తుచేశారు. అవి పెండింగ్‌లోనే ఉన్నాయని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో సేతుబంధన్ పథకం కింద ప్రతిపాదిత 12 ప్రాజెక్టులు మంజూరు చేయాలని గడ్కరీని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య కీలకమైన జాతీయ రహదారి ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ విపరీతంగా ఉందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దానిని ఆరులేన్లుగా విస్తరించాలని కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి గడ్కరీ స్పందిస్తూ.. రెండు ప్యాకేజీలుగా మచిలీపట్నం వరకు ఈ రహదారిని విస్తరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయం మంజూరు చేయడంపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భూసేకరణ కోసం రూ.205 కోట్లను మంజూరు చేశామని వివరించారు. 15 రోజుల్లో భూసేకరణ పూర్తవుతుందని చెప్పారు. రెండున్నరేళ్లలో విమానాశ్రయాన్ని పూర్తిచేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని వెంకటరెడ్డి తెలిపారు.


కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిసిన మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు

కేసీఆర్‌పై విమర్శలు

మంత్రి కోమటిరెడ్డి విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. అనర్హత వేటు పడుతుందనే భయంతోనే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రావాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అనేది గతం అని.. బ్రహ్మదేవుడు దిగి వచ్చినా.. ఆ పార్టీని కాపాడలేరన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తానని కేసీఆర్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "కేసీఆర్ ఒక అంశాన్ని ఎత్తి చూపితే.. మేం పది అంశాలను సభ ముందు పెడతాం. దళిత ముఖ్యమంత్రి మొదలు.. ఎన్నో హామీలను కేసీఆర్ గంగలో కలిపేశారు. అసెంబ్లీలో వాటన్నింటినీ ఎండగడతాం" అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలవాలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారని, ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అభ్యర్థులను నిలబెట్టకుండా.. బీజేపీకి ఓట్లు వేయించారని మండిపడ్డారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని.. మరో పదేళ్లు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సీఎం మార్పు అనేది అసత్య ప్రచారమన్నారు.

గిరిజన విశ్వవిద్యాలయం

తొలి వీసీగా ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు



హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి వైస్‌చాన్సలర్‌గా ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఐదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ఈయన విద్య, పరిపాలన రంగంలో విశేష అనుభవం గడించారు. 1992లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరిన వై.ఎల్. ఓయూ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్‌తో పాటు ఓయూ మహిళా కళాశాలలో పనిచేశారు. 2019 నుంచి 2021 వరకు ఓయూ ఇంగ్లీష్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆ తర్వాత ఇంగ్లీషు విభాగం అధిపతిగా పని చేశారు. 2021 డిసెంబరులో ఇఫ్లు(ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ)లో చేరిన వై.ఎల్. స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్, ఇంగ్లీషు లిటరేచర్ విభాగంలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా, ఆరోరా ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అకాడమీలో వైస్‌చాన్సలర్‌గా ఆయన ప్రస్తుతం కొనసాగుతున్నారు. శాతవాహన, పాలమూరు విశ్వవిద్యాలయాల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గాను బాధ్యతలు నిర్వర్తించారు. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్)కు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగాను పనిచేశారు. వీసీగా నియమితులైన ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం గిరిజన విశ్వవిద్యాలయం పురోభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

బట్ట కాల్చి మీద వెయ్యడం కాదు వాస్తవాలు మాట్లాడాలి

- టీడీఆర్ మొదలుపెట్టిందే కేటీఆర్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఉప్పల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అభివృద్ధి బదలాయింపు హక్కులు(టీడీఆర్) అంశంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీవ్రంగా స్పందించారు. బట్ట కాల్చి మీద వెయ్యడం కాదనీ, కేటీఆర్ వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు. ఉప్పల్ నియోజకవర్గంలో సుమారు రూ.50 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీఆర్, ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ)లతో సీఎం రేవంత్‌రెడ్డి భారీ కుంభకోణానికి కుట్ర పన్నుతున్నారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఎదురైన ప్రశ్నకు శ్రీధర్‌బాబు బదులిచ్చారు. కేటీఆర్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, ఏదో బట్టకాల్చి తమపై వెయ్యడం వివేకం అనిపించుకోదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే టీడీఆర్‌ను ఆసరాగా చేసుకొని బాగుపడిన విషయాన్ని కేటీఆర్ మరిచిపోయారా? అంటూ ప్రశ్నించారు. టీడీఆర్ మొదలుపెట్టింది మీరే!అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి చెప్పారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమంపై దృష్టి సారిస్తూనే దివాలా తీసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని శ్రీధర్ బాబు వివరించారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి ఆశయం మేరకు హైదరాబాద్‌ను ఒక విశ్వనగరంగా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అందులో భాగంగానే మూసీ ప్రక్షాళన చేపట్టామని తెలిపారు. ఉప్పల్ ప్రాంతంలో రూ.101 కోట్లతో చేపట్టబోయే ఎస్ఎన్‌డీపీకి పనులను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వచ్చే నెలలో ప్రారంభించే ఆలోచన చేస్తున్నామని ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఉప్పల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కాగా, మంత్రి శ్రీధర్‌బాబు ఉప్పల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా రామంతాపూర్‌లో ఓ శిలాఫలకం ఆవిష్కరణ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అనుచరులు, స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు జై కాంగ్రెస్, జై బీఆర్ఎస్ అంటూ పోటాపోటీ నినాదాలు చేయడంతో పోలీసులు కలుగజేసుకున్నారు.

హామీల అమలులో జాప్యం ఆర్థిక పరిస్థితి బాగాలేకనే



- ఇబ్బందులున్నా హామీలన్నీ నెరవేరుస్తున్నాం
- నెలాఖరులోగా అందరికీ రైతుభరోసా
- కొందరికి రుణమాఫీ జరగాల్సిన మాట వాస్తవమే: పొంగులేటి

వైరా/నేలకొండపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉందని, అందువల్లే హామీల అమలులో జాప్యం జరుగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురంలో పైలట్ ప్రాజెక్టుగా రూ.5.45 కోట్లతో నిర్మించనున్న 109 ఇందిరమ్మ గృహాలకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామంలోనూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా సాయాన్ని ఈ నెలాఖరులోగా పూర్తిగా చెల్లిస్తామన్నారు. కొందరికి ఇంకా రుణమాఫీ అందని మాట వాస్తవమేనని, ఆ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ.7.19 లక్షల కోట్ల మేర అప్పుల పాలు చేశారని ఆరోపించారు. ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తూనే తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కేవలం మూడు నెలల్లోనే రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. 2004- 2014 కాలంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి ఏపీలో 23 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిందని చెప్పారు. ఆ తరువాత కేసీఆర్ పదేళ్లలో 1.5 లక్షల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మాత్రమే మొదలుపెట్టారని, వాటిని కూడా పూర్తి చేయకుండా వదిలేశారని ఆరోపించారు. ప్రస్తుత తమ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 4.16 లక్షల పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందన్నారు. కళ్లుండి చూడలేని కబోదిలా కేసీఆర్, కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ గాండ్రింపులకు భయపడేవారు ఎవరూ లేరన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు తమ సమీపంలోని ఏర్లు, వాగుల నుంచి ఇసుక తోలుకుంటే ఎలాంటి ఇబ్బందులు పెట్టొద్దని పోలీసుశాఖను మంత్రి పొంగులేటి ఆదేశించారు.

పాత ఫోన్లు అమ్మేస్తున్నారా? తస్మాత్ జాగ్రత్త!!

- వాటి సాయంతో సైబర్ మోసాలు
- ఆదిలాబాద్‌లో బిహార్ ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు
- ఐదుగురి అరెస్టు.. సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాల స్వాధీనం
- పరారీలో గ్యాంగ్ లీడర్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పాత ఫోన్లు అమ్మేస్తున్నారా? తస్మాత్ జాగ్రత్త..!! అంటున్నారు పోలీసులు. పాత ఫోన్లు కొంటాం.. పాత ఫోన్లకు టిఫిన్ బాక్సులు, గృహోపకరణ వస్తువులు ఇస్తాం అంటూ.. వచ్చే అపరిచితులకు మీ పాత ఫోన్లను ఇచ్చేస్తే.. మీరు ఇరకాటంలో పడినట్లే..! ఆదిలాబాద్‌లో ఓ ముఠా ఇలా పాత సెల్‌ఫోన్లు కొంటామని ద్విచక్రవాహనాలపై సంచరిస్తుండగా.. టూ టౌన్ పోలీసులు అనుమానంతో పట్టుకున్నారు. వీరు పాత సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులను సేకరించి వాటితో భారీగా సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈమేరకు ఆదిలాబాద్‌లోని ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలను వెల్లడించారు. బిహార్‌కు చెందిన తబరక్, మహ్మద్ మేరాజులు, మహబూబ్ అలం, మహ్మద్ జమల్, ఎండీ ఉజీర్, అబ్దుల్లా ముఠాగా ఏర్పడి సైబర్ నేరాలకు పాల్పడడానికి పక్కాగా ప్లాన్ వేసుకున్నారు. ఇందులో భాగంగా తబరక్ మినహా విగతా ఐదుగురు గ్రామాల్లో తిరుగుతూ జనం దగ్గర పాత సెల్‌ఫోన్లను సేకరించి వాటి స్థానంలో టిఫిన్ బాక్సులను అందిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీలో ఇటీవల ఈ ముఠా సభ్యులు పాత సెల్‌ఫోన్లు కొంటామని సంచరించారు. అనుమానంతో పోలీసులు వారిని ప్రశ్నించగా అసలు విషయం వెలుగు చూసింది. ఆ తర్వాత ఈ ముఠా సభ్యులను విచారించి ఇప్పటికే కర్ణాటకలో 12 వేల సెల్‌ఫోన్లను సేకరించి సైబర్ నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. సేకరించిన సెల్‌ఫోన్లు, సిమ్ కార్డ్‌లను ఉపయోగించి ఉద్యోగాలు ఇస్తామని, మరికొందరికి లాటరీ తగిలిందని, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని ఫోన్లు చేస్తారు. ఇలా ఓటీపీ నెంబర్లు సేకరించి భారీ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా వీరిని పట్టుకున్నారని ఎస్పీ తెలిపారు. వీరిలో ఏ-వన్ నిందితుడు తబరక్ పరారీలో ఉండగా.. మిగతా ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 2,125 పాత సెల్‌ఫోన్లు, 107 సిమ్ కార్డులు, బిహార్‌కి చెందిన ఐదు ద్విచక్రవాహనాలు, 800 సెల్‌ఫోన్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు.


స్వాధీనం చేసుకున్న ఫోన్లను మీడియాకు చూపుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ

విపక్షాల అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలి

- కొత్త ఎమ్మెల్సీ అభ్యర్థులను సన్మానించిన మహేష్‌కుమార్ గౌడ్
- కేసీఆర్‌కు వేతనాన్ని ఆపేయాలి: కాంగ్రెస్

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ఎండగట్టి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేయడంలో ముందుండాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నూతన ఎమ్మెల్సీ అభ్యర్థులకు సూచించారు. మంగళవారం హైదర్‌గూడ ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్, సీపీఐ నూతన ఎమ్మెల్సీ అభ్యర్థులు అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి, నెల్లికంటి సత్యంలు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన ఘనంగా సన్మానించి మాట్లాడారు. మిత్ర పక్షంగా సీపీఐకి సంపూర్ణ సహకారం అందించామని, ఇదే మైత్రి కొనసాగాలని ఆ పార్టీకి సూచించారు. ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించడంలో కేసీఆర్ విఫలమయ్యారని, ఆయనకు చెల్లించే వేతనాన్ని నిలిపివేయాలని పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ పక్ష నాయకులు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి అల్లం భాస్కర్, పీసీసీ ఎస్టీ సెల్ నాయకులు జగన్‌లాల్ తదితరులు శాసనసభలో స్పీకర్ ప్రసాదరావును కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ, మోదీకి కేసీఆర్ కోవర్టుగా పనిచేసున్నారని విప్ ఆదిశ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో గత పదేళ్లలో సాధ్యం కాని గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు కాంగ్రెస్ హయాంలోనే భర్తీ కానున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గాంధీభవన్‌లో చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనే ఉద్యోగాల భర్తీ సాధ్యమని చెప్పారు. అబద్ధాలు చెబుతూ వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకోవడంలో కేసీఆర్‌తో సరిపోయే వ్యక్తులెవరూ లేరని పీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు.

కాలం మార్చిన రంగులు



వర్షాకాలంలో పచ్చదనంతో కనులవిందు చేసిన ఆ చెట్లు నేడు తలవాల్చాయి. వాన నీటిని ముద్దాడి మట్టి సువాసన వెదజల్లిన అదే భూమి నేడు వేసవిలో దాహార్తితో చిట్లిపోయింది. నిర్మల్ - ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దులోని సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో తీసిన ఈ చిత్రాలు చూస్తుంటే.. ఏదీ శాశ్వతం కాదు.. కాలంతోపాటు అన్నీ మారతాయి.. అనే మాటలకు నిదర్శనంగా ఉన్నాయి కదా....!! వాన చినుకు తాకగానే ఆ ప్రాంతం నేలకు పచ్చని చీర కట్టినట్టు ఆహ్లాదపరిచే మునుపటి అందాన్ని సొంతం చేసుకోవడం ఖాయం.. అలాగే, ప్రస్తుతం కష్టకాలంలో ఉన్నవారు కాస్త ఓపికగా ఉంటే తిరిగి సుఖసంతోషాలు పొందడం కూడా అంతే ఖాయం. ఇదే ప్రకృతి నుంచి మనిషి నేర్చుకోవాల్సిన పాఠం.

-ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



లిఫ్ట్ వచ్చింది అనుకుని అడుగు వేసి జారిపడి...
సిరిసిల్ల బెటాలియన్ కమాండెంట్ మృతి



తోట గంగారాం(ఫైల్)

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య సిరిసిల్ల 17వ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం(59) ప్రాణం తీసింది. సిరిసిల్లలోని వెంకట్రావునగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉండే తన స్నేహితుడు, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి నివాసానికి గంగారాం సోమవారం రాత్రి వెళ్లారు. ఆయనతో కాసేపు మాట్లాడిన తర్వాత రాత్రి 10.30 గంటలప్పుడు మూడో అంతస్థులోని ఆ ఇంటి నుంచి బయటకు వచ్చి కిందకి వెళ్లేందుకు లిఫ్ట్ స్విచ్ నొక్కారు. సేఫ్టీ డోర్ తెరుచుకోవడంతో లిఫ్ట్‌లోకి వెళ్లేందుకు ఆయన ముందుకు అడుగు వేశారు. కానీ లిఫ్ట్ రాకపోవడంతో గంగారాం అక్కడి నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్ హౌస్ కంపార్ట్‌మెంట్‌పై పడి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు, అగ్నిమాపక సిబ్బంది కలిసి ఆయనను బయటకు తీసి ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయారు.

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి

» అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ముగ్గురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి ధూల్‌పేట, మంగళ్‌హాట్ పరిధిలో విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించారు సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.11.30 లక్షల విలువైన 30.70కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ యాసిన్ బతుకుదెరువుకోసం హైదరాబాద్‌కు వచ్చాడు. ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి స్మగ్లింగ్ చేసి డబ్బులు సంపాదించాలనుకున్నాడు. తనకు పరిచయం ఉన్న ఒడిశాకు చెందిన గోపాల్, ఉత్తమ్‌తో ఇదే విషయం చెప్పాడు. ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పాడ్డారు. ఈ ముగ్గురు ఇటీవల ఒడిశా రాయగడలోని విక్కీ దగ్గర 30.70 కిలోల గంజాయిని కొని కారులో హైదరాబాద్‌కు తరలించారు. అయితే, యాసిన్ అద్దెకు ఉండే ఇంట్లో గంజాయి నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. గంజాయిని స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

కళాశాలకు డుమ్మా కొట్టి కారులో చక్కర్లు

» మితిమీరిన వేగంతో వెళ్లి డివైడర్‌కు ఢీ..ఓ విద్యార్థి మృతి

నార్సింగ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు డుమ్మాకొట్టి కారులో చక్కర్లు కొడుతున్న ఆ విద్యార్థులు అనుకొని ప్రమాదానికి లోనయ్యారు. మితిమీరిన వేగంతో వెళ్లి డివైడర్‌ను ఢీ కొట్టి వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపారు. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన మంగళవారం హైదరాబాద్ శివారు కోకాపేటలో జరిగింది. గండిపేటలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థులు హేమసాయిరెడ్డి, గుర్రం వివేకరెడ్డి, హర్షవర్ధన్, శ్రీకర్ (18), సృజన్, కార్తికేయ మంగళవారం కళాశాలకు వెళ్లకుండా కారులో నియోపోలీస్ కోకాపేట గుట్టపై చక్కర్లు కొడుతున్నారు. రోడ్లు విశాలంగా ఉండడం, ట్రాఫిక్ లేకపోవడంతో వేగంగా వెళుతూ అదుపుతప్పి డివైడర్‌ను గట్టిగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీకర్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా ఐదుగురు గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వీరిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. గాయపడిన విద్యార్థుల్లో హేమసాయి పరిస్థితి విషమంగా ఉండడంతో, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మృతి చెందిన శ్రీకర్ స్వస్థలం ఏపీలోని గుంటూరని పోలీసులు తెలిపారు.

ఇన్నేళ్ల నిరీక్షణ తర్వాత మాకు న్యాయం

» ప్రణయ్ హత్య కేసు తీర్పుపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అమృత



అమృత

నల్లగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో సోమవారం నల్లగొండ కోర్టు వెలువరించిన తీర్పుపై అమృత తొలిసారి స్పందించారు. ఇన్నేళ్ల నిరీక్షణ తర్వాత తమకు న్యాయం జరిగిందని ఆమె మంగళవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పేర్కొన్నారు. ఈ తీర్పుతోనైనా పరువు పేరిట జరిగే దారుణాలు ఆగుతాయని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రయాణంలో తమకు అండగా నిలిచిన పోలీసులు, న్యాయవాదులు, మీడియాకు ఆమె ధన్యవాదా లు తెలిపారు. తన బిడ్డ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే తాను మీడియా ముందుకు రాలేకపోయానని, దయతో తమను అర్థం చేసుకోవాలని అమృత విజ్ఞప్తి చేశారు. రెస్ట్ ఇన్ పీస్ ప్రణయ్ అంటూ ఆమె పోస్ట్‌ను ముగించారు.



కాళ్లకు సంకెళ్లతో బోధన్ పోలీసు స్టేషన్‌ను ఊడుస్తున్న బైక్ చోరీ నిందితుడు

కాళ్లకు సంకెళ్లు వేసి... స్టేషన్‌ను ఊడిపించి

» చోరీ కేసు నిందితుడిపై బోధన్ పోలీసుల కాఠిన్యం

బోధన్‌రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో అరెస్టయిన ఓ నిందితుడిపై బోధన్ పోలీసులు తమ కాఠిన్యాన్ని ప్రదర్శించారు. నిందితుడి కాళ్లకు సంకెళ్లు వేసి, చీపురుతో స్టేషన్‌ను ఊడిపించారు. ఈ ఘటనను స్టేషన్‌కు వెళ్లిన కొందరు వ్యక్తులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ద్విచక్ర వాహనాల చోరీ కేసులో బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన ఓ యువకుడిని విచారణ నిమిత్తం పోలీసులు గత సోమవారం స్టేషన్‌కు తీసుకువచ్చారు. బైక్‌లు చోరీ చేసినట్టు యువకుడు ఒప్పుకోవడంతో సోమవారం రాత్రి పారిపోతాడేమోననే ఉద్దేశంతో పోలీసులు అతని కాళ్లకు బేడీలు వేశారు. మంగళవారం ఉదయం నిద్రలేచిన నిందితుడిని అక్కడి పరిసరాలను శుభ్రం చేయాలని హెడ్ కానిస్టేబుల్ ఆదేశించారు. దీంతో కాళ్లకు సంకెళ్లతోనే అతడు స్టేషన్ ప్రాంగణాన్ని ఊడిచాడు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టినట్టు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

పాతికేళ్లకే కిడ్నీలు కుదేలు..!

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు 20-30 ఏళ్ల వారు ఈ సమస్యతో ఎక్కువగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. నిమ్స్ ఆస్పత్రి చేసిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. కిడ్నీలు విఫలమవడం, క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)పై నిమ్స్ ఆస్పత్రి పలు అంతర్జాతీయ సంస్థలతో కలిసి పరిశోధన చేస్తోంది. పదేళ్ల క్రితం మూత్ర పిండాల సమస్యలతో బాధపడే కేసులు నెలకు సగటున 5-10 వస్తే.. ప్రస్తుతం ఆ సంఖ్య 50కు పైగానే ఉంటున్నట్లు నిమ్స్ రిసెర్చ్ చెబుతోంది. ఇక ఏటా కొత్తగా రక్తశుద్ధి (డయాలసిస్) అవసరమయ్యే వారి సంఖ్య 3500 వరకు ఉంటున్నట్లు పేర్కొంది.

బీపీ,షుగర్.. నొప్పి నివారణ మందులతో

మారుతున్న జీవనశైలితో ఎక్కువ మంది అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం బారినపడుతున్నారు. మధుమేహం సోకి, సరిగా మందులు వాడని వారిలో మూడు నాలుగేళ్లకే కిడ్నీలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వైద్యులు చెబుతున్నారు. షుగర్ సోకినా, ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనిపించకపోవడంతో తమకేం కాదన్న భావనతో నిర్లక్ష్యం చేస్తున్నారని, చివరి దశలో ఆస్పత్రికి వస్తున్నారని అంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో తీవ్రమైన పని ఒత్తిడుల కారణంగా బీపీ, షుగర్ బారిన పడి, కిడ్నీలు పాడు చేసుకుంటున్నారని చెబుతున్నారు. ఇక పల్లెల్లో శారీరక శ్రమ ఎక్కువగా ఉండడంతో నొప్పులు తగ్గించే మాత్రలు ఎక్కువగా వాడుతున్నారని.. దీర్ఘకాలంలో అవి కిడ్నీలను దెబ్బ తీస్తున్నాయని నిమ్స్ నెఫ్రాలజిస్ట్ తాడూరి గంగాధర్ తెలిపారు. రాష్ట్రంలో గత పదేళ్లుగా సీకేడీ, కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు పెరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా ఆడవారిలో కంటే మగవారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటున్నట్లు డయాలసిస్ నివేదికలు చెబుతున్నాయి. ముఖ్యంగా 20-30 ఏళ్ల



పురుషుల్లో ఇటీవల కాలంలో ఐజీఏ నెఫ్రోపతి కేసులు పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఐజీఏ నెఫ్రోపతి ఒక రకమైన మూత్రపిండ వ్యాధి. కిడ్నీల్లో యాంటీబాడీలు ఏర్పడి మూత్రపిండాల్లో ఉండే చిన్నచిన్న ఫిల్టర్ల (గ్లోమెరులి)కు నష్టం కలిగిస్తాయి. ఫిల్టర్లు సాధారణంగా రక్తం నుంచి వ్యర్థాలను, అదనపు నీటిని వడపోసి మూత్రాశయానికి పంపుతాయి. ఐజీఏ ప్రొటీన్ ఈ వడపోతను నిరోధిస్తుంది. దాంతో కిడ్నీ జబ్బులు, కొన్నిసార్లు మూత్ర పిండాల వైఫల్యానికి దారితీస్తుంది. ఇక మహిళల్లో లూపస్ నెఫ్రోసిస్ కేసులు పెరుగుతున్నాయి. ఇది ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. మన శరీర కణాలు, అవయవాలపై రోగనిరోధక వ్యవస్థనే దాడి చేస్తుంది. లూపస్ వల్ల కలిగే మూత్రపిండ వ్యాధి కాలక్రమేణా తీవ్రమవుతుంది. కిడ్నీ వైఫల్యానికి దారి తీస్తుందని నెఫ్రాలజిస్టులు చెబుతున్నారు. లూపస్ నెఫ్రోటిస్ వల్ల ఆడవారిలో మూత్రంలో ఎక్కువగా ప్రొటీన్ పోతుందని, జుట్టు రాలిపోవడం, శరీరమంతా వాచినట్లుగా లక్షణాలు కనిపిస్తాయని పేర్కొంటున్నారు. కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్న వారికి అవయవ మార్పిడి తప్పనిసరి. మూత్రపిండాలు అందుబాటులో లేకుంటే రక్తశుద్ధి ఒక్కటే మార్గం. తెలంగాణలో 2013-24 మధ్య కాలంలో 2235 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయి. కిడ్నీ కోసం జీవన్‌దాన్‌లో 7796 మంది రిజిస్ట్రేషన్ చేసుకొని, ఎదురుచూస్తున్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణ ప్రాంతంలో 5436 మంది బాధితులు డయాలసిస్ చేసుకుంటుండగా.. 2024 నాటికి ఈ సంఖ్య 1,11,121కు చేరింది. ఇక డయాలసిస్ బాధితులు ఏటా 2 వేల మంది వరకు మరణిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ పదేళ్లలో డయాలసిస్ కోసం ప్రభుత్వం ఏకంగా రూ.1076 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 108 రక్తశుద్ధి కేంద్రాలున్నాయి. వాటిలో 730 డయాలసిస్ పరికరాలున్నాయి. 2014 నుంచి నేటి వరకు మొత్తం 75 లక్షల డయాలసిస్ సెషన్స్ చేసినట్లు ఆరోగ్య శ్రీ గణాంకాలు చెబుతున్నాయి.

పిల్లల్లోనూ కేసులు పెరుగుతున్నాయి



కిడ్నీ జబ్బుల్లో పెద్ద మార్పు వచ్చింది. పిల్లల్లోనూ కేసులు పెరుగుతున్నాయి. నెలలు నిండకుండా పుట్టడం, కిడ్నీ ఆకారంలో తేడాలుండడం, జన్యుపరమైన సమస్యల వల్ల పిల్లల్లో సీకేడీ, కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. జీవనశైలి ఒత్తిడి కారణంగా పాతికేళ్లకే బీపీ, షుగర్ బారిన పడి బాధితులుగా మారుతున్నారు. పెరుగుతున్న కిడ్నీ జబ్బుల తీరుపై అంతర్జాతీయ సంస్థలతో కలిసి నిమ్స్ పరిశోధన చేస్తోంది. కిడ్నీ జబ్బులకు ఔషధాలు అందుబాటులో ఉన్నప్పటికీ, రోగాన్ని పూర్తిగా నయం చేసే పరిస్థితి లేదు. మందులు రోగి జీవితకాలాన్ని పెంచుతాయి.

- డాక్టర్ శ్రీభూషణ్ రాజు, నెఫ్రాలజిస్టు, నిమ్స్ ఆస్పత్రి

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లోకి రోబోలు

» రంగంలోకి మొత్తం నాలుగు రోబోలు


» షీర్‌జోన్‌లో సహాయక చర్యల కోసం..

మహబూబ్‌నగర్/అచ్చంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యల కోసం రోబోలను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సొరంగం కూలిన షీర్ జోన్ ప్రాంతంలో పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది. గల్లంతైన వారిలో కొంత మంది అక్కడ ఇరుక్కొని ఉంటారని సహాయక బృందాలు అంచనా వేస్తున్నాయి. అయితే రెస్క్యూ బృందాలు లేదా యంత్రాలు అక్కడికి వెళ్లి తవ్వకాలు జరిపితే మళ్లీ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆ ప్రాంతంలో రోబోలను వినియోగించాలని నిర్ణయించారు. అందుకోసం రూ.4 కోట్లు మంజూరు చేశారు. హైదరాబాద్‌కు చెందిన అన్వీ రొబోటిక్స్ ఈ బాధ్యతలను తీసుకుంది. మంగళవారం సంస్థ ప్రతినిధులు ఒక మదర్ రోబోను తీసుకొచ్చారు. కమ్యూనికేషన్, నావిగేషన్ తదితర ఏర్పాట్లు చేసుకునేందుకు ఆ రోబోను లోపలికి తీసుకెళ్లారు. బుధవారం ఉదయం వరకు మరో మూడు రోబోలు టన్నెల్‌కు చేరుకోనున్నాయి. మదర్ రోబో మిగతా రోబోలతో సమన్వయం చేసుకుంటుంది. మిగిలిన మూడు రోబోల్లో ఒకటి బండ రాళ్లను తుక్కు చేసి బయటకు తరలిస్తుంది. మరొకటి గట్టిగా ఉన్న మట్టిని తవ్వుతుంది. ఇంకొకటి బురదను బయటకు తీసి పంపిస్తుంది. అక్కడ ఏదైనా ప్రమాదం జరిగే పరిస్థితి ఉంటే మదర్ రోబో గుర్తిస్తుంది. టన్నెల్‌లో డీ1, డీ2 ప్రాంతంలో తవ్వకాలు సాగుతుండగా మరోసారి క్యాడవర్ డాగ్స్‌ను లోపలకు తీసుకెళ్లి పరిశీలన చేశారు. డీ2 ప్రాంతంలో తవ్వకాలు దాదాపు పూర్తి కాగా అక్కడి నుంచి డీ1కు గుంత తవ్వుతున్నారు. డీ1 దగ్గర బుధవారం వరకు కార్మికుల జాడ లభించే అవకాశం ఉంది.

ఎంతమంది పిల్లల్ని కన్నా ప్రసూతి సెలవులిస్తాం

» ఎక్కువ మంది ఉంటే ఎక్కువ సంక్షేమం

» దక్షిణ భారతంలో జననాల రేటు తగ్గుతోంది: చంద్రబాబు



అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఎంత ఎక్కువ మంది ఉంటే అంత ఎక్కువ సంక్షేమం అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు జనాభా నియంత్రణ అవసరమని చెప్పామని, కానీ ఇప్పుడు జనాభాను పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ముఖ్యంగా దక్షిణ భారతంలో జననాల రేటు తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన 'పాపులేషన్ డైనమిక్స్ సదస్సు'లో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభా తగ్గిపోతే చట్టసభల్లో మన సీట్లు కూడా తగ్గుతాయని, అయితే సీట్ల కంటే దేశమే ముఖ్యమని అన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుతోంది. కొన్ని దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణ భారతంలో అభివృద్ధి మెరుగ్గా ఉన్నా.. జననాల రేటు తగ్గిపోతోంది. జనాభా విషయంలో ఉత్తరప్రదేశ్, బిహార్ మనల్ని కాపాడుతున్నాయి. జపాన్, జర్మనీ దేశాలు జనాభా కావాలని అడుగుతున్నాయి. మన జనాభా పెరిగితే అన్ని దేశాల్లో భారతీయులు పెరుగుతారు. మరో 20 ఏళ్ల తర్వాత ఎక్కడికెళ్లినా భారతీయులే కనిపించే పరిస్థితి వస్తుంది. ఏపీలో జననాల రేటు 1.5గా ఉంటే మహారాష్ట్రలో 1.5, కేరళలో 1.4, తమిళనాడులో 1.4గా ఉంది. ఉత్తర భారతంలో ఈ రేటు మెరుగ్గా ఉంది. రాష్ట్రంలో జననాల రేటు 1.5 నుంచి 2.1కు పెరగాలి. రిటైరైన వారు కూడా ఉద్యోగాలు చేసే పరిస్థితి రావాలి. రోజంతా కాకపోయినా కనీసం మూడు నాలుగు గంటలు పనిచేస్తే ఉత్పాదకత పెరుగుతుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

సమాజంలో ట్రెండ్ మారాలి..

సమాజంలో ట్రెండ్ మారిందని, డబుల్ ఆదాయం కావాలి.. పిల్లలు వద్దు అనే పరిస్థితి కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు మీ తల్లిదండ్రులు కూడా ఇలాగే అనుకుని ఉంటే ఇప్పుడు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. "జనాభా పెరుగుదలపై చర్చ జరగాలి. నేనే గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని బిల్లు తెచ్చాను. ఇటీవల దాన్ని రద్దుచేశాం. భవిష్యత్తులో ఇద్దరి కంటే ఎక్కువ ఉంటేనే స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులనే చట్టం రావాలి. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం పథకం అమలుచేస్తాం. గతంలో ప్రసూతి సెలవులు రెండు డెలివరీలకే ఉండేది. ఇప్పుడు ఎంతమంది పిల్లల్ని కన్నా సెలవులిస్తాం. ఒక ఇంట్లో గరిష్ఠంగా 25 కిలోల బియ్యం ఇవ్వాలనే నిబంధన కూడా మారుస్తాం" అన్నారు.

గ్రూప్-2లో పురుషుల హవా



గ్రూప్-2 ఫలితాలను విడుదల చేస్తున్న టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లక్షల మంది అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్న తెలంగాణ గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. గత ఏడాది డిసెంబరు 15, 16 తేదీల్లో నిర్వహించిన ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థుల మార్కులతో పాటు.. జనరల్ ర్యాంకుల జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు. దీంతో పాటు.. గ్రూప్-2 ఫైనల్ కీ, మాస్టర్ క్వశ్చన్ పేపర్లతోపాటు.. అభ్యర్థులు తమ ఐడీతో లాగిన్ అయ్యి ఓఎంఆర్ షీట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సారి ఫలితాల్లో టాప్-10 ర్యాంకర్లంతా పురుషులే కావడం గమనార్హం..! 447 మార్కులతో నారు వెంకట హరవర్ధన్(ఓసీ-మల్టీజోన్ 1) టాపర్‌గా నిలిచారు. ఈయన మొత్తం 600 మార్కుల్లో 74.5% సాధించారు. ఆ తర్వాతి స్థానాల్లో 444 మార్కులతో వడ్లకొండ సచిన్(బీసీ-బీ-మల్టీజోన్ 1), 439 మార్కులతో బి.మనోహర్ రావు(బీసీ-డీ, మల్టీ జోన్ 2) నిలిచారు. మహిళల్లో 408 మార్కులతో లక్కిరెడ్డి వినిషారెడ్డి(ఓసీ-మల్టీజోన్ 2) టాపర్‌గా నిలవగా, 406 మార్కులతో బైకాడి సుస్మిత(బీసీ-బీ, మల్టీజోన్ 1), 399 మార్కులతో కొప్పు శ్రీవేణి(బీసీ-డీ, మల్టీజోన్ 2) తర్వాతి స్థానాలను సాధించారు.

చెల్లని అభ్యర్థులు 13,315

వివిధ ప్రభుత్వ శాఖల్లోని మొత్తం 783 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ఈ పరీక్షను నిర్వహించగా.. 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,49,964 మంది రెండ్రోజుల్లో రోజుకు రెండేసి సెషన్లలో 4 పేపర్లకు జరిగిన పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 13,315 మంది చెల్లని(ఇన్‌వ్యాలిడ్) అభ్యర్థులుగా ప్రకటించారు. మిగతా 2,36,649 మంది అభ్యర్థులతో జనరల్ ర్యాంకింగ్ జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఫైనల్ కీ, మాస్టర్ క్వశ్చన్ పేపర్లను ఏప్రిల్ 9 వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు తమ ఓఎంఆర్ షీట్లను వ్యక్తిగత లాగిన్‌లలో టీజీపీఎస్సీ ఐడీ, హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ వివరాలను నమోదుచేసి.. రిజిస్టర్డ్ మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీ ఆధారంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బుర్రా వెంకటేశం తెలిపారు. జనరల్ ర్యాంకింగ్స్ ఆధారంగా తగిన సంఖ్యలో అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపిక చేస్తారు. వారికి వ్యక్తిగతంగా, టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా సమాచారం అందిస్తారు. నోటిఫికేషన్ ఇచ్చిన సమయంలో పేర్కొన్న ప్రకారం.. అభ్యర్థులు అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచుకోవాలని టీజీపీఎస్సీ కోరింది. ఏవైనా సాంకేతికపరమైన సమస్యలు తలెత్తితే.. టీజీపీఎస్సీ హెల్ప్‌డెస్క్‌ను 040-23542185, 040-23542187 నంబర్లకు ఫోన్ చేసి, సంప్రదించాలని కోరింది.

సివిల్స్‌కు సిద్ధమవుతూ..

కోదాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2లో 447 మార్కులతో టాపర్‌గా నిలిచిన నారు వెంకట హర్షవర్ధన్‌రెడ్డి స్వస్థలం సూర్యాపేట జిల్లా కోదాడ. ఈయన తండ్రి రవణారెడ్డి కోదాడ కేఆర్ఆర్ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న హర్షవర్ధన్.. తొలి ప్రయత్నంలోనే గ్రూప్-2ను సాధించారు. ఖమ్మంలో పదోతరగతి, విజయవాడలో ఇంటర్, 2021లో బీటెక్ పూర్తిచేసిన హర్షవర్ధన్.. సివిల్స్ కోసం ఢిల్లీలో కోచింగ్ తీసుకుంటున్న సమయంలో.. 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలవ్వడంతో.. ఈ పరీక్షలపై దృష్టి సారించారు.

గ్రూప్-2 రాష్ట్ర టాపర్లు..

ర్యాంకు	పేరు	మార్కులు	రిజర్వేషన్/ మల్టీజోన్
1	నారు వెంకట హరవర్ధన్	447	ఓసీ/1
2	వడ్లకొండ సచిన్	444	ఓసీ/1
3	బి.మనోహర్‌రావు	439	బీసీ-డీ/2
4	శ్రీరాం మధు	438	బీసీ-బీ/2
5	చింతల్‌పల్లి ప్రీతమ్ రెడ్డి	431	ఓసీ/1
6	అఖిల్ ఎర్ర	430	ఓసీ/2
7	గొడ్డేటి అశోక్	425	బీసీ-బీ/1
8	చిమ్ముల రాజశేఖర్	423.93	ఓసీ/2
9	మేకల ఉపేందర్	423.12	బీసీ-డీ/1
10	కరింగు నరేశ్	422	బీసీ-బీ/2

మహిళా టాపర్లు..

ర్యాంకు	పేరు	మార్కులు	రిజర్వేషన్/ మల్టీజోన్
1	లక్కిరెడ్డి వినిషారెడ్డి	408	ఓసీ/2
2	బైకాడి సుస్మిత	406	బీఈ-బీ/1
3	కొప్పు శ్రీవేణి	399	బీసీ-డీ/2
4	వీరంరెడ్డి శ్రీలత	393	ఓసీ/2
5	గొట్టిముక్కుల స్నేహ	390	బీసీ-బీ/2
6	బిల్ల శ్రావణి	389	బీసీ-బీ/1
7	ఎరడ్ల నిఖిత	387	ఓసీ/1
8	ప్రవంతి	386.56	ఓసీ/2
9	మిట్యాల సాయిచందన	386.11	బీసీ-డీ/1
10	ధారావత్ అనూష	385	ఎస్టీ/2

సాఫ్ట్‌వేర్ నుంచి గ్రూప్-2కు..

సిద్దిపేట కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెండో ర్యాంకు సాధించిన వడ్లకొండ సచిన్.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్సాన్‌పల్లికి చెందిన వారు. ఢిల్లీలోని బీఎంఎల్ ముంజాల్ వర్సిటీలో ఉన్నత విద్య పూర్తిచేసి, రెండేళ్లు సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేశారు. పోటీ పరీక్షలపై ఆసక్తితో గ్రూప్-2పై దృష్టిసారించి, రెండో ర్యాంకు సాధించారు. ఈయనకు గ్రూప్-1లో 461.5 మార్కులు వచ్చాయి.

ప్రభుత్వోద్యోగాలను సాధిస్తూ..

నారాయణఖేడ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మూడో ర్యాంకు సాధించిన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ డివిజన్ సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌కు చెందిన బి.మనోహర్‌రావు.. ఇప్పటికే పలు ప్రభుత్వోద్యోగాలను సాధించారు. నారాయణఖేడ్‌లో డిగ్రీ పూర్తిచేసిన మనోహర్.. 2012లో హైదరాబాద్ వీవీ కళాశాలలో ఎకనామిక్స్‌లో పీజీ పూర్తిచేశారు. ఆ తర్వాత బీఈడీ చేసి.. వరుసగా టీజీటీ, పీజీటీ ఉద్యోగాలు సాధించారు. ఆ తర్వాత గ్రూప్-2లో సత్తాచాటి డిప్యూటీ తహసీల్దార్ అయ్యారు. వికారాబాద్ జిల్లాలో కొంతకాలం పనిచేశాక.. ఒకేసారి స్కూల్ అసిస్టెంట్, జేఎల్ ఉద్యోగాలను సాధించారు. దాంతో.. డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగాన్ని వీడి.. స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. మరోసారి గ్రూప్-2కు ర్యాంకు కొట్టారు. గ్రూప్-1లోనూ ఆయన 430 మార్కులను సాధించడం గమనార్హం..!

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director: Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.